PRAJASAKTI Regd.No. 15795/68
సిటీ◆
ప్రజాశక్తి
ప్రతి అక్షరం ప్రజల పక్షం
Published from Vijayawada, Visakhapatnam, Kurnool, Tirupathi, Rajahmundry, Srikakulam, Ongole and Ananthapuramu
సంపుటి : 43 సంచిక : 32 | విజయవాడ, శుక్రవారం 1 సెప్టెంబర్ 2023 | 6+8 పేజీలు వెల : 5.50
Vol No | Vijayawada, Friday 1 September 2023 | Rs

మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

- నలుగురి మృతి
- ఘర్షణ ప్రాంతాలకు వెళ్లకుండా భద్రతా సిబ్బందిని అడ్డుకుంటున్న మెయితీ మహిళా గ్రూపులు

లోపలి పేజీలో..



హోరాహోరీ తప్పదు

- వికెట్ కీపర్‌గా ఇషాన్
- టీమిండియా కోచ్ ద్రావిడ్

లోపలి పేజీలో..



గురువారం ముంబయి సమావేశంలో ఇండియా ఫోరం నేతలు

ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే లక్ష్యం

ఇండియా ఫోరం నేతల ఉద్ఘాటన


ముంబయిలో ప్రారంభమైన రెండు రోజుల సమావేశం

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

దేశంలో రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని కాపాడేందుకు తాము కలిసి వచ్చామని ఇండియా బ్లాక్ నేతలు పునరుద్ఘాటించారు. నరేంద్ర మోడీ నేతృత్వంలోని బిజెపిని సాగనంపేందుకు కసరత్తు జరుగుతోందని వారు తెలిపారు. ఇండియా ఫోరమ్ మూడవ విడత సమావేశం గురువారం సాయంత్రం ఇక్కడి బద్రా కుర్లా కాంప్లెక్స్‌లోని గ్రాండ్ హయత్ హోటల్‌లో ప్రారంభమైంది. ఇది రెండు రోజుల పాటు జరుగుతుంది. ఈ సమావేశానికి ఆరుగురు ముఖ్యమంత్రులతో సహా 28 ప్రతిపక్ష పార్టీలకు చెందిన 63 మంది నేతలు హాజరయ్యారు. శుక్రవారం చర్చించాల్సిన అజెండాను ఆమోదించనున్నారు. ఈ సమావేశంలో ఇండియా కూటమి లోగోను ఎంపిక చేస్తుందని భావిస్తున్నారు. కాంగ్రెస్ నేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీ, మల్లికార్జున ఖర్గే, సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి, సిపిఐ ప్రధాన కార్యదర్శి డి రాజా, ముఖ్యమంత్రులు నితీశ్ కుమార్ (జెడియు), ఎంకె స్టాలిన్ (డిఎంకె), మమతా బెనర్జీ (టిఎంసి), అరవింద్ కేజ్రీవాల్, భగవంత్‌సింగ్ మాన్ (ఆప్), హేమంత్ సోరెన్ (జెఎంఎం), మాజీ ముఖ్యమంత్రులు శరద్ పవార్ (ఎన్‌సిపి), ఉద్ధవ్ థాకరే (శివసేన-యుటి), లాలూ ప్రసాద్ యాదవ్ (ఆర్‌జెడి), అఖిలేష్ యాదవ్ (ఎస్‌పి), మెహబూబా ముఫ్తీ (పిడిపి), ఆర్‌జెడి నేతలు తేజస్వీ యాదవ్, మనోజ్ ఝా, ఎస్‌పి నేత రామ్ గోపాల్ యాదవ్, ఆప్ నేత రాఘవ్ చద్దా సహా పలువురు నేతలు ఈ సమావేశానికి హాజరయ్యారు. అనంతరం ఉద్ధవ్ థాకరే ఏర్పాటుచేసిన విందుకు గురువారం రాత్రి 9 గంటలకు నేతలు హాజరయ్యారు.

దేశ ఐక్యతే నేటి ఆవశ్యకత : లాలూ ప్రసాద్

దేశ ఐక్యత, సార్వభౌమత్వాన్ని బలోపేతం చేయడం, రాజ్యాంగాన్ని, ప్రజాస్వామ్యాన్ని పరిరక్షించడం నేటి ఆవశ్యకత అని బీహార్ మాజీ ముఖ్యమంత్రి లాలూ ప్రసాద్ యాదవ్ అన్నారు. "పేదరికం, నిరుద్యోగం, రైతుల సంక్షేమం వంటి సమస్యలను పరిష్కరించడంలో మోడీ ప్రభుత్వం విఫలమైంది. ఇండియా కూటమి సమావేశంలో, మేము ఒక ఉమ్మడి కార్యక్రమాన్ని రూపొందించడానికి కృషి చేస్తాం. బిజెపికి వ్యతిరేకంగా ఉమ్మడి అభ్యర్థులను నిలిపేందుకు కృషి చేస్తాం' అని ఆయన అన్నారు. ప్రజలు సరైన ప్రత్యామ్నాయాన్ని కోరుకుంటున్నారని, ఇండియా కూటమి దానిని అందిస్తోందని బీహార్ ఉప ముఖ్యమంత్రి, ఆర్జేడి నేత తేజస్వి యాదవ్ పేర్కొన్నారు. "సమాజాన్ని విభజించే వారికి" ప్రజలు తగిన బుద్ధి చెబుతారని తేజస్వి యాదవ్ అన్నారు. "ప్రజల అంచనాలను అందుకోకపోతే ప్రజలు మమ్మల్ని క్షమించరు" అని అన్నారు. దేశాన్ని ఏకం చేసేందుకు కూటమి కృషి చేస్తోందని మిగతా 5లో


ప్రభుత్వ ఆర్థిక చేయూతతో అమెరికాలో విద్యనభ్యసించిన సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాలకు చెందిన విద్యార్థులను అభినందిస్తున్న ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి

లోపలి పేజీలో..

జగన్ విదేశీ పర్యటనకు కోర్టు అనుమతి

ప్రజాశక్తి - హైదరాబాద్ బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి, ఎంపి విజయసాయిరెడ్డి విదేశీ పర్యటనకు సిబిఐ న్యాయస్థానం అనుమతిచ్చింది. దేశం విడిచి వెళ్లరాదన్న బెయిల్ షరతులను కోర్టు సడలించింది. లండన్‌లో ఉన్నత విద్యాభ్యాసం చేస్తున్న తమ కుమార్తె దగ్గరకు వెళ్లేందుకు అనుమతి కోరుతూ సిబిఐ కోర్టులో వైఎస్ జగన్ దాఖలుచేసిన పిటిషన్‌పై వాదనలు విన్న న్యాయమూర్తి గురువారం తీర్పు చెప్పారు. సెప్టెంబర్ రెండు నుంచి 12 రోజుల పాటు సిఎం జగన్ లండన్‌లో పర్యటించనున్నారు. యూనివర్సిటీలతో రాష్ట్ర ప్రభుత్వ ఒప్పందాల కోసం యుకె, యుఎస్, జర్మనీ, దుబాయ్, సింగపూర్ వెళ్లేందుకు అనుమతి ఇవ్వాలని కోరుతూ ఎంపి విజయసాయిరెడ్డి దాఖలు చేసిన పిటిషన్‌పై వాదనలు విన్న సిబిఐ న్యాయస్థానం.. ఆయన విదేశాలకు వెళ్లేందుకు అనుమతిస్తూ విచారణ ముగించింది.

అదాని అక్రమాలు

- డొల్లకంపెనీలతో మాయాజాలం
- నల్లడబ్బును తెల్లగా మార్చిన వైనం
- షేర్ల విలువ కృత్రిమంగా పెంపు
- మోడీ అధికారానికొచ్చాక ఆగిన సెబి దర్యాప్తు
- ఆ తరువాత కొనసాగిన ఆర్థిక నేరాలు
- ఒసిసిఆర్‌పి నివేదిక

న్యూఢిల్లీ : విదేశాల్లో ఉన్న నల్లధనాన్ని దేశంలోకి తీసుకువచ్చి ప్రజలందరికీ పంచుతానంటూ 2014 ఎన్నికలకు ముందు ప్రధాని అభ్యర్థిగా నరేంద్రమోడీ ఇచ్చిన హామీ గుర్తుంది కదూ! ఆ ఎన్నికల్లో గెలిచి కేంద్రంలో మోడీ ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఆ హామీ అటకెక్కింది. ఆ సంగతి అలా ఉంచితే ... మోడీకి అత్యంత సన్నిహితుడైన గౌతమ్ అదానీ వేల కోట్ల రూపాయల బ్లాక్‌మనీని వైట్‌గా మార్చారంటూ లాభాపేక్షలేని సంస్థ ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ (ఒసిసిఆర్‌పి) తాజాగా ఓ నివేదికను విడుదల చేసింది. ఆ నివేదికలోని పూర్తి వివరాలను ఫైనాన్షియల్ టైమ్స్, గార్డియన్ పత్రికలు ప్రచురించాయి. ఆ కథనాల ప్రకారం దీనికోసం పన్ను ఎగవేత స్వర్గధామాలుగా ప్రసిద్ధి చెందిన దేశాల్లో (తక్కువ, లేదా అసలు పన్ను లేని దేశాలు) తన కుటుంబానికి అత్యంత సన్నిహితులతో అదాని గ్రూపు డొల్లకంపెనీలను ఏర్పాటు చేయించింది. మన దేశంలోనూ ఆ తరహా కంపెనీలను ఏర్పాటు చేసింది. డొల్ల కంపెనీలు, గొలుసు కంపెనీల సహాయంతో ఇక్కడ నుండి నల్లడబ్బును ఆ దేశాలకు పంపించి, ఆ దేశాల్లోని డొల్ల కంపెనీల ద్వారా తిరిగి తమ సంస్థలోనే పెట్టుబడులను పెట్టించింది. పెద్ద ఎత్తున ఇన్‌సైడ్ ట్రేడింగ్‌కు పాల్పడింది. ఈ చర్యల ద్వారా మార్కెట్‌లో తమ సంస్థ షేర్ల విలువ భారీగా పెరిగేలా కృత్రిమ బూమ్‌ను సృష్టించింది. భారీ మొత్తంలో మదుపర్ల సొమ్మును అదానీ సంస్థ కాజేసింది. ఇంకా దిగ్భ్రాంతికరమైన విషయమేమంటే... మార్కెట్‌లో అదాని గ్రూపు చేస్తున్న ఈ అక్రమాల వ్యవహారం 2014లోనే సెబితో పాటు, ఇడిల దృష్టికి వచ్చిందని, ప్రాథమిక స్థాయిలో దర్యాప్తును ప్రారంభించినప్పటికీ ఆ ఎన్నికల్లో నరేంద్ర మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో విచారణ ప్రక్రియను పక్కన మిగతా 5లో





సుప్రీం జోక్యం చేసుకోవాలి : సిపిఎం

అదానీ గ్రూపు తన కంపెనీల స్టాక్ ధరలను తారుమారు చేసి, వాటి ఆస్తుల విలువను అడ్డగోలుగా పెంచేందుకు అక్రమాలకు పాల్పడిందనడానికి తాజా ఆధారాలు బయటపడ్డాయి, కాబట్టి ఈ అంశంలో సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని సిపిఎం పొలిట్‌బ్యూరో కోరింది. పార్టీ పొలిట్‌బ్యూరో గురువారం నాడిక్కడ ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేసింది. అదానీ గ్రూప్ అక్రమాలపై ఆర్గనైజ్డ్ క్రైమ్ అండ్ కరప్షన్ రిపోర్టింగ్ ప్రాజెక్టు అందజేసిన సమాచారం (ఇన్‌పుట్స్) ఆధారంగా 'ది ఫైనాన్సియల్ టైమ్స్', 'ది గార్డియన్' పత్రికలు వార్తా కథనాలు వెలువరించాయి. వినోద్ అదానీకి చెందిన ఇద్దరు అత్యంత సన్నిహితులు బెర్ముడాలో పెట్టుబడుల నిధి (ఇన్వెస్ట్‌మెంట్ ఫండ్)ను ఎలా ఉపయోగించుకున్నారో, అదానీ కంపెనీల్లో కోట్ల డాలర్ల షేర్లను కొనుగోలు చేసేందుకు షెల్ కంపెనీలు (డొల్ల సంస్థలు)ను ఏ విధంగా ఏర్పాటు చేశారో ఈ వార్తా కథనాలు స్పష్టంగా వెల్లడించాయని పొలిట్‌బ్యూరో వెల్లడించింది. అదానీ గ్రూప్ కంపెనీలకు విదేశీ నిధుల వ్యవహారాన్ని 2014లో సెబీ పరిశీలించిందని, అయితే, ఆ తరువాత విచారణను మూసేసిందని పొలిట్ బ్యూరో పేర్కొంది. అదానికి ప్రధానమంత్రి మోడీ అండ దండలున్నందున స్టాక్ మార్కెట్‌లో పెద్దయెత్తున జరుగుతున్న మోసాలు, భారీ అక్రమాలపై ఏ రెగ్యులేటరీ అథారిటీ కూడా ఎలాంటి చర్యలు తీసుకోలేదని ఈ కథనాలు నిర్ధారించాయని పొలిట్‌బ్యూరో తెలిపింది. తాజాగా వెలుగుచూసిన ఆధారాలను బట్టి అదానీ భాగోతంపై చిత్తశుద్ధితో కూడిన విచారణ అవసరం. ఇందులో ఎలాంటి దాపరికం లేకుండా చూసేందుకు సుప్రీంకోర్టు జోక్యం చేసుకోవాలని పొలిట్‌బ్యూరో కోరింది.

విచారణ అంటే ఎందుకంత వణుకు : రాహుల్ 5

ఇంటి నుండే రిజిస్ట్రేషన్

- గ్రామ సచివాలయాల్లో ప్రారంభం
- జగనన్న భూహక్కు, రక్షపై సమీక్షలో సిఎం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

రిజిస్ట్రేషన్ ప్రక్రియను ఇంటినుంచే పూర్తిచేసేవిధంగా నూతన సాంకేతికతను తీసుకువస్తున్నట్లు ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి తెలిపారు. జగనన్న భూహక్కు, భూరక్ష కార్యక్రమంపై గురువారం ఉదయం క్యాంపు కార్యాలయంలో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఇప్పటికే కొన్ని గ్రామ సచివాయాల్లో ఈ కార్యక్రమం అమలు జరుగుతోందని చెప్పారు. ఈ ప్రక్రియ ద్వారా రిజిస్ట్రేషన్ వ్యవస్థను నేరుగా గ్రామాల్లోకి తీసుకువస్తున్నట్లు చెప్పారు. ప్రతి గ్రామంలోనూ సర్వేయరు ఉండే విధంగా దీనిని రూపొందిస్తున్నట్లు తెలిపారు. భూయజమానులకు హక్కుల పరిరక్షణ, రికార్డుల్లో స్వచ్ఛత, కచ్చితత్వం మెరుగుదలకు ఈ వ్యవస్థ ఎంతగానో ఉపయోగపడుతుందన్నారు.

అలాగే ప్రభుత్వం ఏమి చేసినా తప్పుడు ప్రచారం చేయడమే కొందరు పనిగా పెట్టుకున్నారని అన్నారు ఫేజ్-2 సర్వే పూర్తయిన గ్రామాల్లో అన్ని రకాల రిజిస్ట్రేషన్ కార్యక్రమాలు పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు.

మొదటిదశ గ్రామాల్లో రిజిస్ట్రేషన్లపై సమీక్ష చేయాలని పేర్కొన్నారు. రిజిస్ట్రేషన్ల కోసం ప్రజలు వేరేచోటకు వెళ్లకుండా చూడాలని తెలిపారు. భూ వివాదాలు పరిష్కరించేందుకు మండల స్థాయిలో భూ వివాదాల మొబైల్ కోర్టులు కూడా నడిచేలా తగిన చర్యలు తీసుకోవాలని తెలిపారు.

95 శాతం గ్రామాల్లో డ్రోన్‌సర్వే పూర్తి

రాష్ట్రంలో 13,460 గ్రామాలకుగాను 12,836 గ్రామాల్లో అంటే 95 శాతం డ్రోన్ సర్వే పూర్తయిందని అధికారులు ఈ సందర్భంగా సిఎం దృష్టికి తీసుకువచ్చారు. మిగిలిన పనిని అక్టోబరు 15లోగా పూర్తి చేస్తామని చెప్పారు. 81 శాతం గ్రామాల్లో సర్వే ఇమేజ్ ప్రక్రియ పూర్తయిందని, 60 శాతం గ్రామాల్లో ఓఆర్‌ఐలను జిల్లాలకు పంపించాలన్నారు. 3,240 రోవర్లు సర్వేలో ఉన్నాయని, గతంతో పోల్చుకుంటే 1,620 అదనంగా తెప్పించామని వివరించారు. ఫేజ్-2లో భాగంగా రెండువేల గ్రామాల్లో భూహక్కు పత్రాల పంపిణీకి సన్నాహాలు చేశామన్నారు. అక్టోబరు 15 నాటికి రెండో దఫా సర్వే చేపడుతున్న గ్రామాల్లో రిజిస్ట్రేషన్ కార్యాలయాలు ఏర్పాటు చేస్తామని తెలిపారు. అలాగే మున్సిపల్ శాఖ పరిధిలో సర్వే ప్రగతిని కూడా సిఎంకు వివరించారు. 91.93 శాతం ఆస్తుల వెరిఫికేషన్ పూర్తయిందని తెలిపారు. 66 మున్సిపాలిటీల్లో ఓఆర్‌ఐ ప్రక్రియ ముగిసిందని తెలిపారు. ప్రత్యేక బృందాల ఏర్పాటు ద్వారా సర్వే ప్రక్రియను ముమ్మరం చేయాలని సిఎం ఆదేశించారు.


రిజిస్ట్రేషన్లు లేకపోవడంతో బోసిపోయిన మచిలీపట్నం రిజిస్ట్రార్ కార్యాలయం

నిలిచిన రిజిస్ట్రేషన్లు

కొత్తసాఫ్ట్‌వేర్‌తో మందగించిన కార్యకలాపాలు

ప్రజాశక్తి - విజయవాడ

ఉమ్మడి కృష్ణా జిల్లాలో గురువారం రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. ప్రస్తుతం ఉన్న సాఫ్ట్‌వేర్ స్థానంలో కొత్త వర్షన్‌ను ఇన్‌స్టాల్ చేస్తుండడంతో కార్యకలాపాలకు తాత్కాలిక అంతరాయం ఏర్పడినట్లు ఆయా రిజిస్ట్రార్ కార్యాలయాల అధికారులు తెలిపారు. రోజువారీగా రిజిస్ట్రేషన్‌లో జరుగుతున్న తప్పొప్పులు, దొంగ డాక్యుమెంట్ల నివారణ, త్వరగా సేవలు అందించడానికి రాష్ట్ర వ్యాప్తంగా రిజిస్ట్రార్ కార్యాలయాల్లోని లేటెస్ట్ టెక్నాలజీ (కొత్త వర్షన్) ఇన్‌స్టాల్ చేస్తున్నారు. దీనిలో భాగంగా ఎన్‌టిఆర్ జిల్లా విజయవాడలోని గాంధీనగర్, గుణదల, పటమట రిజిస్ట్రేషన్ కార్యాలయాల్లో కొత్త సాఫ్ట్‌వేర్‌ను ఇన్‌స్టాల్ చేశారు. ఇందులో ఆధార్ కార్డు ఆధారంగా రిజిస్ట్రేషన్లు జరుగుతాయి. కొత్తసాఫ్ట్‌వేర్ ఇన్‌స్టాల్ వల్ల రిజిస్ట్రేషన్లు మొత్తం ఆగిపోయాయి. ఈ కొత్త వర్షన్‌ను అర్థం చేసుకోవాలన్నా...దానిని సక్రమంగా నిర్వహించాలన్నా కొంత సమయం పడుతుందని, అప్పటి వరకు రిజిస్ట్రేషన్లు వేగంగా జరిగే అవకాశం లేదని అధికారులు తెలిపారు. కృష్ణాజిల్లా మచిలీపట్నంలోనూ రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి. కొత్త సాఫ్ట్‌వేర్‌లో సెక్యూరిటీ విషయాలు లేకపోవడం, సాంకేతిక సమస్యలు తలెత్తడంతో విశాఖలో రిజిస్ట్రేషన్లు నిలిచిపోయాయి.

డిజిపి కార్యాలయ అధికారిపై ఎసిబి విచారణ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

రాష్ట్ర డిజిపి కార్యాలయంలో అవినీతి, అక్రమాలకు పాల్పడుతున్నారనే ఆరోపణలతో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారిపై డిజిపి కెవి రాజేంద్రనాథ్‌రెడ్డి విచారణకు ఆదేశించారు. డిజిపి కార్యాలయంలో అసిస్టెంట్ అడ్మినిస్ట్రేటివ్ అధికారి ముపిరాల బాల



సుబ్రమణ్యం అవినీతి, అక్రమాలకు పాల్పడు తున్నట్లు విమర్శలు వచ్చిన నేపథ్యంలో ఆయనను ఆ బాధ్యతల నుంచి తప్పించారు. బాలసుబ్రమణ్యం తన వద్దకు వచ్చిన ఫైళ్లను క్లియర్ చేసేందుకు అవినీతికి పాల్పడుతున్నట్లు పలు ఫిర్యాదులు అందిన నేపథ్యంలో అవినీతిపై విచారణ చేయాలని అవినీతి నిరోధకశాఖ అధికారులను డిజిపి ఆదేశించారు. డిజిపి కార్యాలయంలో కూడా అవినీతి, అక్రమాలు చోటుచేసుకుంటున్న ఘటన వెలుగులోకి రావడం చర్చనీయాంశమైంది.

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ'

- నేటి నుంచి 45 రోజులపాటు టిడిపి ప్రచార కార్యక్రమం

లోపలి పేజీలో..

తేదీ చెప్పలేం



జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదా పునరుద్ధరణపై

సుప్రీంకు తెలియజేసిన కేంద్రం

న్యూఢిల్లీ : జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను పునరుద్ధరించడంపై కేంద్ర ప్రభుత్వం మరోసారి మాటమార్చింది.రాష్ట్ర హోదాను పునరుద్ధరించడంపై గురువారం సానుకూల ప్రకటన చేస్తామని రెండు రోజుల క్రితం సుప్రీంకోర్టుకు తెలిపిన కేంద్రం తాజాగా మళ్లీ మొదటికి వచ్చింది. హోదాను పునరుద్ధరించే తేదీని కచ్చితంగా చెప్పలేమని తేల్చేసింది. అయితే జమ్ముకాశ్మీర్‌లో ఎప్పుడైనా ఎన్నికలు నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నామని చెప్పింది. ప్రధాన న్యాయమూర్తి డివై చంద్రచూడ్ నేతృత్వంలోని రాజ్యాంగ ధర్మాసనం ముందు కేంద్ర ప్రభుత్వం తరపున హాజరైన సొలిసిటర్ జనరల్ తుషార్ మెహతా ఈ విషయాన్ని తెలిపారు. జమ్ముకాశ్మీర్‌కు కేంద్రపాలిత హోదా తాత్కాలికమే అంటూ పాత పాటే మళ్లీ పాడారు.

జమ్ముకాశ్మీర్‌కు ప్రత్యేక హోదా, ఆర్టికల్ 370 రద్దును సవాల్ చేస్తూ దాఖలైన పిటీషన్ల విచారణలో భాగంగా గురువారం వాదనల్లో.. 'జమ్ముకాశ్మీర్‌కు రాష్ట్ర హోదాను ప్రకటించడంపై నేను ప్రస్తుతం కచ్చితమైన కాల వ్యవధిని ఇవ్వలేకపోతున్నాను. కొన్ని దశాబ్దాలుగా అనేక అవాంతరాలను ఎదుర్కొన్నందున జమ్ముకాశ్మీర్‌కు పూర్తి స్థాయిలో రాష్ట్ర హోదా ఇచ్చేందుకు మరికొంత సమయం పట్టవచ్చు. అయితే జమ్ముకాశ్మీర్‌ను సంపూర్ణ రాష్ట్రంగా మార్చేందుకు మేము క్రమంగా ముందుకు వెళుతున్నామని నేను మీకు హామీ ఇస్తున్నాను' అని మెహతా తెలిపారు.

2019లో ఆర్టికల్ 370ని రద్దు చేసిన తర్వాత నుంచి జమ్ముకాశ్మీర్‌లో అసాధారణ మార్పులు చోటుచేసుకున్నాయని తెలిపారు. మెహతా వాదనలను పిటిషనర్ల తరపు సీనియర్ న్యాయవాది కపిల్ సిబాల్ వ్యతిరేకించారు. ప్రస్తుతం జమ్ముకాశ్మీర్‌లో 5,000 మందిని గృహనిర్బంధంలో ఉంచారని, రాష్ట్రవ్యాప్తంగా సెక్షన్ 144 అమల్లో ఉందని, ప్రజలు ఆసుపత్రికి కూడా వెళ్లలేని స్థితిలో ఉన్నారని కపిల్ సిబాల్ వాదించారు. మెహతా వాదనలను ప్రధాన న్యాయమూర్తి కూడా తిరస్కరించారు. రాజ్యాంగ ధర్మాసనానికి కావాల్సింది జమ్ముకాశ్మీర్‌లో అభివృద్ధి పనులు గురించి కాదని, రాష్ట్ర హోదాను ఎప్పుడు పునరుద్ధరిస్తారనేది అని సిజెఐ తెలిపారు. ఈ విచారణ శుక్రవారం కూడా కొనసాగనుంది.

18 నుంచి ప్రత్యేక పార్లమెంటు భేటీ

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కేంద్ర ప్రభుత్వం అనూహ్య నిర్ణయం తీసుకుంది. సెప్టెంబరు 18 నుంచి 22 వరకు ప్రత్యేక పార్లమెంటు సమావేశాలను నిర్వహించాలని నిర్ణయించింది. ఈ సమావేశాల్లో ఐదు సిట్టింగ్స్ ఉంటాయని తెలిపింది. ఈ సమావేశాల్లో సత్ఫలితాలిచ్చే చర్చలు జరుగుతాయని ఆశిస్తున్నట్లు తెలిపింది. ఈ మేరకు గురువారం కేంద్ర పార్లమెంటరీ వ్యవహారాలశాఖ మంత్రి ప్రహ్లాద్ జోషీ ట్విట్టర్‌లో ప్రకటించారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు సెప్టెంబరు 18 నుంచి 22 వరకు జరుగుతాయని తెలిపారు. 17వ లోక్‌సభలో 13వ సెషన్, రాజ్యసభ 261వ సెషన్ జరుగుతాయని పేర్కొన్నారు. ఈ సమావేశాల్లో ఐదు సిట్టింగ్స్ ఉంటాయన్నారు. ఈ సమావేశాలను ఎందుకు నిర్వహిస్తున్నదీ ప్రభుత్వ వర్గాలు వెల్లడించలేదు. ఈ సమావేశాలు నూతన పార్లమెంటు భవనంలో నిర్వహిస్తారా? అనే అంశంపై స్పష్టత లేదు. లోక్‌సభ, రాజ్యసభ సంయుక్త సమావేశం కూడా కాకపోవచ్చునని తెలుస్తోంది. ఉమ్మడి పౌరస్మృతి బిల్లును ప్రవేశపెట్టే అవకాశాలు ఉన్నాయా? అని కొందరు ఆలోచిస్తున్నారు. ప్రతిపక్ష ఇండియా కూటమి చకచకా పావులు కదుపుతుండటం, జి-20 సమావేశాల అనంతరం ఈ ప్రత్యేక సమావేశాలు జరగబోతుండటం ఆసక్తికరంగా మారింది.

ఖరీఫ్‌కు కరువు దెబ్బ

- 20 లక్షల ఎకరాల్లో సాగు లేదు
- తీవ్ర వర్షాభావం, డ్రైస్పెల్ కోరల్లో మూడొంతుల రాష్ట్రం
- 14 జిల్లాలు.. 416 మండలాల్లో తక్కువ వర్షం
- కంటింజెన్సీపై ప్రభుత్వం మీనమేషాలు


ప్రకాశం జిల్లా యర్రగొండపాలెంలో నీరులేక ఎండిపోయిన పత్తి చేనులో మేస్తున్న పశువులు

ప్రజాశక్తి ప్రత్యేక ప్రతినిధి- అమరావతి

ఖరీఫ్ సాగుపై కరువు దెబ్బ పడింది. ఆగస్టు నెలాఖరికి కూడా లక్షలాది ఎకరాలు విత్తనం పడక బీడుపడ్డాయి. ఇప్పటికి కావాల్సిన సాధారణ సాగులో ఇరవై లక్షల ఎకరాల్లో పంటలు సాగు కాలేదని ప్రభుత్వ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. వర్షాల్లేక భూములు నెర్రెలిచ్చుతున్నాయి. మూడొంతుల రాష్ట్రం తీవ్ర వర్షాభావం కోరల్లో చిక్కుకుంది. సగానికిపైగా మండలాలు డ్రైస్పెల్ (వర్షానికి వర్షానికి మధ్య అంతరం)లో మగ్గుతున్నాయి. చాలా చోట్ల చినుకు జాడ లేక నెల రోజులు దాటిపోయింది. ఆగస్టు చివరాఖరుకు పడాల్సిన సాధారణ వర్షంలో 25 శాతం తక్కువ పడింది. 14 జిల్లాల్లో తక్కువ వర్షపాతం నమోదైంది. రాష్ట్ర వ్యాప్తంగా 679 మండలాలుండగా 416 మండలాల్లో (62 శాతం) తక్కువ వర్షం కురిసింది. మరీ 42 మండలాల్లో పరిస్థితి ఘోరంగా ఉంది. ఖరీఫ్ పంటల సేద్యానికి అదను తప్పింది. నీటి వసతి గ్యారంటీ ఉన్న కాల్వల కింద తప్ప ఇతర ప్రాంతాల్లో సాగు నిలిచిపోయింది. మెట్ట సేద్యానికి కరువు పరిస్థితులు ఆటంకంగా తయారయ్యాయి. వేసిన పంటలు వర్షాభావం, డ్రైస్పెల్స్ వలన వాడిపోతుండగా, మిగతా 2లో

ఆగస్టు నెలాఖరుకు సాగు (లక్షల ఎకరాలు)

పంట	సీజన్ నార్మల్	ఈపాటికి కావాల్సిన సాగు	సాగైంది
వరి	38,80	30.15	26.37
తృణధాన్యాలు	4.70	3.72	3.25
పప్పుధాన్యాలు	7.87	5.60	3.30
ఆహారధాన్యాలు	51.40	39.47	32.92
వేరుశనగ	16.10	15.20	7.15
నూనెగింజలు	17.40	16.32	8.30
పత్తి	15.45	13.75	9.35
మొత్తం	85.97	71.17	51.27

వైజాగ్ స్టీల్‌కు టాటా ఇంటర్నేషనల్ సాయం

- రా మెటీరియల్ కొనుగోలుకు రూ.830 కోట్ల పెట్టుబడి
- ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యరామ్

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

వైజాగ్ స్టీల్‌ప్లాంట్ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా 931 రోజులుగా కార్మికులు చేపడుతున్న ఆందోళనకు టాటా ఇంటర్నేషనల్ సంస్థ పరోక్షంగా మద్దతు తెలపడం విశేషం. విశాఖ ఉక్కు మనుగడను ప్రశ్నార్థకం చేసేలాగ ఐరన్ ఓర్ గనులు, బొగ్గు, రా మెటీరియల్ కోసం మూడు నెలల క్రితం ఆర్ఐఎన్ఎల్ యాజమాన్యం పిలిచిన టెండర్లలో టాటా ఇంటర్నేషనల్ సంస్థ రూ.100 మిలియన్ డాలర్లు (రూ.830 కోట్లు) విశాఖ స్టీల్‌కు ఇచ్చేందుకు ముందుకు రావడం చెప్పుకోదగ్గ పరిణామం. ఆస్ట్రేలియా, రష్యా, అమెరికా తదితర చోట్ల ఎక్కడైనా రా మెటీరియల్ కొనుగోలు చేస్తే పెట్టుబడిగా పై నిధులను ఇచ్చేందుకు టాటా సంస్థ ముందుకు రావడం ముదావహంగా స్టీల్‌కార్మికులు భావిస్తున్నారని ఉక్కు పరిరక్షణ పోరాట కమిటీ కన్వీనర్ అయోధ్యారామ్ సంతోషం వ్యక్తం చేశారు. ఈ మేరకు ఆయన గురువారం మీడియాకు ఓ ప్రకటన విడుదల చేశారు. కేంద్ర ప్రభుత్వ ఆధ్వర్యాన గల ఎన్ఎండిసి రోజుకు రెండు లేదా మూడు రేకులు ఐరన్ ఓర్ పంపించాల్సి ఉండగా పంపించడం లేదన్నారు. బచేలి కిరండోల్ ప్రాంతం నుంచి ఐరన్ ఇస్తామని గతంలో హామీ ఇచ్చిన అమలు చేయడం లేదని విమర్శించారు. అదే సందర్భంలో జిఎస్‌డబ్ల్యూ, జెఎస్‌పిఎల్‌కు సరఫరా చేస్తున్నారని, దీనిపై ప్రశ్నిస్తే వర్షాల కారణంగా ఉత్పత్తి తగినంతగా లేదని సాకు చెప్పడం చూస్తే కేంద్రం ఆడిస్తున్న డ్రామా తప్ప మరొకటి కాదని మండిపడ్డారు.

ప్రజాశక్తిపై స్పందన ఫోన్ : 9490099006

ప్రజల పత్రికకు ప్రజలే మార్గదర్శకులు. ప్రజాశక్తిలో మీకు నచ్చిన నచ్చని అంశాలను ఎప్పటికప్పుడు మా దృష్టికి తీసుకువస్తే మరింత పదును పెట్టుకోవడానికి వీలవుతుంది.

94900 99006 ఫోన్ నెంబర్‌కు ఆదివారం మినహా ప్రతి రోజూ మధ్యాహ్నం 12 నుంచి సాయింత్రం 6 గంటల మధ్య మీ అభిప్రాయాలు తెలియజేయవచ్చు. మీరు చెప్పేది క్లుప్తంగా సూటిగా పద్ధతిగా వుండాలి. ఇప్పటికే చాలా మంది పంపుతున్న విమర్శలు, సూచనలు మాకు బాగా ఉపయోగపడుతున్నాయి. వారందరికీ కృతజ్ఞతలు.

అభిప్రాయాలు పంపదలిస్తే..

స్పందన, ప్రజాశక్తి తెలుగు డైలీ, ప్రజాశక్తి భవనం-అమరరెడ్డి కాలనీ, అరవింద హైస్కూల్ దగ్గర, తాడేపల్లి, గుంటూరు జిల్లా - 522 501కు కానీ **editorprajasakthi@gmail.com**కు పంపవచ్చు.

అయోమయంలో ఎంఇఒ-2లు

- పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

పాఠశాల విద్యాశాఖలో ఎంఇఒ-2లు అయోమయంలో ఉన్నారని పిడిఎఫ్ ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ అన్నారు. 674 పోస్టులు మంజూరు చేసి గ్రేడ్-2 ప్రధానోపాధ్యాయులతో భర్తీ చేశారని గురువారం ఒక ప్రకటనలో వివరించారు. ఈ పోస్టులకు సంబంధించిన కేడర్ స్ట్రెంత్ అప్‌డేట్ చేయడం తప్ప జీతాలు చెల్లించే అధికారాలు, విధుల నిర్వహణకు సంబంధించిన జాబ్‌చార్ట్ విడుదల చేయకుండా కాలయాపన చేయడం శోచనీయమని పేర్కొన్నారు. మూడు నెలలుగా జీతాలు చెల్లించకుండా ఆర్థికంగా ఇబ్బందుల్లోకి నెట్టడం సమంజసం కాదని పేర్కొన్నారు. ఇప్పటికే అనేక మండలాల్లో ఎంఇఒ-2లు ఏ పని చేయాలో తెలియడం లేదని అన్నారు. ఎంఇఒల మధ్య సమన్వయం లేక అనేక ఇబ్బందులు పడుతున్న పరిస్థితి ఉందని వివరించారు. వెంటనే ఎంఇఒ-2లకు సంబంధించిన విధుల జాబ్‌చార్జ్, కేడర్ స్ట్రెంత్ అప్‌డేషన్, జీతాలు చెల్లింపు విధివిధానాలు వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.

రొద్దం మండలంలో భూపోరాటం

- అడ్డగించిన టింబక్టు కలెక్టివ్ ట్రస్టు సభ్యులు
- ప్రతిఘటించిన పేదలు, నాయకులు



ప్రజాశక్తి - రొద్దం (సత్యసాయి జిల్లా)

శ్రీ సత్యసాయి జిల్లా రొద్దం మండలం కొగిర రెవెన్యూ గ్రామంలోని ప్రభుత్వ భూమిని ఆక్రమించుకునేందుకు కొందరు ప్రయత్నిస్తుండటంతో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో పేదలు ఆ భూముల్లో దుక్కిదున్నారు. భూములను దౌర్జన్యంగా ఆక్రమించుకున్న టింబక్టు కలెక్టివ్ ట్రస్టుకు చెందిన వారు అడ్డుకునేందుకు ప్రయత్నించడంతో పేదలు ప్రతిఘటించారు. మండలంలోని కొగిర రెవెన్యూ గ్రామానికి చెందిన సర్వే నంబర్ 666 - 669లోని నాలుగువేల ఎకరాల ప్రభుత్వ భూమిని నిరుపేదలు సాగు చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో రొద్దం మండలంలోని కోగిర, కంబాలపల్లి, చాపురం, బీదానపల్లి గ్రామాలకు చెందిన పేదలు భూ పోరాటానికి సిద్ధమయ్యారు. వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి.వెంకటేశ్వర్లు, సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ నేతృత్వంలో పేదలు ఎర్రజెండాలు చేతబూని ట్రాక్టర్లతో భూములను దున్ని, విత్తనాలు వేశారు. ట్రస్టుకు చెందిన కొందరు పేదలపై దాడికి వచ్చారు. వ్యకాస నాయకులు, పేదలు వారిని ప్రతిఘటించారు. ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వి. వెంకటేశ్వర్లు మాట్లాడుతూ.. ఇది ప్రభుత్వ భూమి అని, రెండు తరాల నుంచి ఈ భూములను పేదలు సాగు చేసుకుంటున్నారని తెలిపారు. సిపిఎం జిల్లా కార్యదర్శి ఇంతియాజ్ మాట్లాడుతూ.. భూములు సాగు చేసుకుంటున్న పేదలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు.

సోనియా, రాహుల్‌తో షర్మిల భేటీ

- కెసిఆర్‌కు కౌంట్ డౌన్ ప్రారంభం : షర్మిల

ప్రజాశక్తి-న్యూఢిల్లీ బ్యూరో

కాంగ్రెస్ అగ్రనేతలు సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో వైఎస్ఆర్ తెలంగాణ పార్టీ అధ్యక్షులు వైఎస్ షర్మిల భేటీ అయ్యారు. కెసిఆర్ కౌంట్ డౌన్ ప్రారంభమైందని షర్మిల హెచ్చరించారు. గురువారం న్యూఢిల్లీ అక్బర్ రోడ్ 24లో సోనియా గాంధీ, రాహుల్ గాంధీతో షర్మిల భేటీ అయ్యారు. బ్రేక్‌ఫాస్ట్ మీటింగ్‌లో భాగంగా భర్త అనిల్‌తో కలిసి దాదాపు 20 నిమిషాలకు పైగా కాంగ్రెస్ ముఖ్య నేతలతో ముచ్చటించారు. ఈ భేటీలో తెలంగాణలో తాజా రాజకీయ పరిస్థితులపై చర్చించినట్లు తెలిసింది. రాష్ట్రంలో కాంగ్రెస్‌తో వైటిపి కలిసి పనిచేసే అంశాలపై చర్చించినట్లు సమాచారం. ముఖ్యంగా కాంగ్రెస్‌లో వైటిపి విలీనం చేస్తారనే వార్తల నేపథ్యంలో ఈ భేటీకి ప్రాధాన్యత సంతరించుకుంది. సమావేశం అనంతరం షర్మిల మీడియాతో మాట్లాడారు. సోనియా, రాహుల్‌తో నిర్మాణాత్మకమైన చర్చ జరిగిందన్నారు. తెలంగాణ ప్రజలకు మేలు చేసే దిశలో రాజశేఖర్ రెడ్డి బిడ్డగా నిరంతరం పని చేస్తానని అన్నారు. కెసిఆర్‌కు కౌంట్ డౌన్ ప్రారంభమైందని పేర్కొన్నారు. అయితే కాంగ్రెస్‌లో పార్టీ విలీనం లేదా తెలంగాణలో కాంగ్రెస్‌తో పొత్తుపై మాట్లాడేందుకు షర్మిల నిరాకరించారు. ఈ దిశలో జర్నలిస్టులు వేసిన ప్రశ్నలకు సమాధానం దాటవేశారు. మిగితా అంశాలను హైదరాబాద్‌లో మాట్లాడుతానన్నారు. అనంతరం ఢిల్లీ పర్యటన ముగించుకుని హైదరాబాద్ బయలుదేరి వెళ్లారు.

సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు బేబీరాణికి మాతృవియోగం

ప్రజాశక్తి-కాకినాడ



సిఐటియు అఖిల భారత ఉపాధ్యక్షులు జి.బేబీరాణికి మాతృవియోగం కలిగింది. కొద్ది రోజులుగా తీవ్ర అనారోగ్యంతో బాధపడుతున్న ఆమె తల్లి గోసంగి సూర్యకాంతం (90) గురువారం కాకినాడ రూరల్ మండలం చీడిగలో మృతి చెందారు. సూర్యకాంతంకు ఐదుగురు కుమారులు, ఐదుగురు కుమార్తెలు ఉన్నారు. ఆమె భర్త వెంకటరత్నం కమ్యూనిస్టు భావజాలం కలిగి ఉండేవారు. ఆయన ప్రోత్సాహంతోనే బేబీరాణి పార్టీలోకి వచ్చారు. సూర్యకాంతం భౌతికకాయాన్ని ఆమె స్వగ్రామమైన అంబేద్కర్ కోనసీమ జిల్లా అమలాపురం మండలం ఎస్.గున్నేపల్లి గ్రామానికి తరలించారు. ఇప్పటికే ఆమె నేత్రాలను దానం చేయగా, భౌతికకాయాన్ని అమలాపురం మెడికల్ కళాశాలకు కుటుంబ సభ్యులు శుక్రవారం అందజేయనున్నారు. సూర్యకాంతం మృతి వార్త తెలిసిన వెంటనే అంగన్‌వాడీ రాష్ట్ర కార్యదర్శి కె.సుబ్బరావమ్మ, సిపిఎం జిల్లా కన్వీనర్ ఎం.రాజశేఖర్ తదితరులు ఆమె భౌతికకాయాన్ని సందర్శించి నివాళులర్పించారు. సిపిఎం నాయకులు దువ్వా శేషబాబ్జి, సిహెచ్.రమణి, ఆర్‌పిఐ రాష్ట్ర నాయకులు అయితాబత్తుల రామేశ్వరరావు తదితరులు నివాళులర్పించారు.

సూర్యకాంతం మృతికి సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. అవిశ్రాంత కార్యకర్త అయిన కుమార్తెను కార్మికోద్యమానికి, కమ్యూనిస్టు ఉద్యమానికి అందించిన ధన్యజీవి సూర్యకాంతం అన్నారు. ప్రజా ఉద్యమాల పట్ల ఆమె కుటుంబం సహకారం మరువలేనిదన్నారు. కుటుంబ సభ్యులకు ఆయన ప్రగాఢ సానుభూతి తెలిపారు.

ఉద్యోగుల ధర్నా తేదీ చెప్పండి

- నేటికి హైకోర్టు విచారణ వాయిదా

ప్రజాశక్తి-అమరావతి

కాంట్రిబ్యూటరీ పెన్షన్ స్కీమ్ (సిపిఎస్)ను రద్దు చేసి పాత పెన్షన్ స్కీమ్ (ఒపిఎస్)ను పునరుద్ధరించాలనే డిమాండ్ సాధన కోసం ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం తలపెట్టనున్న బహిరంగ సభకు షరతులు వర్తిస్తాయని హైకోర్టు చెప్పింది. ప్రైవేటు స్థలంలో నిరసన వ్యక్తం చేసినా, తాము విధించే షరతులు అమలు చేయాల్సిందేనని పిటిషనర్లకు చెప్పింది. కరపత్రంలో నాలుగు లక్షల మంది సిపిఎస్ ఉద్యోగులు ఉన్నట్లుగా పేర్కొన్నారని గుర్తు చేసింది. అనుమతివ్వాలంటే వీటిని పరిగణనలోకి తీసుకోవాల్సి వస్తుందని చెప్పింది. నిర్దిష్ట సంఖ్యలో ఉద్యోగులు పాల్గొనేందుకు అనుమతిస్తామని, అది కూడా సెలవు దినంలోనే ఇస్తామని తెలిపింది. షరతులు ఉల్లంఘిస్తే చర్యలు తీసుకునేందుకు పోలీసులకు అధికారం ఉంటుందని పేర్కొంది. ఎప్పుడు నిరసన వ్యక్తం చేసేదీ మరో తేదీని శుక్రవారం జరిగే విచారణలో చెప్పాలని పిటిషనర్లను న్యాయమూర్తి జస్టిస్ కె శ్రీనివాస్‌రెడ్డి గురువారం ఆదేశించారు. సిపిఎస్, విద్యుత్ ఉద్యోగులు ఒకేరోజు నిరసన కార్యక్రమాలను నిర్వహించడానికి వీల్లేదని అన్నారు.

సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌ను తిరిగి అమలుకు సెప్టెంబరు 1న విజయవాడలో బహిరంగసభ, ర్యాలీ నిర్వహణకు ఎపి సిపిఎస్ ఉద్యోగుల సంఘం పిలుపునిచ్చింది. ఈ మేరకు అనుమతి కోరుతూ సంఘం కార్యదర్శి హుస్సేన్ పోలీసులకు వినతిపత్రం సమర్పించగా, పోలీసులు నిరాకరించారు. దీంతో ప్రైవేటు స్థలంలో బహిరంగ సభ నిర్వహించాలని సంఘం నిర్ణయించింది. ఈ వ్యవహారంపై పోలీసులు ఏ నిర్ణయం తీసుకోకపోవడంతో హుస్సేన్ హైకోర్టులో పిటిషన్ దాఖలు చేశారు.



మరోవైపు విద్యుత్ ఉద్యోగులు చేపట్టబోయే నిరసనకు పోలీసులు అనుమతివ్వకపోవడాన్ని సవాల్ చేస్తూ పలు సంఘాలు హైకోర్టులో వ్యాజ్యాలు దాఖలు చేశాయి. వీటిని కూడా జస్టిస్ శ్రీనివాస్‌రెడ్డి విచారణ జరిపారు. విజయవాడలోని ధర్నా చౌక్ లేదా జింఖానా గ్రౌండ్‌లో ధర్నా చేసేందుకు విజయవాడ పోలీస్ కమిషనర్ నిరాకరించడంపై యునైటెడ్ ఎలక్ట్రిసిటీ కాంట్రాక్ట్ వర్కర్స్ అసోసియేషన్, ఎపి ఎలక్ట్రిసిటీ స్టాఫ్ అండ్ వర్కర్స్, ఎపి విద్యుత్ కాంట్రాక్ట్ ఎంప్లాయీస్ యూనియన్, ఎపి విద్యుత్ ట్రేడ్ యూనియన్‌లు హైకోర్టును ఆశ్రయించాయి. విచారణ శుక్రవారం కొనసాగనుంది.

సిపిఎస్ ఆందోళన వాయిదా

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

సిపిఎస్ ఉద్యోగుల చలో విజయవాడ కార్యక్రమాన్ని వాయిదా వేస్తున్నట్లు ఎపిసిపిఎస్ ఉద్యోగ సంఘాలు ప్రకటించాయి. సెప్టెంబరు ఒకటో తేదీన ఈ కార్యక్రమం నిర్వహించేందుకు పోలీసులను అనుమతి కోరగా తిరస్కరించారు. దీంతో ఉద్యోగులు హైకోర్టును ఆశ్రయించారు. తమ కార్యక్రమానికి అనుమతివ్వాలని కోరారు. దీనిపై మరో తేదీ చెప్పాలని కోర్టు సూచించిన నేపథ్యంలో ఆందోళనను వాయిదా వేస్తున్నట్లు ఉద్యోగ సంఘాల నాయకులు ప్రకటించారు.

ధరలను అదుపుచేయడంలో కేంద్రం విఫలం

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి. శ్రీనివాసరావు

ప్రజాశక్తి - పర్చూరు (ప్రకాశం)

నిరుద్యోగ సమస్యను పరిష్కరించడంలో, ధరలను అదుపు చేయడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు విమర్శించారు. ప్రకాశం జిల్లా పర్చూరులో ఆయన విలేకరులతో మాట్లాడుతూ.. దేశంలోని అన్ని వనరులను అంబానీ, అదానీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కట్టబెడుతున్నాయని విమర్శించారు. అప్పులు చేయడంలో దేశంలో మన రాష్ట్రం నాలుగో స్థానంలో ఉండడం పాలనావైఫల్యానికి నిదర్శనమన్నారు. సోలార్ పేరుతో అదానీ సంస్థకు రాయలసీమ ఏజన్సీ ప్రాంతాల్లో 75వేల ఎకరాలు కట్టబెట్టే ప్రయత్నం చేస్తోందని ఆరోపించారు. రాష్ట్రంలో వర్షాభావ, కరువు పరిస్థితులు నెలకొన్నప్పటికీ ప్రభుత్వం పట్టించుకోవడం లేదన్నారు. స్మార్ట్ మీటర్ల వల్ల ప్రమాదం పొంచి ఉందన్న విషయాన్ని ప్రజలు గమనించాలన్నారు. విద్యుత్ బిల్లులు చెల్లించలేక, నిర్వహణ భారం మోయలేక రాష్ట్రంలోని 50 ఎత్తిపోతల పథకాలు మూలనపడ్డాయని తెలిపారు. రాష్ట్రానికి ప్రత్యేక హోదా ఇవ్వకుండా బిజెపి ప్రభుత్వం ద్రోహం చేసిందని, దీనిపై అధికార, ప్రతిపక్ష పార్టీలు పోరాటం చేసే స్థితిలో లేవని విమర్శించారు. రూ.400కు గ్యాస్, గృహ వినియోగానికి యూనిట్ విద్యుత్‌ను రూ.1, పరిశ్రమలకు రూ.1.50కు, డిఎస్‌సి ప్రకటించాలని డిమాండ్ చేశారు. ప్రత్యామ్నాయ ఆర్థిక విధానాలపై సిపిఎంతో కలసి వచ్చే పార్టీలతో ఆందోళన చేయనున్నట్లు వివరించారు. అందులో భాగంగా ఈనెల నాలుగన మండల కేంద్రాలలో ధర్నాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ప్రజా సంక్షేమం కోసం సిపిఎం ఆధ్వర్యంలో చేపట్టనున్న ఆందోళన కార్యక్రమాలకు ప్రజలు, పార్టీలు మద్దతు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు వై.వెంకటేశ్వరరావు, ప్రభాకర్‌రెడ్డి, జిల్లా నాయకులు పూనాటి ఆంజనేయులు, తదితరులు పాల్గొన్నారు.



ముఖ్యమంత్రిని కలిసిన విద్యార్థులు, చిత్రంలో మంత్రి మేరుగ నాగార్జున

సిఎంను కలిసిన గురుకుల విద్యార్థులు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

అమెరికాలో చదివే అవకాశం వచ్చిన సాంఘిక సంక్షేమ గురుకులాలకు చెందిన విద్యార్థులు ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని కలిశారు. తాడేపల్లిలోని ఆయన క్యాంపు కార్యాలయంలో సాంఘిక సంక్షేమశాఖ మంత్రి మేరుగ నాగార్జున తోపాటు గురువారం కలిశారు. విద్యార్థుల కుటుంబ నేపథ్యం, విద్యా వివరాలు ఒక్కొక్కరినీ సిఎం అడిగి తెలుసుకున్నారు.

యుఎస్‌లో చదువులు పూర్తయి వచ్చిన తర్వాత కూడా వారి చదువులు కొనసాగించేలా నిరంతరాయంగా పర్యవేక్షించాలని అధికారులకు సిఎం సూచించారు. ఒక్కో విద్యార్థికి ప్రోత్సాహకంగా రూ.లక్ష ఆర్థికసాయం ప్రకటించి శాంసంగ్ ట్యాబ్‌ను అందజేశారు. గతేడాది అమెరికా వెళ్లి కోర్సు పూర్తిచేసుకుని తిరిగి వచ్చిన విద్యార్థులు కూడా సిఎంను కలిసిన వారిలో ఉన్నారు. ఈ కార్యక్రమంలో సాంఘిక సంక్షేమశాఖ ముఖ్యకార్యదర్శి జి జయలక్ష్మి, ఎపిఎస్‌డబ్ల్యూఆర్ఇఐఎస్ కార్యదర్శి ఆర్ పావనమూర్తి, పశ్చిమగోదావరి జిల్లా డిసిఒ ఎస్ సంజీవరావు, విద్యార్థులు డి నవీన, ఎస్ జ్ఞానేశ్వరరావు, రోడా ఇవాంజిల్, బి హాసిని, సిహెచ్ ఆకాంక్ష, కె అక్ష, సి తేజ ఉన్నారు.



ప్రకాశం జిల్లా టంగుటూరులో ప్రచారం నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు

ప్రజావ్యతిరేక విధానాలపై సంతకాల సేకరణ

- రెండోరోజు కొనసాగిన సిపిఎం సమరభేరీ

ప్రజాశక్తి - యంత్రాంగం

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా, కార్మిక వ్యతిరేక విధానాలను నిరసిస్తూ సిపిఎం తలపెట్టిన సమరభేరీ కార్యక్రమంలో భాగంగా రెండోరోజు సంతకాల సేకరణ, ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా వచ్చి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ విధానాలను వ్యతిరేకిస్తూ సంతకాలు చేశారు. విశాఖ జిల్లా భీమిలి, మధురవాడలోని పలు ప్రాంతాల్లో నాయకులు విస్తృత ప్రచారం నిర్వహించి, సంతకాల సేకరణ చేపట్టారు.

అనకాపల్లి జిల్లా మునగపాక మండలం తోటాడలోనూ, కశింకోట మండల కేంద్రంలోనూ కరపత్రాలు పంపిణీ చేశారు. అల్లూరి సీతారామరాజు జిల్లా కొయ్యూరు మండలం, డౌనూరు పంచాయతీ పరిధి జోడిమామిడి, నిమ్మలపాలెం, తులబడ గ్రామాల్లో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. డుంబ్రిగుడ మండలంలోని అరకు సంతబయలు గ్రామంలో సిపిఎం నేతలు పోస్టర్లు ఆవిష్కరించారు. పాడేరు మండలంలోని పలు గ్రామాల్లో ప్రచారం కార్యక్రమం చేపట్టారు.

ఉమ్మడి చిత్తూరు జిల్లా పెండ్లిమండపం వద్ద సంతకాల సేకరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రజలు స్వచ్ఛందంగా తరలి వచ్చి కేంద్ర,రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తోన్న ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా సంతకాలు చేశారు. పెట్రోల్, డీజిల్ ధరల భారాన్ని నిరసిస్తూ గూడ్స్ ఆటోను తాళ్లతో లాగి విజయవాడలో నిరసన తెలిపారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్. బాబురావు పాల్గొన్నారు. ఎన్‌టిఆర్ జిల్లాలోని జగ్గయ్యపేట మండలం, కంచికచర్ల, వత్సవాయి మండలాల్లో సంతకాల సేకరణ, కరపత్రాలు పంపిణీ కార్యక్రమాలు నిర్వహించారు. కర్నూలు, నంద్యాల జిల్లాల వ్యాప్తంగా సంతకాల సేకరణ చేపట్టారు. ఉమ్మడి పశ్చిమగోదావరి జిల్లాలో ఇంటింటికీ వెళ్లి కరపత్రాలు పంచుతూ విస్తృత ప్రచారం నిర్వహించారు. ఒంగోలులో ఇంటింటి ప్రచారం నిర్వహించి, కరపత్రాల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

ఖరీఫ్‌కు కరువు దెబ్బ

(మొదటి పేజీ తరువాయి)

కొత్తగా సాగు చేయడానికి వాతావరణ పరిస్థితులు అనుకూలించట్లేదు. సుదీర్ఘకాలం వానలు పడకపోవడంతో వేసిన పంటలు బెట్టకొచ్చి తెగుళ్ల వ్యాపించి నష్టం చేస్తున్నాయి. దాంతో అనంతపురం, ఇతర రాయలసీమ, మెట్ట ప్రాంతాల్లో వేసిన పంటలను రైతులు ట్రాక్టర్లతో దున్నేస్తున్నారు. గుంటూరు, ఎన్‌టిఆర్, ప్రకాశం, పల్నాడు, నంద్యాల, వంటి చోట్ల వేసిన పంటలను కాపాడుకునేందుకు ట్యాంకర్లతో నీటిని పోస్తున్న సన్నివేశాలు కనిపిస్తున్నాయి. ప్రధాన ప్రాజెక్టుల్లో నీటి నిల్వలు అడుగంటుతుండటంతో ఆయకట్టు రైతుల్లో ఆందోళన ఎక్కువైంది.

ప్రత్యామ్నాయ పంటలే దిక్కు

సీజన్‌లో మూడు నెలలు గడిచిపోయాయి. ఇంకా మిగిలింది సెప్టెంబర్ ఒక్క నెలే. ఇప్పటికి దాదాపు మెట్ట సేద్యం పూర్తి కావాలి. పత్తితో సహా అన్ని పంటల సాగులోనూ తగ్గుదల నమోదైంది. వేరుశనగ సాగు బాగా తగ్గింది. సీజన్ నార్మల్ సాగు విస్తీర్ణం 86 లక్షల ఎకరాలు కాగా ఇప్పటికి 51.27 లక్షల ఎకరాల్లో (60 శాతం) పంటలు వేశారు. కాగా ఆగస్టు నెలాఖరుకు 71.17 లక్షల ఎకరాల్లో సాగు కావాల్సి ఉంది. తగ్గుదల 19.9 లక్షల ఎకరాలు. 28 శాతం విస్తీర్ణంలో సాగు లేదు. నిరుడు ఇదే సమయానికి 71.17 లక్షల ఎకరాల్లో పంటలు సాగయ్యాయి. గతేడాది కంటే 17 లక్షల ఎకరాల్లో ఈ తడవ సాగు తగ్గింది. వరి 3.78 లక్షల ఎకరాలు (22 శాతం), తృణధాన్యాలు 47 వేల ఎకరాలు (13 శాతం), పప్పుధాన్యాలు 2.30 లక్షల ఎకరాలు (41 శాతం), మొత్తం ఆహార ధాన్యాలు 6.55 లక్షల ఎకరాలు (17 శాతం), వేరుశనగ 8.05 లక్షల ఎకరాలు (53 శాతం), మొత్తం నూనెగింజలు 8.02 లక్షల ఎకరాలు (49 శాతం), పత్తి 4.40 లక్షల ఎకరాలు (32 శాతం) తగ్గాయి. కంటింజెన్సీ ప్రణాళికలపై ప్రభుత్వం మీనమేషాలు లెక్కిస్తోంది.

ఏడు జిల్లాల్లో 50 శాతం లోపు

ఏడు జిల్లాల్లో 50 శాతం లోపు సాగు నమోదైంది. అత్యల్పంగా ప్రకాశంలో 20 శాతం పంటలు వేశారు. అన్నమయ్య 28 శాతం, వైఎస్ఆర్ 29 శాతం, పల్నాడు 30 శాతం, శ్రీసత్యసాయి 35 శాతం, చిత్తూరు 37 శాతం, బాపట్ల 39 శాతం సేద్యం జరిగింది. అత్యధికంగా నెల్లూరులో 91 శాతం, కోనసీమ, పశ్చిమగోదావరిలో 90 శాతం వంతున పంటలు సాగయ్యాయి.

దత్తలూరులో అత్యల్పం

జూన్ 1 నుంచి ఆగస్టు 31 వరకు రాష్ట్ర సాధారణ సగటు వర్షపాతం 419.6 మిల్లీమీటర్లు కాగా 314.6 మిమీ పడింది. నార్మల్‌లో 25 శాతం మైనస్. కాకినాడ, కోనసీమ, పశ్చిమగోదావరి, ఎన్‌టిఆర్, పల్నాడు, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, వైఎస్ఆర్, అన్నమయ్య, తిరుపతి... 14 జిల్లాలు తక్కువ వర్షం కేటగిరిలో ఉన్నాయి. తతిమ్మా 12 జిల్లాల్లో నార్మల్ వర్షం పడింది. ఒక్క కృష్ణాలో తప్ప అన్ని జిల్లాల్లోనూ వర్షాభావ మండలాలున్నాయి. నెల్లూరు జిల్లా దత్తలూరులో రాష్ట్రంలోకెల్ల అత్యల్పంగా 83 శాతం తక్కువ వర్షం పడింది. ఆ తర్వాత అదే జిల్లా వింజమూరులో 81 శాతం మైనస్ వర్షం నమోదైంది.

వర్షాభావ మండలాలు జిల్లా	మొత్తం వర్షాభావ మండలాలు	మండలాలు
శ్రీకాకుళం	30	07
విజయనగరం	27	01
మన్యం	15	01
అల్లూరి	22	08
విశాఖ	11	02
అనకాపల్లి	24	11
కాకినాడ	21	16
కోనసీమ	22	21
తూర్పుగోదావరి	19	09
పశ్చిమగోదావరి	20	19
ఏలూరు	27	16
ఎన్‌టిఆర్	20	15
గుంటూరు	18	02
బాపట్ల	25	07
పల్నాడు	28	25
ప్రకాశం	38	31
నెల్లూరు	38	32
కర్నూలు	26	15
నంద్యాల	28	23
అనంతపురం	31	27
శ్రీసత్యసాయి	32	28
వైఎస్ఆర్	36	34
అన్నమయ్య	30	28
చిత్తూరు	31	17
తిరుపతి	34	23
రాష్ట్రం	679	416

ఇసుక పేరుతో ఓవరాక్షన్

- చంద్రబాబు, లోకేష్‌పై గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి ఆగ్రహం
- రూ.4 వేల కోట్లు ఇస్తే ఇసుక కాంట్రాక్టు అప్పగిస్తాం



ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

ఇసుక పేరుతో టిడిపి అధ్యక్షులు చంద్రబాబు, ఆయన కుమారుడు లోకేష్ ఓవరాక్షన్ చేస్తున్నారని, ప్రభుత్వానికి రూ.4 వేల కోట్లు ఇస్తే ఇసుక కాంట్రాక్టును చంద్రబాబుకే అప్పగిస్తామని రాష్ట్ర గనులశాఖ మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. గురువారం సచివాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన ఇసుకకు సంబంధించిన అశాలపై పవర్‌పాయింట్ ప్రెజెంటేషన్ ఇచ్చారు. ఉచితం పేరిట బ్లాక్‌మార్కెట్ దందా నడిపింది వారేనని పెద్దిరెడ్డి విమర్శించారు. టిడిపి హయాంలో మంత్రులు, ఎమ్మెల్యేలకు నెలవారీ మామూళ్లు ఉండేవని, లోకేష్‌కు ప్రతినెలా రూ.500 కోట్లు కప్పం కట్టాలనే ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. రాష్ట్రంలో ప్రస్తుతం ఇసుక కొరత లేదని, పారదర్శక ఇసుక పాలసీతో దోపిడీకి అడ్డుకట్ట వేశామని అన్నారు. ఏటా రూ.765 కోట్ల ఆదాయం వస్తోందని, ఐదేళ్లకు రూ.3,825 కోట్లు ఖజానాకు జమైందని తెలిపారు. బాబు ముఖ్యమంత్రిగా ఉన్న సమయంలో ఈ ఆదాయమంతా ఎటువైపు వెళ్లిందో సమాధానం చెప్పాలని నిలదీశారు. బాబు హయాంలో ఇసుక దోపిడీ కోసం 19 జిఒలు విడుదల చేశారని తెలిపారు. ఎప్పటికప్పుడు మైనింగు దోపిడీని వారికి అనుకూలంగా చేసుకున్నారనే అంశాలను వివరించారు. 2014-19 మధ్యకాలంలో చంద్రబాబు ఇంటి వెనుకాలే ఇసుక దోపిడీ జరిగిందని తెలిపారు. ఉచితమంటూనే బ్లాక్‌మార్కెట్ చేసి పెద్దయెత్తున దోపిడీకి దిగారని పేర్కొన్నారు. గతంలో పశ్చిమగోదావరి జిల్లాలో తహశీల్దారు వనజాక్షిని కాలితో తన్నారని, దానిపైనా కేసులేదని, పైగా ఆమెపైనే ఆరోపణలు చేశారని తెలిపారు. లోకేష్ కనుసన్నల్లోనే ఇసుక దోపిడీ జరిగిందని ఆరోపించారు. బాబు హయాంలో నేషనల్ గ్రీన్ ట్రిబ్యునల్ రూ.100 కోట్ల జరిమానా విధించిందని అన్నారు. అదీ ఆయన ఇంటిపక్కన జరిగిన తవ్వకాలపైనేనని తెలిపారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇసుక పాలసీలో పారదర్శకతను తీసుకొచ్చారని అన్నారు. మంత్రుల సబ్ కమిటీ ఏర్పాటు చేసి ప్రజాభిప్రాయానికి ప్రాధాన్యత ఇచ్చారని తెలిపారు. 2021 ఏప్రిల్ 16న తీసుకొచ్చిన జిఒ నెంబరు 25 ద్వారానే ఇసుక పాలసీ నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. తవ్వకాలకు సంబంధించి కేంద్ర ప్రభుత్వ రంగ సంస్థ ఎంటిసి ద్వారా టెండర్లు ఆహ్వానించామని తెలిపారు. అత్యధిక బిడ్ వేసిన జయప్రకాష్ వెంచర్స్‌కు బిడ్ ఇచ్చామని వివరించారు. ఇప్పుడు ఆరోపణలు గుప్పిస్తున్న చంద్రబాబు, రామోజీరావు అప్పుడు ఎందుకు టెండర్లలో పాల్గొనలేదని ప్రశ్నించారు. టన్ను రూ.475కే ఇస్తున్నామని వివరించారు. ఇసుక అక్రమ తవ్వకాలపై ఉక్కుపాదం మోపామని వివరించారు. 6.36 లక్షల టన్నులు సీజ్ చేశామని, 18 వేల కేసులు నమోదు చేశామని తెలిపారు. రాష్ట్రంలో ఇసుక కొరత లేకుండా చూస్తున్నామని, 6.70 కోట్ల టన్నుల ఇసుకను తవ్వితే రూ.2,300 కోట్ల ఆదాయం వచ్చిందని తెలిపారు. రాష్ట్రంలో 136 స్టాక్ పాయింట్లు ఉన్నాయని, 64 లక్షల టన్నుల ఇసుక ఉందని చెప్పారు. 110 ఓపెన్ రీచుల్లో 77 లక్షల టన్నుల తవ్వకాలకు అనుమతులు ఉన్నాయని పేర్కొన్నారు. 42 డీసెల్టింగ్ పాయింట్లకు సంబంధించి 99 లక్షల టన్నులకు అనుమతులు ఇచ్చారని పేర్కొన్నారు. మైనింగ్ ఆదాయంలో ఊహించని పురోగతి ఉందని వివరించారు. ప్రస్తుతం జెపి కాంట్రాక్టు సంస్థ కాలపరిమితిని ఏడాదికి పెంచామని తెలిపారు. సబ్ కాంట్రాక్టు అగ్రిమెంట్లతో ప్రభుత్వానికి ఎటువంటి సంబంధమూ లేదని వివరించారు. అలా ఇచ్చినట్లు ప్రభుత్వం దృష్టిలో లేదని వెల్లడించారు.

టిడిపి ప్రశ్నలకు సమాధానం చెప్పలేని పెద్దిరెడ్డి

- మాజీ మంత్రి నక్కా ఆనంద్‌బాబు

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

తమ పార్టీ అడిగిన ప్రశ్నలకు సమాధానం చెప్పకుండా మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి నోటికొచ్చినవి మాట్లాడుతున్నారని మాజీ మంత్రి, టిడిపి పొలిట్‌బ్యూరో సభ్యులు నక్కా ఆనంద్‌బాబు విమర్శించారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాల కాంట్రాక్టు జెపి పవర్ వెంచర్స్‌కు ప్రభుత్వం ఇచ్చిందని, వారు ఎవరికి సబ్‌కాంట్రాక్టు ఇచ్చారో తెలియదని నిమిషాల వ్యవధిలోనే మాట మార్చారని ఆరోపించారు. టిడిపి కార్యాలయంలో గురువారం ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. డైరెక్టరేట్ ఆఫ్ మైనింగ్ అండ్ జియాలజీకి సబ్ కాంట్రాక్టరు రూ.302.45 కోట్లు బకాయి ఉందని జెపి పవర్ వెంచర్స్ సంస్థ క్వార్టర్లీ ఆడిట్ రిపోర్టులో పేర్కొందని అన్నారు. ఈ బకాయిలపై పెద్దిరెడ్డి మాట్లాడలేదన్నారు. జెపి పవర్ వెంచర్స్‌కు టెండర్ ఇచ్చిన తరువాత సబ్ కాంట్రాక్ట్ ఇచ్చేందుకు ప్రభుత్వం నుంచి అనుమతి ఇచ్చారా లేదా అని ప్రశ్నించారు. టెండర్ డాక్యుమెంట్‌లో సబ్ కాంట్రాక్ట్‌కు ప్రొవిజన్ లేదని, దానికి అనుమతి ఎలా ఇస్తారని నిలదీశారు. అనుమతి లేకపోతే సబ్ కాంట్రాక్ట్ పొందిన సంస్థను ప్రాసిక్యూట్ ఎందుకు చేయలేదన్నారు. రాష్ట్రంలో ఇసుక తవ్వకాలకు సంబంధించి పర్యావరణ అనుమతులు ఎంతవరకు తీసుకున్నారు? ఎంతమేర అన్ని రీచ్‌లలో తవ్వకాలు జరిపారు? యంత్రాలతో ఎంత తవ్వారు? మ్యాన్యువల్‌గా ఎంత తవ్వారనే పూర్తి వివరాలు పబ్లిక్ డొమైన్‌లో ఎందుకు పెట్టడం లేదని ప్రశ్నించారు.

శ్రీనివాస్ 1,685 రోజుల నుంచి జైల్లోనే : వర్ల రామయ్య

జగన్‌మోహన్‌రెడ్డి హత్యాయత్నం కేసులో దళిత జాతికి చెందిన శ్రీనివాస్‌ను 1,685 రోజులుగా రిమాండ్ ఖైదీగా ఉంచారని టిడిపి పొలిట్ బ్యూరో సభ్యులు వర్ల రామయ్య అన్నారు. ఏం పెద్ద నేరం చేశారని శ్రీనివాస్‌ను అన్ని రోజులు రిమాండ్‌లో ఉంచారు? అని ప్రశ్నించారు.

దేశంలో దళితులకు పూర్తి స్వాతంత్ర్యం రాలేదని అభిప్రాయం వ్యక్తం చేశారు. శ్రీనివాస్‌కు జరుగుతున్న అన్యాయం పట్ల సిఎం, న్యాయ వ్యవస్థ స్పందించి ఆయనకు విముక్తి కల్పించాలని విజ్ఞప్తి చేశారు.

రాఘవేంద్రుడిని దర్శించుకున్న గవర్నర్

ప్రజాశక్తి- మంత్రాలయం (కర్నూలు జిల్లా)

కర్నూలు జిల్లా మంత్రాలయం రాఘవేంద్రుస్ని రాష్ట్ర గవర్నర్ ఎస్.అబ్దుల్ నజీర్ గురువారం దర్శించుకున్నారు. తొలుత పద్మనాభ తీర్థ అతిథిగృహానికి చేరుకున్న గవర్నర్‌కు జిల్లా ఇంఛార్జి మంత్రి బుగ్గన రాజేంద్రనాథ్‌రెడ్డి, నంద్యాల ఎంపి బ్రహ్మానందరెడ్డి, ఎస్‌పి జి.కృష్ణకాంత్, సబ్ కలెక్టర్ అభిషేక్ కుమార్ స్వాగతం పలికారు. అనంతరం రాఘవేంద్ర మఠం చేరకున్న గవర్నర్‌కు పండితులు స్వాగతం పలికారు. తొలుత మాంచాలమ్మ, అనంతరం శ్రీరాఘవేంద్ర స్వామిని దర్శించుకున్నారు. మఠం పీఠాధిపతి శ్రీ సుబుధేంద్ర తీర్థ స్వామిజీతో కలిసి మఠం స్వరూపం, చరిత్ర, నిర్వహణ అంశాలపై రూపొందించిన ఎవిని గవర్నర్ తిలకించారు. అనంతరం మఠంలో పూర్వారాధాన కార్యక్రమంలో పాల్గొన్నారు.

అప్పల బాధతో రైతు ఆత్మహత్య

ప్రజాశక్తి - పాములపాడు (నంద్యాల)

అప్పుల బాధతో ఓ రైతు ఆత్మహత్య చేసుకున్న ఘటన నంద్యాల జిల్లా పాములపాడు మండలంలో గురువారం చోటు చేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. రుద్రవరం గ్రామానికి చెందిన రైతు వెంకటనాగులు (73)ఎకరా సొంతపొలంతో పాటు మూడు ఎకరాలు కౌలుకు తీసుకుని సాగు చేస్తున్నారు. గత మూడేళ్లుగా పంటలు దక్కకపోవడంతో సుమారు రూ. ఏడు లక్షల మేర అప్పులయ్యాయి. ఈ ఏడాది కూడా వర్షాలు లేక పంటలు ఎండిపోయాయి. దీంతో అప్పులు తీరే మార్గం లేక పురుగుమందు తాగి ఆత్మహత్య చేసుకున్నారు. ఆయనకు భార్య, ఇద్దరు కుమారులు, ఒక కూతురు ఉన్నారు. మృతురాలి భార్య ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు..

విఆర్‌ఎలకు డిఎ మంజూరుపై హర్షం

ప్రజాశక్తి - అమరావతి బ్యూరో

విఆర్‌ఎలకు గతంలో రూ.300 ఉన్న డిఎను రూ.500కు పెంచాలని నిర్ణయించడంపై ఉద్యోగ సంఘాల నాయకులు హర్షం వ్యక్తం చేశారు. ఈ మేరకు గురువారం ఉదయం ఆంధ్రప్రదేశ్ గవర్నమెంటు ఎంప్లాయీస్ ఫెడరేషన్ ఛైర్మన్ కాకర్ల వెంకట్రామిరెడ్డి, ఎపి జెఎసి అమరావతి ఛైర్మన్ బొప్పరాజు వెంకటేశ్వర్లు వేర్వేరుగా ప్రకటనలు విడుదల చేశారు.

ఈ మేరకు డిఎ ఫైల్ సిద్ధమైందని, ఒకటి రెండు రోజుల్లో దీనిపై స్పష్టత వస్తుందని వారు తెలిపారు. ఈ సందర్భంగా సిఎం, సిఎస్‌కు వారు కృతజ్ఞతలు తెలిపారు.

గిరిజనులకు సబ్సిడీ రుణాలు

• లోకేష్ హామీ • 200 రోజులకు యువగళం పాదయాత్ర

ప్రజాశక్తి - ఏలూరు ప్రతినిధి

టిడిపి అధికారంలోకొచ్చాక ఎప్పటి నుంచో గిరిజనులు సాగుచేసుకుంటున్న భూములపై చట్టంలోని నిబంధనలు అనుసరించి సాగుదారులకు శాశ్వత హక్కులు ఇస్తామని, రాజకీయ, ఉద్యోగ రంగాల్లో వారికి మెరుగైన అవకాశాలు కల్పిస్తామని టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ హామీ ఇచ్చారు. యువగళం పాదయాత్ర గురువారం ఏలూరు జిల్లా పోలవరం నియోజకర్గం కొయ్యలగూడెం మండలంలో సాగింది. లోకేష్ తల్లి నారా భువనేశ్వరి, నందమూరి, నారా కుటుంబ సభ్యులు పాదయాత్రలో పాల్గొని లోకేష్‌తో నడిచారు. పాదయాత్ర 200 రోజులు పూర్తి చేసుకున్న సందర్భంగా సీతంపేట వద్ద పైలన్‌ను ఆవిష్కరించారు. అధికారంలోకి వచ్చిన వెంటనే టిడిపి కార్యకర్తలపై పెట్టిన తప్పుడు కేసులు ఎత్తేస్తామన్న హామీతో పైలాన్‌ను ఆవిష్కరించారు. కొయ్యలగూడెంలో గిరిజనులతో ముఖాముఖి నిర్వహించారు. ఈ సందర్భంగా లోకేష్ మాట్లాడుతూ.. తాను పంచాయతీ రాజ్ మంత్రిగా ఉండగా 500 మంది జనాభా ఉన్న తండాలను పంచాయతీలుగా గుర్తించినట్లు తెలిపారు. గిరిజన ప్రాంతాల్లో గిరిజనులకే ఉద్యోగాలు రావాలన్నది టిడిపి విధానమని, జిఒ 3ను పటిష్టంగా అమలు చేసింది టిడిపియేనని తెలిపారు.



లోకేష్‌తో కలిసి పాదయాత్ర చేస్తున్న నారా భువనేశ్వరి

దామాషా ప్రకారం గిరిజనుల ఉపకులాలకు సబ్సిడీ రుణాలిస్తామని హామీ ఇచ్చారు. గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టేవారికి ప్రత్యేక రాయితీలు కల్పిస్తామని, పోలవరం నిర్వాసితులకు న్యాయం చేస్తామని అన్నారు. ఎస్‌టి సబ్‌ప్లాన్ నిధులు గిరిజనులకు కేటాయిస్తామని, గిరిజనులకు ఇబ్బంది లేకుండా బోయ, వాల్మీకుల సమ్యను పరిష్కరిస్తామని, గిరిజన టీచర్ పోస్టులు భర్తీ చేస్తామని, ఐటిడిఎలో లేని గ్రామాలను చేర్చే అవకాశం ఉంటే నిబంధనలు మార్పుచేస్తామని హామీ ఇచ్చారు. గిరిజనులకు నాణ్యమైన ఇళ్లు కట్టించి ఇస్తామని ప్రకటించారు.

తాగునీటి పథకం కార్మికులకు వేతనాలివ్వాలి

• సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు

ప్రజాశక్తి-పుట్టపర్తి అర్బన్

శ్రీ సత్య సాయి నీటి సరఫరా కార్మికులకు వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం రోడ్డున పడేసిందని సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు ఎవి నాగేశ్వరరావు తెలిపారు. కార్మికుల సమ్మెకు సిఐటియు సంపూర్ణ మద్దతు ఇస్తుందని, కార్మికులకు న్యాయం జరిగే వరకు అండగా ఉంటుందని చెప్పారు. శ్రీ సత్యసాయి జిల్లా పుట్టపర్తిలోని నీటి సరఫరా పంపు హౌస్ వద్ద కార్మికులు చేపట్టిన సమ్మె బుధవారం ఏడవ రోజుకు చేరింది. వీరి ఆందోళనకు మద్దతుగా నాగేశ్వరరావుతోపాటు రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా నాగేశ్వరరావు మాట్లాడుతూ.. ఐదు నెలల వేతనాలు, పిఎఫ్, ఇఎస్ఐ ఇవ్వకుంటే కార్మికులు తమ కుటుంబాలను ఎలా పోషించుకుంటారని ప్రభుత్వాన్ని ప్రశ్నించారు. విధిలేని పరిస్థితుల్లో కార్మికులు చేస్తున్న న్యాయమైన సమ్మెకు ప్రభుత్వం స్పందించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర ఉపాధ్యక్షులు జి.ఓబులు మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి ఇతర పథకాలకు కోట్లాది రూపాయలు బటన్ నొక్కి ఇస్తున్నారని, కార్మికులకు ఎందుకు వేతనాలు ఇవ్వలేదని ప్రశ్నించారు. 572 మంది కార్మికులు దాదాపు వెయ్యి గ్రామాలకు తాగునీరు అందిస్తూ పని చేస్తుంటే ఐదు నెలలుగా వేతనాలు ఇవ్వకుండా ప్రభుత్వం ఇబ్బందులకు గురి చేయడం, బలవంతంగా పోలీసులతో అరెస్టు చేయిస్తుండడం దారుణమన్నారు. అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరని తెలిపారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి ఇఎస్ వెంకటేష్, మున్సిపల్ కార్మికుల సంఘం జిల్లా కార్యదర్శి లక్ష్మీనారాయణ తదితరులు పాల్గొన్నారు.

'బాబు ష్యూరిటీ- భవిష్యత్తుకు గ్యారెంటీ'

• నేటి నుండి 45 రోజులపాటు టిడిపి ప్రచార కార్యక్రమం

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

'బాబు ష్యూరిటీ-భవిష్యత్తుకు గ్యారెంటీ' కార్యక్రమంపై టిడిపి శుక్రవారం నుంచి రాష్ట్ర వ్యాప్త ప్రచార కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. 45 రోజులపాటు మూడు కోట్ల మందిని పార్టీ నేతలు కలిసే ఈ కార్యక్రమంలో ప్రజల సహకారం, భాగస్వామ్యం కావాలని ఆ పార్టీ అధినేత చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు గురువారం రాష్ట్ర ప్రజలకు బహిరంగ లేఖ రాశారు. టిడిపి మొదటి నుంచి బలమైన సంక్షేమ పునాదులపై ప్రగతి రథాలను నడిపించిందని, పార్టీ చిహ్నమైన సైకిల్ రెండు చక్రాల్లో ఒకటి సంక్షేమానికి, మరొకటి అభివృద్ధికి ప్రతీకగా నిలిచాయని పేర్కొన్నారు.

నాలుగేళ్ల నుంచి రైతులకు గిట్టుబాటు ధరలు లేవని, మహిళా సాధికారత, భద్రత అటకెక్కిందని, పెట్టుబడుల మాటే లేదని, నిరుద్యోగం పెరిగిపోయిందని, బడుగు బలహీన వర్గాలపై దాడులు నిత్యకృత్యం అయ్యాయని విమర్శించారు. సహజ వనరులను, ప్రభుత్వ, ప్రజల ఆస్తులను దోచేస్తూ ప్రభుత్వం రాష్ట్ర ప్రజల భవిష్యత్తును అంధకారంలోకి నెట్టిందని తెలిపారు. సెప్టెంబరు 1 నుంచి 45 రోజులపాటు 'బాబు ష్యూరిటీ భవిష్యత్‌కు గ్యారెంటీ' పేరుతో ప్రజా సాధికార చైతన్య కార్యక్రమంలో భాగంగా పార్టీ కార్యకర్తలు, నేతలు ప్రతి ఇంటికీ వస్తారని పేర్కొన్నారు. ఆర్థిక పరిపుష్టి, రక్షణ, భవిష్యత్తు కోసం రూపొందించిన సూపర్ సిక్స్ పథకాల ఉద్దేశాలను, వాటివల్ల కలిగే ప్రయోజనాలను వివరిస్తారని తెలిపారు. సమస్యలపై చర్చించి వారిని ఆదరించాలని కోరారు. పథకాల కింద ప్రతి కుటుంబానికీ ఎంత ఆర్థిక ప్రయోజనం కలుగుతుందో పార్టీ కార్యకర్తలు, నేతలు చర్చిస్తారని పేర్కొన్నారు. ఆ వివరాలన్నిటినీ ఒక కార్డుపై నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేయించి తన సంతకంతో కూడిన హామీ పత్రాన్ని ఇస్తారని పేర్కొన్నారు. దసరా రోజు సమగ్ర మేనిఫెస్టో ప్రకటించబోతున్నామని తెలిపారు. అందరి బాగుకోసం, పిల్లల ఉజ్వల భవిష్యత్తు కోసం, రాష్ట్రాన్ని అగ్రగామిగా నిలపడం కోసం ఇంకా ఏం చేయాలో తెలియజేయాలని సూచించారు. అందరి సలహాలతో మేనిఫెస్టో రూపొందిస్తానని వెల్లడించారు.

- చిత్తూరు జిల్లా గుడిపాల మండలం 190 రామాపురం వద్ద పంటపొలాల్లో పనులు చేసుకుంటున్న సెల్వి, వెంకటేష్ దంపతులను చంపడంతో పాటు కార్తీక్ అనే యువకుడిని తీవ్రంగా తొక్కి గాయపరిచిన ఏనుగును ఎట్టకేలకు గురువారం సాయంత్రం అటవీశాఖ అధికారులు అదుపులోకి తీసుకున్నారు.

ఒపిఎస్‌పై ప్రభుత్వ హామీ నిలబెట్టుకోవాలి

• ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికలకు ముందు చేసిన వాగ్దానం మేరకు ఉద్యోగులకు సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్ అమలు చేయాలని ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎపి మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు కె నాగభూషణం, ప్రధాన కార్యదర్శి కె ఉమామహేశ్వరరావు ఒక ప్రకటన విడుదల చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఉద్యోగులకు ఒపిఎస్‌ను ఇవ్వకుండా మభ్యపెట్టేలా జిపిఎస్‌ను తీసుకొస్తోందని విమర్శించారు. జిపిఎస్ అనేది ఉద్యోగుల ఆకాంక్షలకు అనుగుణంగా లేదని అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం సిపిఎస్‌ను రద్దు చేసి ఒపిఎస్‌కు వెళ్లేందుకు రాష్ట్రంలోని అన్ని ఉద్యోగ, ఉపాధ్యాయ, కార్మిక సంఘాలతో జాయింట్ మీటింగ్ ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

రిటైర్డు ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి : ఎస్‌డబ్ల్యుఎఫ్

ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ఎపిఎస్ ఆర్‌టిసిలో రిటైర్డు ఉద్యోగులతోపాటు సర్వీసులో వుండి మృతిచెందిన ఉద్యోగులకు సంబంధించిన ఆర్జిత సెలవుల సమస్యలను పరిష్కరించాలని ఎపిపిటిడి స్టాఫ్ అండ్ వర్కర్స్ ఫెడరేషన్ (ఎస్‌డబ్ల్యుఎఫ్) డిమాండ్ చేసింది. ఈ మేరకు గురువారం ఎపిఎస్‌ఆర్‌టిసి ఎమ్‌డి ద్వారకా తిరుమలరావుకు ఎస్‌డబ్ల్యుఎఫ్ రాష్ట్ర గౌరవాధ్యక్షులు ఎస్‌కె జిలాని బాషా, అధ్యక్ష కార్యదర్శులు సిహెచ్ సుందరయ్య, ఎం అయ్యపరెడ్డి వినతిపత్రం అందజేశారు. రిటైర్డు అయ్యేనాటికి ప్రతి ఉద్యోగికీ 300 ఆర్జిత సెలవులు ఇవ్వాలని, అన్ని ఆర్జిత సెలవులు లేకపోతే 300 రోజులకు అర్ధరోజు అర్జిత సెలవు కింద లెక్కకట్టి ఇవ్వాలనే నిబంధన ఆర్‌టిసిలో అమలుకావడం లేదని అన్నారు. ఒక ఉద్యోగి ఖాతాలో 180 ఆర్జిత సెలవులు వుంటే మిగిలిన 120 రోజులకు హాఫ్‌డే ఆర్జిత సెలవులను లెక్క కట్టి ఇవ్వాలని కోరారు.

నారీ ద్రోహి మోడీ

• ఐద్వా రాష్ట్ర కార్యదర్శి రమాదేవి

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ప్రధాని మోడీ నారీ ద్రోహి అని, బిజెపి పాలనలో మహిళలకు భద్రత కరువైందని ఐద్వా రాష్ట్ర కార్యదర్శి డి.రమాదేవి తెలిపారు. బిజెపిని గద్దె దించితేనే మహిళలకు రక్షణ లభిస్తుందని అన్నారు. విజయనగరంలోని ఎల్‌బిజి భవనంలో గురువారం ఆమె విలేకరులతో మాట్లాడారు. కేంద్రంలో బిజెపి గద్దెనెక్కాక ప్రజల మధ్య అంతరాలు పెరిగాయన్నారు. తొమ్మిదేళ్ల కాలంలో ప్రజలపై విపరీతంగా భారాలు మోపారన్నారు. గ్యాస్ సిలిండర్ ధర 2014లో రూ.415 ఉంటే, నేడు రూ.1200కు పెరిగిందని తెలిపారు. ప్రజా పంపిణీ వ్యవస్థను నిర్వీర్యం చేస్తున్నారని అన్నారు. నిత్యావసర వస్తువులను రేషన్ డిపోల ద్వారా తక్కువ ధరలకు సరఫరా చేయాలని డిమాండ్ చేశారు. సమాజంలో సగభాగంగా ఉన్న మహిళల పరిస్థితి మరీ దారుణంగా తయారైందన్నారు. చంద్రయాన్-3లో 55 మంది మహిళా శాస్త్రవేత్తలు కీలకపాత్ర పోషించారని, మరోవైపు మహిళలపై దాడులు రోజురోజుకు పెరుగుతున్నాయని తెలిపారు. మణిపూర్‌లో ఆదివాసీ మహిళలను నగ్నంగా ఊరేగించి సామూహిక అత్యాచారానికి పాల్పడిన దుండగులను ఆర్‌ఎస్‌ఎస్, బిజెపి పాలకులు ప్రోత్సహిస్తున్నారని మండిపడ్డారు. మోడీకి, బిజెపి పాలకులకు తగిన గుణపాఠం చెప్పాల్సిన తరుణం ఆసన్నమైందని అన్నారు. అందులో భాగంగానే హింసను నివారించాలని గత నెలలో విజయవాడలో భారీ బహిరంగ సభ నిర్వహించామని తెలిపారు. ఈ నెలలో ఇంటింటికి ప్రచారం చేస్తున్నామని, అక్టోబర్ 5న ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద మోడీ హటావో.. దేశ్‌కి బచావో నినాదంతో ఐద్వా ఆలిండియా కమిటీ ఆధ్వర్యంలో బహిరంగ సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఈ సభను విజయవంతం చేయాలని కోరారు. అనంతరం కరపత్రాలను విడుదల చేశారు. సమావేశంలో ఐద్వా జిల్లా కార్యదర్శి పి.రమణమ్మ, నాయకులు వంజరాపు.లక్ష్మి, వి.లక్ష్మి పాల్గొన్నారు.

బ్రహ్మోత్సవాలకు విస్తృత ఏర్పాట్లు

• టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి

ప్రజాశక్తి - తిరుమల

అధికమాసం కారణంగా ఈ ఏడాది సెప్టెంబరు, అక్టోబరులో జరిగే రెండు బ్రహ్మోత్సవాలకు విశేషంగా యాత్రికులు తరలివచ్చే అవకాశం ఉందని, వారి సౌకర్యార్థం విస్తతంగా ఏర్పాట్లు చేపడుతున్నామని టిటిడి ఇఒ ఎవి.ధర్మారెడ్డి తెలిపారు. తిరుమల అన్నమయ్య భవనంలో గురువారం జిల్లా కలెక్టర్, ఎస్‌పి, తిరుపతి కార్పొరేషన్ కమిషనర్, టిటిడిలోని అన్ని విభాగాల అధికారులతో బ్రహ్మోత్సవాల ఏర్పాట్లపై ఇఒ సమీక్ష నిర్వహించారు. అనంతరం మీడియాతో ఆయన మాట్లాడుతూ.. సెప్టెంబర్ 18 నుండి 26 వరకు సాలకట్ల బ్రహ్మోత్సవాలు, అక్టోబర్ 15 నుంచి 23 వరకు నవరాత్రి బ్రహ్మోత్సవాలు జరగనున్నాయని తెలిపారు. సెప్టెంబరు 18న ముఖ్యమంత్రి వైఎస్.జగన్‌మోహన్‌రెడ్డి రాష్ట్ర ప్రభుత్వం తరుపున శ్రీవారికి పట్టువస్త్రాలు సమర్పిస్తారని వెల్లడించారు. అనంతరం శ్రీనివాస సేతు, ఎస్‌వి ఆర్ట్స్ కళాశాల హాస్టల్ భవనం, తిరుమలలో విశ్రాంతి గృహాలు ప్రారంభించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని తెలిపారు. సామాన్య భక్తులకు పెద్దపీట వేస్తామని, వారికి వాహనసేవల దర్శనంతోపాటు మూలమూర్తి దర్శనం కల్పిస్తామని చెప్పారు. బ్రేక్ దర్శనాలకు సిఫారసు లేఖలు స్వీకరించబడవని, స్వయంగా వచ్చే ప్రొటోకాల్ ప్రముఖులను మాత్రమే అనుమతిస్తామని వివరించారు. వద్ధులు, వికలాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు తదితర ప్రివిలేజ్డ్ దర్శనాలను రద్దు చేసినట్టు వెల్లడించారు. శ్రీవాణి ట్రస్టు నిధులతో ఆలయాలు నిర్మించిన ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మత్స్యకార ప్రాంతాల్లోని భక్తులకు రోజుకు వెయ్యి మంది చొప్పున బ్రహ్మోత్సవ దర్శనం చేయిస్తామని తెలిపారు. వీరికి ఉచితంగా రవాణా, భోజనం, బస కల్పిస్తామని చెప్పారు.

ఇఎమ్‌డిపి అమలుకు నోడల్ అధికారులు


ప్రజాశక్తి-అమరావతి బ్యూరో

ప్రభుత్వ పాఠశాలల్లో చదువుతున్న 9వ తరగతి విద్యార్థులకు ఎంట్రప్రెన్యూరియల్ మైండ్‌సెట్ డెవలప్‌మెంట్ ప్రోగ్రాం (ఇఎమ్‌డిపి) అందించేందుకు ప్రతి జిల్లాకూ ఒక నోడల్ అధికారిని నియమించాలని పాఠశాల విద్యాశాఖ కమిషనరు ఎస్ సురేష్ కుమార్ అన్నారు. ఈ ప్రోగ్రాంపై ఎస్‌సిఇఆర్‌టి కార్యాలయంలో జరిగిన వర్క్‌షాపునకు ముఖ్యఅతిథిగా గురువారం ఆయన హాజరయ్యారు. ప్రపంచంలోని చక్కని అవకాశాలను విద్యార్థులకు అందేలా తర్ఫీదు ఇవ్వాలని చెప్పారు. విద్యార్థుల మనసును గుర్తించి పాఠశాలలు, తరగతుల్లో నాయకత్వ పాత్రలు పోషించేలా కమ్యూనికేషన్, సంక్లిష్ట ఆలోచనలు, పరిష్కారాలు, సృజనాత్మకత వంటి 21వ శతాబ్దపు నైపుణ్యాలను అభివృద్ధి చేయాలని జిల్లా సైన్స్ అధికారులకు చెప్పారు. సుస్థిర భవిష్యత్తు కోసం యువ విద్యార్థులు ప్రావీణ్యం పొందేలా శిక్షణ ఇవ్వాలని అన్నారు. 2021 నుంచి పాఠశాలల్లో ప్రారంభించిన ఇఎమ్‌డిపి విధివిధానాలు, జాతీయ స్థాయిలో విద్యార్థులు ప్రదర్శించిన ప్రాజెక్టుల వివరాలను ఎస్‌సిఇఆర్‌టి డైరెక్టరు బి ప్రతాప్ రెడ్డి వివరించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ నోడల్ అధికారి టి పద్మావతి, మేనేజర్ సతీష్ దుల్లా, అన్ని జిల్లాల సైన్స్ అధికారులు పాల్గొన్నారు

విజయవాడ రైల్వేస్టేషన్‌లో కారు దగ్ధం

• ఒక్కసారిగా వ్యాపించిన మంటలతో భయాందోళనలు

ప్రజాశక్తి - విజయవాడ : విజయవాడ రైల్వేస్టేషన్ పార్సిల్ ఆఫీసు వద్ద బుధవారం రాత్రి 8 గంటల సమయంలో ఓ కారు దగ్ధమైంది. దీంతో స్టేషన్లోని ప్రయాణికులు తీవ్ర భయాందోళనలకు గురయ్యారు. విశాఖపట్నం నుండి రైలులో విజయవాడ వచ్చిన బంధువులను తీసుకెళ్లేందుకు నగరంలోని సీతారాంపురం ప్రాంతానికి చెందిన ఓ మహిళ కారులో వచ్చారు. అయితే కారును రైల్వేస్టేషన్ ఆవరణలోని పార్సిల్ ఆఫీసు వద్ద నిలిపి ఉంచగా, ఒక్కసారిగా దానిలో నుండి మంటలు వ్యాపించాయి. దీంతో కారు ముందు భాగం పూర్తిగా దగ్ధమైంది. కారులో ఎవరూ లేకపోవడంతో ప్రాణాపాయం కలుగలేదు. పూర్తి వివరాలు తెలియాల్సి ఉంది.



విజయవాడ రైల్వేస్టేషన్ ఆవరణలోని పార్సిల్ కార్యాలయం వద్ద దగ్ధమైన కారు

సంపాదకీయం

ఉపాధిహామీపై కక్ష

నిరుపేదలపై నిత్యం కపట ప్రేమ ఒలకబోస్తూ...అపర కుబేరులకు సర్వం దోచిపెడుతున్న మోడీ సర్కారు ఉపాధి హామీ ఉసురుతీసేందుకు రకరకాల ఎత్తులు వేస్తోంది. వామపక్షాల ఒత్తిడితో యుపిఎ హయాంలో ప్రారంభమైన మహాత్మాగాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టం (ఎంజిఎన్ఆర్ఇజిఎస్) పట్ల ఆది నుంచీ కాషాయ పార్టీ కక్షపూరిత వైఖరిని కొనసాగిస్తోంది. అన్నింటిలోకీ ప్రైవేటురంగాన్ని అనుమతించాలని, ప్రభుత్వ వ్యయంలో కోత పెట్టాలని చెబుతున్న నయా ఉదారవాద సిద్ధాంతాన్ని కేంద్రంలోని మోడీ సర్కారు తూ.చా. తప్పక అమలుచేస్తోంది. అందులో భాగంగా తీసుకొచ్చిన ఆధార్ ఆధారిత చెల్లింపుల వ్యవస్థ (ఎబిపిఎస్)ను ఆగస్టు 31లోపు ఉపాధి హామీకి అనుసంధానం చేసి, తప్పనిసరిగా చెల్లింపులు చేయాలంటూ గతంలో ఇచ్చిన ఆదేశాలను మరోసారి కేంద్రం డిసెంబర్ 31 వరకూ పొడిగించింది. వివిధ రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు, వచ్చే ఏడాది పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఈ గడువు పొడిగించారనేది వాస్తవం. నేషనల్ మొబైల్ మానిటరింగ్ సర్వీస్ (ఎన్ఎంఎంఎస్) పేరుతో మొబైల్ యాప్ తీసుకొచ్చి, ఈ యాప్ ద్వారానే కార్మికులు హాజరు నమోదు చేసుకోవాలని నిబంధన విధించింది. గ్రామీణ, గిరిజన ప్రాంతాల్లోని పని ప్రదేశాల్లో ఇంటర్‌నెట్ కనెక్టివిటీ సరిగా లేకపోవడంతో కార్మికులు తమ హాజరు నమోదు కోసం గంటల తరబడి వేచివుండాల్సి వస్తోంది. ఈ యాప్ ద్వారా నమోదు చేసుకోకపోతే వేతనం చెల్లించకపోవడంతో ఇది వారికి జీవన్మరణ సమస్యగా మారింది. ఆన్‌లైన్‌లో హాజరు, ఆధార్ కార్డు ఆధారంగా చెల్లింపులు తప్పనిసరి వంటి హైటెక్ నిబంధనలు పెట్టి నిర్వీర్యం చేయబూనుకోవడం దారుణం.

ఉపాధి కావాలని కోరే ప్రతి ఒక్కరికీ వంద రోజులు పని కల్పించాలని చట్టం చెబుతుండగా, ప్రస్తుత సగటు పని దినాలు 35.4 రోజులే. మంత్రిత్వశాఖ ఇచ్చిన సమాచారం ప్రకారం ఈ ఏడాది కేటాయించిన నిధుల్లో ఇప్పటికే 91 శాతం నిధులు ఖర్చయిపోయాయి. ఏటా బడ్జెట్‌లో ఉపాధి హామీకి కేటాయింపులు కునారిల్లుతున్నాయి. 2021-22లో రూ.98,467.85 కోట్లు ఈ పథకానికి ఖర్చు పెట్టారు. 2022-23లో బడ్జెట్‌లో రూ.73 వేల కోట్లే కేటాయించారు. రూ.89,400 కోట్లు వ్యయం చేశారని సవరించిన అంచనాలు పేర్కొంటున్నాయి. అంటే అంతకుముందు ఏడాదితో పోలిస్తే పది శాతం కోత పెట్టారు. 2023-24 బడ్జెట్‌లో కేవలం రూ.60 వేల కోట్లే కేటాయించారు. గత ఏడాది సవరించిన కేటాయింపుల్లో 33 శాతం కోత పెట్టారు. ఈ పనుల్లో పాల్గొనే పేదలను తగ్గించేందుకు పలు రకాల కొర్రీలు పెడుతున్నారు.

ఉపాధి హామీ చట్టం ప్రకారం పని చేసిన 15 రోజుల్లో కార్మికులకు వేతనం చెల్లించాల్సి ఉండగా, వేల కోట్ల వేతనాలు పెండింగ్‌లో ఉన్నాయి. సగటు వేతనం రూ.217.87 మాత్రమే ఉంది. మహిళలకు మరింత తక్కువ వేతనం అందుతోంది. ఆంక్షలు, అతి తక్కువ వేతనాలు, సకాలంలో అందకపోవడం, సరిపడినన్ని నిధులు లేకపోవడం... తదితర కారణాల వల్ల ఈ పథకం కింద పని దొరుకుతున్న కుటుంబాల సంఖ్య ఏటా తగ్గిపోతూ వస్తోంది. ఆ సంఖ్యను మరింతగా తెగ్గోసేందుకే ఆధార్ ఆధారిత చెల్లింపు వ్యవస్థను ముందుకుతెచ్చింది. ప్రస్తుతం దేశంలో ఉన్న 26 కోట్ల జాబ్‌కార్డు హోల్డర్లలో 41.4 శాతం మందికి ఇప్పటికీ ఎబిపిఎస్ అనుసంధానం కాలేదు. నాలుగుసార్లు గడువు పొడిగించినా... నేటికీ ఆ పరిస్థితి ఉంది. తాజాగా పొడిగించిన నాలుగు నెలల్లో ఈ 41.4 శాతం మందికి అనుసంధానమవుతుందా? ఉపాధి హామీ పనులు అత్యధికంగా చేసే ఐదు రాష్ట్రాల్లో కోటీ 20 లక్షల మందికి నేటికీ అనుసంధానం కాలేదు. ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, నాగాలాండ్‌లలో 61.2 శాతం, 80 శాతం మందికీ నేటికీ ఎబిపిఎస్‌తో లింక్ అప్ కాలేదు. కొన్ని చోట్ల అక్రమాలు జరిగాయని ఆరోపిస్తూ మొత్తం పేదలకు పనిని తిరస్కరించే హక్కు ఎవరిచ్చారు?

పట్టుబట్టి ఉపాధి హామీని చట్టం రూపంలో తీసుకొచ్చిన వామపక్షాలు తాము అధికారంలో ఉన్నచోట ఎంతో సమర్థంగా అమలు చేశాయి. త్రిపురలో తొలిసారి పట్టణ ఉపాధి హామీ పథకాన్ని అమలులోకి తీసుకొచ్చాయి. ప్రస్తుతం కేరళలో ఎల్‌డిఎఫ్ ప్రభుత్వం 'అయ్యంకాళి పట్టణ ఉపాధి హామీ పథకం' ఆదర్శవంతంగా అమలు చేస్తోంది. వంద రోజుల పని పూర్తిచేసిన ఉపాధి హామీ కార్మికులందరికీ వెయ్యి రూపాయల చొప్పున ఓనం బోనస్‌గా ఇటీవల అందజేసింది. వేతనాలు, పనిదినాలు పెంచుతూ పట్టణ ప్రాంతాలకు విస్తరించాల్సిన ఉపాధి హామీని నిర్వీర్యం చేసే మోడీ సర్కారు ఎత్తుగడలకు చెల్లుచీటీ పలికేందుకు ప్రజలు సిద్ధం కావాలి.

మహనీయుల మాట



మనకు ఒక ఆయుధాన్ని ఇచ్చినందుకు మనం మార్క్స్, ఎంగెల్స్, లెనిన్, స్టాలిన్‌కు రుణపడి వున్నాం. ఆ ఆయుధం మెషీన్ గన్ కాదు. అదే మార్క్సిజం-లెనినిజం.

- మావో

毛澤東

మనువాదం వర్సెస్ మానవవాదం

కామన్ సెన్స్



డా॥ దేవరాజు మహారాజు

ఇవాళ ప్రపంచంలో మూడు అతి పెద్ద భారీ వ్యాపార వస్తువులు ఉన్నాయి. ఒకటి-ఆయుధాలు, రెండు-మాదకద్రవ్యాలు, మూడు-ఆధ్యాత్మికత. ఆయుధాలు, మాదక ద్రవ్యాల తయారీలో ఎంతోకొంత పని చేయాల్సి ఉంటుంది. ఏదో ఒకటి ఇవ్వాల్సి ఉంటుంది. అయితే ఆధ్యాత్మికతలో ఇవ్వాల్సింది ఏమీ ఉండదు. చేయాల్సింది కూడా ఏమీ ఉండదు. అందుకే భారతదేశంలో ఆధ్యాత్మికవేత్తలు ఎక్కువ. ఈ ఆధ్యాత్మిక సూపర్ మార్కెట్‌లో అడిగిన వెంటనే నిర్వాణం దొరుకుతుంది. ఈమెయిల్‌లో మోక్షం అందుతుంది. ఆత్మసాక్షాత్కారంలో క్రాష్ కోర్సు ఉంటుంది. నాలుగైదు సులభ వాయిదాలలో విశ్వచైతన్యం లభిస్తుంది. ఈ ఆధ్యాత్మిక సూపర్‌మార్కెట్‌కు ప్రపంచ వ్యాప్తంగా గొలుసు దుకాణాలున్నాయి. అశాంతితో ఉన్న ఉన్నత వర్గాలు, సంపన్న కుటుంబాలు ఆ దుకాణాలలో ఆధ్యాత్మికత పేరుతో దొరికే ఫాస్ట్‌ఫుడ్ కొనుక్కుని తింటూ ఉంటాయి. అదేమిటో పూటపూటకూ రెక్కలు ముక్కలు చేసుకునే వారికి దీని అవసరమే ఉండదు.

నిజాలు చెప్పినప్పుడు ఎవరి మనోభావాలైనా దెబ్బతింటే, వారు-వారి మనోభావాల్ని మార్చుకోవాల్సి ఉంటుంది. ఎందుకంటే నిజాలు ఎప్పుడూ మారవు. వాటిని మార్చి చెప్పి కొందరికి సంతోషం కలిగించాలనుకుంటే అవి, అప్పుడు నిజాలుగా ఉండవు కదా? నిజాలు తెలుసుకోవాలనుకున్న నిజాయితీ గలవారు మనోభావాల్ని మూసి పెట్టుకుని, నిజాలు అర్థం చేసుకునే ప్రయత్నం చేయాలి! కృష్ణా కాన్షస్‌నెస్‌కు సంబంధించిన ఓ స్వామి, మనల్ని ఎలా ఆలోచించమని చెపుతున్నాడో చూడండి... దేవాలయాల అవసరం చాలా ఉంది అని, మనతోనే చెప్పించాలని చాలా తాపత్రయ పడుతున్నాడు. ఆయన ఇలా అన్నారు...

"దేవాలయాలు కట్టడానికి అనవసరంగా ధనం ఎందుకు ఖర్చు చేస్తున్నారూ? అని కొందరు అంటూ ఉంటారు. దేవాలయాలు కట్టడంకంటే పేదల ఆకలి తీర్చవచ్చు కదా? పాఠశాలలు, ఆసుపత్రులు కట్టొచ్చుకదా? అవసరమైన వారికి అవసరమైన రీతిలో ఖర్చు చేయవచ్చు కదా?" అని ప్రశ్నిస్తుంటారు. నిజమే! కానీ, క్లబ్‌లు, పబ్‌లు, సినిమా హాళ్ళు, క్రికెట్‌ల మీద ఎందుకు ఖర్చు చేస్తున్నారు - అనేది మాత్రం ఆలోచించరు. మనిషన్నాక ఎంటర్‌టెయిన్‌మెంట్ అవసరం కదా అని అంటారు. కానీ, ఎన్‌లైటెన్‌మెంట్ కూడా అవసరమని ఆలోచించరు. మనిషైన వాడికి ఆధ్యాత్మిక చింతన, ప్రశాంత జీవనం అవసరమే కదా? మానసిక వేదనలతో రోజుకు ఎంతోమంది ఆత్మహత్యలు చేసుకుంటున్నారు. అదుపుతప్పిన ఆవేశాలతో ఎందరో ఎన్నో దుర్మార్గాలు చేస్తున్నారు. వారిని సన్మార్గంలో పెట్టాల్సిన పనిలేదా? దైవ చింతనతో గడుపుతూ జీవితాన్ని సక్రమ మార్గంలో పెట్టుకోవాల్సిన పనిలేదా? మా హరేరామ హరేకృష్ణ మిషన్ లాంటివి పేదలకు ఉచిత భోజనం కూడా అందిస్తున్నాయి. మత పరమైన విహార యాత్రలు పెరిగితే, ఆర్థిక వనరులు పెరుగుతాయి. వాటి చుట్టూ మరెన్నో వ్యాపారాలు పెరుగుతాయి. ఇవన్నీ ఎందుకు ఆలోచించరూ?" అని స్వామి ప్రశ్నించారు.

ఇందులో మనం ఎన్‌లైటెన్‌మెంట్- జ్ఞానోదయం గురించి మాట్లాడే పనేలేదు. ప్రపంచ వ్యాప్తంగా ఉన్న అన్ని మతాల ప్రార్థనా స్థలాల్లో 'పూజారులు'గా ఉన్నవారికే జ్ఞానోదయం కాలేదు. ఇక ఓ గంట కోసమో, పూటకోసమో ఇలా వెళ్ళి అలా వచ్చేవారికి ఏం జ్ఞానోదయం అవుతుందీ? హరేరామ హరేకృష్ణ వాళ్ళు, సిక్కు గురుద్వార వాళ్ళు, సంత్‌సంగ్‌ల వాళ్ళు వాళ్ళదగ్గరికి వచ్చిన వారికి భోజనం పెడుతుంటారు. ఎందుకంటే వారి దగ్గరికి వచ్చినవారి సంఖ్య తగ్గిపోగూడదని! అది వారి జాగ్రత్త!! జనం ఆకలి తీర్చాలంటే మురికివాడల్లో తిండిలేక మలమల మాడుతున్న వారి దగ్గరికి వెళ్ళాలి. దేవాలయాల ముందు, మెట్ల మీద అడుక్కునేవారు ఉంటారు. వారి ఆకలి తీర్చాలి కదా?

క్రికెట్, పబ్స్, సినిమాహాళ్ళూ ఎలా వ్యాపార కేంద్రాలో- అలా అన్ని మతాల అన్ని ప్రార్థనా స్థలాలు, దేవాలయాలు కూడా వ్యాపార కేంద్రాలేనని మొదట ఒప్పుకోండి! ఎన్ని ఆత్మహత్యలు ఈ దేవాలయాలు ఆపగలిగాయి? ఎన్ని అత్యాచారాల్ని, ఎన్ని హత్యల్ని, ఎన్ని డ్రగ్స్ దందాల్ని ఈ దైవ క్షేత్రాలు ఆపగలిగాయా? ఎవరైనా లెక్కలివ్వగలరా? ఈ ఆధ్యాత్మికత ఎందమందికి ప్రశాంతత ఇవ్వగలుగుతోంది? ఎంతమందికి ఆత్మస్థయిర్యాన్ని ఇవ్వగలుగుతోంది? ప్రపంచంలో ఎక్కడా లేని ఆధ్యాత్మిక కేంద్రాలు ఈ దేశంలో ఎక్కువ! మరి ఏ దేశంలోనూ లేని అల్లకల్లోలం ఈ దేశంలో ఎందుకుందీ? ఆత్మవిమర్శ చేసుకోవాలి కదా? దేవుడొక్కడే అని చెపుతున్నప్పుడు ఇన్ని రకాల ప్రార్థనా స్థలాలు ఎందుకున్నాయి? వాటి మధ్య విభేదాలెందుకున్నాయి? వాటి కారణంగా జనం ఎందుకు విడిపోతున్నారూ? జనం మధ్య రాజకీయాలు చొరబడి అగాధాలు ఎందుకు పెంచుతున్నాయి? జనం మధ్య చిచ్చు పెట్టి ఘర్షణలకు ఎందుకు దారి తీస్తున్నాయి? ఏ మత కేంద్రంలోనైనా 'మానవత్వం' అనే మాట వినిపించదు ఎందుకూ? మనిషి ప్రమేయం లేకుండా ఏ మతానికి చెందిన ఏ దేవుడైనా ఏమీ చేయలేడని ఎందుకు ప్రకటించరు? జ్ఞానోదయం సంగతి తర్వాత చూద్దాం ముందు మీరు చెప్పే దేవదేవుణ్ణి 'నిజం' చేసి చూపండి.

దేవుడే అబద్ధం! అబద్ధానికి బంగారు కిరీటాలు పెట్టి, పట్టుబట్టలు కట్టి, గుళ్ళూ గోపురాలు కట్టి, పూజలు, భజనలు చేసినంత మాత్రాన అబద్ధం నిజమైపోతుందా? కల్పించుకున్న దేవుడు శక్తిమంతుడైపోతాడా? ఒకవైపు దేవుణ్ణి శక్తిమంతుణ్ణి చేయడానికి-మరోవైపు మనుషుల్ని విభజించి శక్తిహీనులుగా తయారు చేయడానికి రాసుకున్నదే 'మనుధర్మ శాస్త్రం'. ఇది మనుషులంతా ఒక్కటే అని చెప్పే ఆధునిక మానవవాదం ముందు నిలవదు- మనసు ప్రశాంతంగా ఉండాలంటే ఏ ప్రార్థనా స్థలమూ అక్కరలేదు. ఏ నది ఒడ్డునో, చెరువు గట్టునో, చెట్ల మధ్యో గడిపితే చాలు. ఏదీ లేకపోతే డాబామీద పడుకుని ఆకాశం, నక్షత్రాలు చూస్తూ ఆనందించగలిగితే చాలు. ఇష్టమైన సంగీతం వింటేనో, ఇష్టమైన సాహిత్యం చదివితేనో మనసు ప్రశాంతంగా ఉంటుంది. దేవాలయాల చుట్టూ, ప్రార్థనా స్థలాల చుట్టూ తిరిగి ఎన్‌లైటెన్‌మెంట్ పొందిన వాడు ఎవడైనా ఉన్నాడా? వేల వేల మందితో కలిసి, క్యూలలో నిలబడి, దైవదర్శనం గోలలో పడి, ఒళ్ళు హూనమై తలనొప్పులు తెచ్చుకునే వారికి నిజంగానే జ్ఞానోదయం కావాలి. కానీ అవుతోందా? ఆధ్యాత్మిక ప్రశాంతత-అక్కడ లభిస్తోందా? ఎవరికి వారు ఆలోచించుకోవాల్సిన విషయం. పారసిటమాల్ బిళ్ళవేసుకుంటే జ్వరం తగ్గినట్టు-ఏ ప్రార్థనా స్థలానికో పోయి కూచుంటే జ్ఞానోదయమైన ఉదంతాలున్నాయా? దేవాలయాల నిర్మాణం కన్నా పాఠశాలలు కట్టండి! ఆసుపత్రులు కట్టండి!! అని చెప్పేది ఎందుకంటే భావితరాల కోసం. ఇప్పటి పిల్లల్ని రేపటి భావిభారత పౌరులుగా తీర్చిదిద్దడం కోసం. ఇక ఆసుపత్రులుంటేనే అందరి ఆరోగ్యాలు బావుంటాయి గనుక!

> మన దేశానికి సంబంధించి ఆలోచిస్తే, ఇక్కడ వేళ్ళూనుకుని ఉన్న మను వాదాన్ని తిరస్కరిస్తూ మానవ వాదాన్ని బలపరుస్తూ ముందుకు సాగాల్సి ఉంది. పార్టీలు వేరైనా, వారు రాజకీయ ప్రత్యర్థులయినా దేశ ప్రధాని మొదలుకొని కొందరు ముఖ్య మంత్రుల వరకు చేసే పనులన్నీ ఒకటే! ప్రజా ధనాన్ని ఒకరు ఒక దేవాలయం మీద ఖర్చు పెడితే, మరొకరు మరో దేవాలయం మీద ఖర్చుపెడుతున్నారు. పూజలకు, యాగాలకు ప్రాధాన్య మిస్తున్నారు. వాటి వల్ల సామాన్యులకు ఒరిగేదేమిటి? మూఢత్వంలోంచి వారు బయటికి రాకుండా అణిచిపెట్టడమే కదా?





ప్రార్థనా స్థలాలకు వెళితే చదువురాదు, ఆరోగ్యమూ బాగుపడదు. లేని దేవుణ్ణి నమ్మి, మూఢభక్తికి అలవాటు పడి జీవితాన్ని అబద్ధంగా మార్చుకోవడం జరుగుతోంది.జబ్బులకు వైద్యం చేయించుకోకుండా దేవుడికి మొక్కుకున్నంత మాత్రాన, ముడుపులు కట్టినంత మాత్రాన, ఉపవాసాలున్నంత మాత్రాన ఎవరికీ ఏ జబ్బూ ఎప్పుడూ తగ్గలేదు. తగ్గినవి ఉంటే నిరూపించి చూపాలి కదా? ప్రార్థనా స్థలాన్ని కానీ, దైవ క్షేత్రాన్ని కానీ దర్శించుకుని వస్తే శరీరం నుంచి నెగటివ్ ఎనర్జీ వెళ్ళిపోయి పాజిటివ్ ఎనర్జీ వస్తుంది-అని కొందరు విశ్వాసకులు దుష్ప్రచారం చేస్తుంటారు. వ్యక్తిగతంగా మనిషి ఆలోచనా విధానాన్ని బట్టి పాజిటివ్, నెగటివ్‌లు ఉంటాయి తప్పితే ఏ దేవుడి దగ్గరికి వెళ్ళినా వెళ్ళకపోయినా ఏమీ ఉండదు. మొక్కులు, ముడుపులు ఎంత హాస్యాస్పదంగా ఉంటాయో చెప్పడానికి ఇక్కడ ఒక వాస్తవ సంఘటనని గుర్తుచేస్తున్నాను. ఒకసారి ఒకతను అడవిలో నడుస్తూ ఉండగా చెప్పు తెగిపోయింది. తెగిన చెప్పుతో ముందుకు నడవలేక అతను ఒక చిలిపి పనిచేశాడు. దాని పక్కన గల ఒక చెట్టుకు తెగిన చెప్పులు తగిలించి, చెట్టు పక్కన ఉన్న బండ మీద బొగ్గుతో ఇలా రాశాడు... "ఈ చెట్టు కొమ్మమీద మీ చెప్పులను వేలాడదీస్తే మీ భార్య మీ చెప్పుచేతల్లో ఉంటుంది" అని... రాసి వెళ్ళిపోయాడు. అంతే! కొన్నాళ్ళకు ఆ చెట్టు కొమ్మలకు వందల చెప్పులు వేలాడబడ్డాయి. తెగిన చెప్పులు కాదు, వాడుకుంటున్న మంచి జతలు, కొత్తగా కొన్నవీ, అన్నీ చెట్టుకొమ్మల మీదికి చేరాయి. ఆ ప్రాంతంలో అదొక ఆచారమైంది. తర్వాత కాలంలో ఆ చెప్పుల చెట్టును వెతుక్కుంటూ జనం రాసాగారు. కొంతకాలానికి ఆ చెట్టు ఎటువైపు ఉందో చూపడానికి డైరెక్షన్ బోర్డులు వెలిశాయి. చెప్పులచెట్టు - తిరనాళ్ళ అయ్యింది. ప్రతి సంవత్సరం జనం గుమిగూడి ఉత్సవం చేయడం ప్రారంభించారు. సంప్రదాయాల పేరుతో మూర్ఖత్వం ఎలా వ్యాప్తి చెందుతుందో చెప్పడానికి ఇది ఒక ఉదాహరణ! ఇలాంటివి దేశంలో అనేక చోట్ల అనేక ఉత్సవాలు జరుగుతూనే ఉన్నాయి.

"ప్రపంచం మారాలని మనం కోరుకోవడం కాదు, మార్పు మనతో మొదలైతే ప్రపంచం అదే మారుతుంది" అన్నాడు ప్రపంచ ప్రసిద్ధ రష్యన్ రచయిత లియో టాల్‌స్టాయ్. మన దేశానికి సంబంధించి ఆలోచిస్తే, ఇక్కడ వేళ్ళూనుకుని ఉన్న మను వాదాన్ని తిరస్కరిస్తూ మానవ వాదాన్ని బలపరుస్తూ ముందుకు సాగాల్సి ఉంది. పార్టీలు వేరైనా, వారు రాజకీయ ప్రత్యర్థులయినా దేశ ప్రధాని మొదలుకొని కొందరు ముఖ్యమంత్రుల వరకు చేసే పనులన్నీ ఒకటే! ప్రజా ధనాన్ని ఒకరు ఒక దేవాలయం మీద ఖర్చు పెడితే, మరొకరు మరో దేవాలయం మీద ఖర్చుపెడుతున్నారు. పూజలకు, యాగాలకు ప్రాధాన్యమిస్తున్నారు. వాటి వల్ల సామాన్యులకు ఒరిగేదేమిటి? మూఢత్వంలోంచి వారు బయటికి రాకుండా అణిచిపెట్టడమే కదా? ఒకసారి ఆలోచించండి!

/ వ్యాసకర్త కేంద్ర సాహిత్య అకాడెమీ అవార్డు గ్రహీత, విశ్రాంత బయాలజీ ప్రొఫెసర్ /

వ్యాఖ్య

పురుషాహంకార భాష ఇంకానా?

'ఆడది తిరిగి చెడింది-మగాడు తిరగక చెడ్డాడు' ఈ సామెత స్త్రీలను కట్టిపడేసే బంధిఖానాగానూ, మగవానికి అపరిమిత స్వేచ్ఛనిచ్చేదిగానూ బోధిస్తుంది. అంతే కాదు, తిరుగుబోతుతనాన్ని స్త్రీకైతే నీచమైనదిగానూ, మగవానికైతే రాచకార్యంగానూ విపరీతార్థంలో నొక్కి చెబుతుంది. స్త్రీ పురుషులిద్దరూ సమానమైనప్పుడు ఈ సామెత లేమిటి? అందులోని భాషాభావం మాటేమిటి? ఇలాంటి వాటిని ఎక్కడబడితే అక్కడ ఎలాబడితే అలా వాడి పురుషాహంకారాన్ని పెంచవచ్చునా? స్త్రీలను న్యూనత భారంలోకి నెట్టవచ్చునా? అనేది విజ్ఞులే కాదు ప్రతి ఒక్కరూ ఆలోచించాల్సిన విషయం. అందుకే సుప్రీం ధర్మాసనం ఇటీవల కంబాటింగ్ జెండర్ స్టీరియో టైప్స్ (మూసధోరణి లైంగిక భావాలను ఎదుర్కోవడం) అను కరదీపికను విడుదల చేసింది.

చట్టం దృష్టిలో అందరూ సమానులే. నిష్పక్షపాతంగా, నిర్భయంగా ఎలాంటి చెడు తలంపులేకుండా, ప్రభావం గుర్తెరిగి న్యాయం అందిస్తామని చేసే ప్రమాణానికి జెండర్ మూసధోరణి అడ్డంకిగా నిలుస్తున్నట్టు ప్రధాన న్యాయమూర్తి చంద్రచూడ్ తెలిపారు. న్యాయ వృత్తికి సంబంధించిన భాషల్లో, తీర్పుల్లో, అంతర్గతంగా పురుషాధిక్య భావజాలం ద్యోతకమవుతున్నట్టు తెలపడం మహిళా ఉద్యమం సాధించిన గొప్ప విజయంగా పరిగణించాలని ఆయన ఉద్ఘాటించారు.

స్త్రీ ఏ వయసులోనైనా పురుషుని సన్నిధిలోనే, పరాధీనంగానే బతకాలని మను ధర్మశాస్త్రం వక్కాణిస్తున్నది. కనుకనే ప్రవచనకారులు చాలామంది పతి సేవయే సతి ధర్మం అన్నట్టుగానే బోధిస్తున్నారు. కానీ స్త్రీలు తనకు లభిస్తున్న పరిమితి స్వేచ్ఛా స్వాతంత్ర్యాలతోనే ఆటంకాలను అధిగమించి, అన్ని రంగాల్లో పురుషునితో సమానంగా అభివృద్ధి పథాన ముందుంటున్న వాస్తవాన్ని అలాంటివారు జీర్ణించుకోలేక పోతున్నారు. వారి పురుషాహంకారమే వారికి అడ్డొస్తున్నది. అందుకే తీర్పు ఇచ్చే సమయంలో మీ విధేయురాలైన భార్య, మీ విశ్వసనీయమైన భార్య అన్న పదాలు కాకుండా కేవలం భార్య అని మాత్రమే రాస్తే సరిపోతుందని ఆ కరదీపిక తెలిపింది. అలాగే ఇల్లాలు స్థానంలో గృహ నిర్మాత, పతిత స్థానంలో సెక్స్ వర్కర్, పెళ్ళికాని తల్లి అని కాకుండా తల్లి అని మొదలైన సూచనలు ఆ కరదీపికలో చోటు చేసుకున్నాయి. స్త్రీలు పెద్దపెద్ద నిర్ణయాలు తీసుకోలేరు. పురుషులకన్నా తక్కువ సామర్థ్యం కలిగి ఉంటారు. ఈ భావనలతోనే స్త్రీలను అబలగా తీర్మానిస్తారు. తదనుగుణంగానే సాహిత్యాన్ని, సినిమాలను ఉత్పత్తి చేస్తారు. ఎప్పటికైనా స్త్రీలను పురుషులే రక్షించాలి. స్త్రీలను బలహీనంగానూ, సుకుమారంగానూ, పురుషులను హీరోలుగానూ, కండల వీరుడుగానూ చూపిస్తారు. ఇదంతా వాస్తవ జీవితానికి విరుద్ధమే. స్త్రీలు ఎప్పటికీ పురుషులకు అణిగిమణిగి ఉండాలని పరోక్షంగా చెప్పడమే ఇది. స్త్రీలు వారుకోరుకునే సంప్రదాయ దుస్తులే ధరించాలని, లేదంటే బరితెగించిందని, పురుషులను రెచ్చగొట్టిందని నిందలు వేస్తారు. ఇలాంటి అక్రమాలకు చెక్ పెట్టేలా ఈ కరదీపిక ఉన్నదని పలువురి అభిప్రాయం.

చాలా సినిమాల్లో స్త్రీలను ఒసేయ్, ఏమే, రావే, పోవే అని పిలవడమే ఉంటుంది. ఎందుకిలా? అని ఎవరైనా అడిగితే పురుషాధిక్య సమాజంలో ఇలానే ఉంటుంది కదా అనే సమర్థింపు జవాబులొస్తాయి. అంటే స్త్రీ-పురుష సమానత్వం, సమాన గౌరవం ఎప్పటికీ సాధించలేని ఆశయంగానే మిగిలిపోతుందన్న సత్యాన్ని గ్రహించరు. ఉత్తమ ఇల్లాలు, పతివ్రత లేదంటే అబల, కాదంటే పతిత తప్ప ఓ సాధారణ మహిళకు ఈ సమాజం ఇచ్చే నిర్వచనం ఏమిటి? అని ఆక్రోశంతో ప్రశ్నించే మహిళా లోకానికి ఈ కరదీపిక ఇప్పుడు ఓ గొప్ప ఊరట. ఆరేళ్ల క్రితం రాజధాని ఢిల్లీలో ఫెమినిస్ట్ ప్రాజెక్ట్ పేరున ఓ జాతీయ సదస్సు జరిగింది. స్త్రీల విషయాల్లో పురుష న్యాయమూర్తులు వెల్లడించిన ముప్ఫై తీర్పులను, వాడిన భాషను ఆ సదస్సు చర్చించింది. వాటిని స్త్రీవాద దృక్పథం నుండి తిరగరాస్తే ఆ తీర్పులు ఎలా ఉంటాయో కూడా తెలిపింది. అప్పుడు ఆ సదస్సుకు చంద్రచూడ్ హాజరయ్యారు.

మారిటల్ రేప్ (దాంపత్య బలాత్కారం) కూడా నేరంగా భావించాలని ఆ సదస్సు దృఢంగా భావించడం పెద్ద సంచలనం. రేప్‌లో హింసా పార్శ్వాన్ని గమనించకపోతే ఒకరు ఎప్పుడూ హింసపెట్టేవారు గాను, మరొక హింస అనుభవించేవారు గాను మిగిలిపోతారు. అప్పుడది గౌరవప్రదమైన సహజీవనం ఎలా అవుతుందని ప్రశ్నించారు. అలాగే స్త్రీలను ఇబ్బంది పెట్టే అనుచిత పదాలను ఎట్టి పరిస్థితుల్లో ఉపయోగించరాదని, ఆంగ్ల పదాలకు సరైన అర్థాలు స్ఫురించే ప్రాంతీయ భాషాపదాలు వెతకవలసి ఉందని అభిప్రాయపడ్డారు. ఈ కరదీపికలో కొన్ని తీర్పులను ఉల్లేఖించారు. ఆ సందర్భాల్లో ఏ పదాల వెనుక ఏ భావాన్ని న్యాయ మూర్తులు వ్యక్తీకరించారో సులభంగానే అర్థమవుతుంది. ఎందుకంటే అవి పురుషాధిక్యత మూసపోసిన ధోరణిలోనే ఉన్నాయి గనుక. నిష్పక్షపాత తీర్పులు ఇవ్వాల్సిన న్యాయమూర్తులు ఇలా పక్షపాతులుగా వ్యవహరించడం సరికాదు కదా? అనేది కరదీపిక సారాంశం.


- కె. శాంతారావు, సెల్ : 9959745723

చంద్రయాన్ చెప్పే పాఠం ఏమిటి?

విశ్లేషణ



గుమ్మడిదల రంగారావు



చంద్రయాన్-3 చందమామ మీద సురక్షితంగా దిగటంతో యావత్ ప్రపంచం మన శాస్త్రజ్ఞుల ప్రతిభా పాటవాలకు మురిసిపోయింది. దీనికి కొద్ది రోజుల ముందు రష్యా వాళ్ళ ఉపగ్రహం కూలిపోవడంతో మనం ఆందోళన చెందాం చంద్రయాన్ గురించి. చివరికి కథ సుఖాంతమై అందరూ ఊపిరి పీల్చుకున్నారు. దేశం గర్వపడింది మన శాస్త్రవేత్తల దీక్ష, దక్షత చూసి. ఇది ఇస్రో విజయం. భారత్ సైన్స్ విజయం. భారతీయులందరి విజయం. ఇది ఇండియన్ సైన్స్ చరిత్రలో సువర్ణాక్షరాలతో రాయవలసిన అద్భుత విజయం. అందులో ఎటువంటి సందేహమూ లేదు. అయితే ఈ విజయం మనకు ఏ పాఠం బోధించుతున్నదో ఆలోచించే సమయం వచ్చింది.

మన దేశానికి సైన్స్ సంస్కృతి, జాతీయ సైన్స్ విధానం, సైన్స్ విద్య, శాస్త్రీయ దృక్పథం అనే అంశాలను పెంపొందించటానికి విధాన రూపకల్పన ఆవశ్యకత వున్నది. దీని మీద విస్తృత చర్చ జరగాలి. రాజకీయం సంతరించుకున్న అంశం కాదు గదా అనుకోకుండా ఆ చర్చకి ప్రధాన స్రవంతి మీడియా సహకరించాలి. ఇస్రో శాస్త్రవేత్తలను ఉద్దేశించి మన ప్రధాన మంత్రి చేసిన ప్రసంగం విన్న చాలామందికి విచారం కలిగింది. శాస్త్రవేత్తలను అభినందించటం అభిలషణీయమే. కానీ ఆ సందర్భంగా ప్రధాని చేసిన వ్యాఖ్యలు పూర్తిగా అశాస్త్రీయంగా వున్నాయి. మన ఉపగ్రహం దిగిన చోటుని 'శివశక్తి'గా నామకరణం చెయ్యటం హాస్యాస్పదంగా వుంది. ఇది ఇస్రో విజయం, ఈశ్వర విజయం కాదు. సైన్స్ విజయానికి మత విశ్వాసానికి సంబంధం లేదు. చంద్రయాన్ కోసం పనిచేసిన శాస్త్రజ్ఞుల్లో అనేక మత విశ్వాసాలకు చెందిన వారు ఉండొచ్చు. వారు విశ్వాసాలతో నిమిత్తం లేకుండా కేవలం శాస్త్రీయ దృక్పథంతో ఒక ధ్యేయం కోసం అంకితభావంతో పని చేశారు. మరి అటువంటి పనికి ఒక మతపరమైన పేరు పెట్టటాన్ని ఏమనుకోవాలి? ప్రధాని ఆలోచన దేశ ప్రజల మనోభావాలను బాధించింది. ఇదేనా సైన్సు విజయానికి, శాస్త్రవేత్తలకు ఇచ్చే గౌరవం?

సైన్సు పట్ల గౌరవం వేరే విధంగా వుండాలి. రోదసి సైన్సుకి పునాదులు వేసిన హోమీబాబా, విక్రమ్ సారాభాయ్ లాంటి వారి జీవితాలను చిన్నపిల్లలకు తెలియచేయాలి. వారిలో సైన్స్ పట్ల ఇష్టం పెంచాలి. అంతేగాని ఇస్రోలో ఈశ్వర నామం ఏంటి? ఇంకా నయం. దేశ ప్రజలు చేసిన పూజలు ఫలించి, భగవంతుని ఆశీస్సులతో మన ఉపగ్రహం సురక్షితంగా దిగింది అనలేదు. మన నాయకులు ఏమన్నా ఆశ్చర్యపోవలసిన అవసరం లేదు. మన నాయకుల్లో శాస్త్రీయ దృక్పథం లేదుగనక. మతాన్ని పరిపాలనకు ఎజెండాగా చేసుకున్న నాయకులకు శాస్త్రీయ దృక్పథం ఎక్కడి నుంచి వస్తుంది? ఆగస్టు 23ని రోదసి దినోత్సవంగా ప్రకటించడం కంటి తుడుపు చర్యలా వుంది. ఇకపోతే ఇస్రోకి భారతరత్న అవార్డ్ ఎందుకు ఇవ్వకూడదు? వ్యక్తులకే కాదు సంస్థలకు గూడా ఇవ్వవచ్చు అత్యున్నత బిరుదు. ఏదో ఒక రోజున పాటించటం కాకుండా కనీసం మన స్కూళ్లలో సైంటిఫిక్ టెంపర్ అనే అంశం మీద చిన్నారుల్లో అవగాహన, ఆసక్తి కలిగించటానికి అనువైన చర్యలు తీసుకోవాలి.

చందమామ ఉపరితలానికి మన ఇష్టం వచ్చినట్లు పేర్లు పెట్టటం విడ్డూరం. చందమామ ఏమన్నా భారతీయుల సొంతమా? అక్కడ మనం దిగిన ప్రదేశానికి మన ఇష్టంవచ్చిన పేర్లు పెట్టుకోవచ్చునా? అంతర్జాతీయ చట్టం, అవగాహనా ఒప్పందాలు ఏం నిర్దేశిస్తున్నాయి? సైన్సు సాధించిన విజయంలో నుంచి సైన్స్‌ను పూర్తిగా విస్మరించి మతం రంగు పులమడం అనేది అవిద్య వలన సంక్రమించిన అజ్ఞానం. వీళ్లా మన దేశాన్ని విజయ పథంలో నడిపిస్తామని గుండెలు బాదుకుని అరిచేది? ఇటువంటి పాలకులకు సైన్సువిధానం రూపొందించే బాధ్యతను అప్పచెప్పటం సబబేనా? అందుకే సైన్స్ విధానం మీద చర్చించాల్సిన అవసరముంది. సరే దీన్ని కాసేపు ఇక్కడ వదిలేద్దాం. ఇంకా ముఖ్యమైన విషయాలున్నాయి చర్చించటానికి. మన విద్యా విధానంలో సైన్సు గురించి చిన్నారులకు తొలిసారి తెలిసేది హైస్కూల్ దశలో. ఈ దశలో పిల్లలకు సైన్సు పట్ల ఆలోచన, ఆసక్తి రేకెత్తించటానికి ముఖ్యంగా కావలసినది ప్రయోగశాల. దేశవ్యాప్తంగా ప్రభుత్వ హైస్కూళ్లలో ప్రయోగశాలలు లేవు. ఉన్నాకూడా పేరుకేగానీ అక్కడ ప్రయోగాలు జరగవు. కారణం అందరికీ తెలుసు. ప్రయోగాలకు కావలసిన పరికరాలు వుండవు. పరికరాలు అరకొరగా వున్నచోట రసాయనాలు లాంటి పదార్థాలు కొనటానికి నిధులుండవు. ఈ పరిస్థితుల్లో విద్యార్థుల్లో సైన్సు పట్ల ఆసక్తి ఏవిధంగా మొలకెత్తుతుంది? కేంద్ర ప్రభుత్వం దేశానికి విద్యావిధానం రూపొందిస్తుంది గానీ విద్య కోసం రాష్ట్రాలకు సరైన ఆర్థిక వనరులు సమకూర్చదు. వనరుల విషయానికి వస్తే విద్య ఉమ్మడి జాబితా అంశమవుతుంది. విధానానికి వస్తే ఉమ్మడి జాబితాలోని అంశాల మీద విధానాలను రూపొందించే అధికారం కేంద్రానికి వుంది అనేది ఢిల్లీ పెద్దల వాదన. మరి నేటి విద్యార్థులు రేపటి శాస్త్రజ్ఞులు ఎలా అవుతారు? మన హైస్కూళ్లలో సైన్సు విద్యను ప్రోత్సహించటానికి ఎటువంటి చర్యలు తీసుకోవాలి? చిన్నారుల మనసు సైన్సువైపు మళ్లేలా చేపట్టవలసిన కార్యాచరణ ఏమిటి? ఈ ప్రశ్నలు పాలకుల ముందుంచాలి. ముందుగా నిధుల అవసరం గుర్తించాలి. సైన్సును వ్యాప్తి చేసేవిధంగా ఉపాధ్యాయులను ప్రోత్సహించాలి. నూతన బోధనా పద్ధతి మీద ఉపాధ్యాయులలో అవగాహన కలిగించాలి. ప్రయోగశాలలను మెరుగుపరచాలి. పరికరాలు, రసాయన పదార్థాల కొనుగోలుకు వీలు కల్పించాలి. జిల్లా పరిషత్ హైస్కూళ్లలో గ్రంథాలయాలను ఏర్పాటు చేయాలి. మంచి పుస్తకాలను పిల్లలకు అందుబాటులో ఉంచాలి. వీటన్నిటికీ నిధులు కావాలి. అవి ఎక్కడ నుంచి వస్తాయి? అందుకే సైన్సు విధానం, సైన్సు విద్య, సైన్సు సంస్కృతి, శాస్త్రీయ దృక్పథం అన్న అంశాల మీద విస్తృత చర్చ జరగాలి.

మత విశ్వాసాలు బలంగా నాటుకున్న సమాజంలో శాస్త్రీయ దృక్పథం పెంపొందించటం చాలా కష్టంతో కూడుకున్న పని. ఒక సైన్సు ప్రయోగం విజయం సాధించాలని దేశం నలుమూలలా యజ్ఞయాగాలు చెయ్యటం చూసి ప్రపంచం విస్తుపోయింది. ఆ ప్రయోగం విజయవంతమయ్యాక మన ప్రధాన మంత్రి నోటి నుంచి 'శివశక్తి' అనే మాట వచ్చినప్పుడు విశ్వాసం, విజ్ఞానం కలిసిపోయినాయి. అది పెద్ద ప్రమాదాన్ని సూచించే మాట. జ్ఞాన అన్వేషణకు, జ్ఞాన సముపార్జనకు, సత్య శోధనకు విఘాతం కలిగించే మాట.

ఎంతో అభివృద్ధి చెందిన జపాన్, జర్మనీ, ఫ్రాన్స్, ఇంగ్లాండ్, నార్వే, స్వీడన్, డెన్మార్క్, ఫిన్లాండ్ వంటి దేశాలు ఈ రోదసి ప్రయోగాల జోలికి పోవటం లేదు. వారి దేశాల్లో మానవ అభివృద్ధి సూచికలను మెరుగుపరిచే దిశగా వారు పయనిస్తుంటే మనకెందుకు ఈ గోల? మన దేశ అవసరాలేమిటి? మన ప్రజల ఆశలు, ఆశయాలేమిటి? మనం చేస్తున్నదేమిటి? చంద్ర మండలం మీద దాగివున్న రహస్యాలను ఛేదించితే మన దేశానికి కలిగే ప్రయోజనం ఏమిటి? ఈ రంగం మీద మనం వెచ్చించే నిధులను విద్యా వనరులు అభివృద్ధికి వెచ్చిస్తే ఉపయోగంగా ఉంటుంది అనుకునేవారు లేకపోలేదు. కాకపోతే ఇప్పుడున్న మతమౌఢ్య వాతావరణంలో పైకి అనకపోవచ్చుగానీ వారి అభిప్రాయంలో మెరిట్ లేకపోలేదు. అన్వేషణ చేయవలసిందే. కానీ అది మనకి ఉపయుక్తంగా ఉండాలి. భూగోళంలోనే మనిషికి అంతు పట్టని అనేక అంశాలున్నాయి. వాటి మీద పరిశోధనలు చేయవచ్చు. ఉదాహరణకి మనం వాతావరణాన్ని గురించి తెలుసుకోవటంలో చాలా వెనకబడి వున్నాము. ఏ ఊరి వాతావరణం ఎలా వుంటుందో తెలుసుకోలేక పోతున్నాము. ఆరుగాలం రైతు కష్టపడి పండించిన ధాన్యాన్ని మార్కెట్ యార్డ్‌కి తీసుకొచ్చి ఆరుబయట వుంచుకుంటాడు ఎండాకాలమే కదా అనుకొని. అకాల వర్షం ముంచుకొచ్చి ధాన్యం తడిసిపోవటం మనం తరచు చూస్తుంటాము. వాతావరణ శాస్త్రం ఎంతో అభివృద్ధి చెందినాగూడా వర్షం వచ్చే విషయాన్ని ముందుగా తెలుసుకోలేకపోతున్నాం. అటువంటి అంశాల మీద మనకి పరిశోధన అవసరం. కానీ దురదృష్టం ఏంటంటే మనం వాటి జోలికి పోము.

కనీసం టాయిలెట్ సౌకర్యం గూడా లేని కుటుంబాలు కోట్లలో వున్న ఈ దేశంలో ప్రజల అవసరాలేమిటి? పాలకుల ఆలోచన ఏమిటి? ఇక్కడ పాయింట్ ఒక్కటే. పరిపాలన వైఫల్యాలను కప్పిపుచ్చి ప్రజల దృష్టిని మళ్లించటానికి, ప్రజల్లో ఒక ఫాల్స్ ప్రిస్టేజిని నింపటానికి చేసే ప్రయత్నంగా చూడాలి ఈ ప్రయోగాలను. సైన్యం విజయాన్ని, సైన్స్ విజయాన్ని నాయకులు తమ విజయంగా చెప్పుకోవటం మనకు అలవాటే. 2003లో మనం రెండవసారి అణు విస్ఫోటనం చేశాక, 2004లో భారత్ వెలిగిపోతుందనే ప్రచారంతో ఎన్నికలకు పోయింది నాటి వాజ్‌పేయి ప్రభుత్వం. కానీ అప్పుడు ప్రజలు పదేళ్ళపాటు బిజెపిని చీకట్లోకి నెట్టారు. నేడు కూడా అలా చెయ్యవలసిన అవసరం ఎంతైనా వుంది. మరి ప్రజలు తగినవిధంగా స్పందిస్తారా?

(వ్యాసకర్త లోక్‌సభ సచివాలయంలో మాజీ డైరెక్టర్)

కోటీ 18 లక్షల మంది
ఒక్క సిలిండరూ కొనలేదు

- ప్రతి నలుగురిలో ఒకరు ఒక్కటీ తీసుకోలేదు
- రాయితీ ఉన్నా గ్యాస్ కొనలేకపోతున్న ఉజ్వల యోజన లబ్ధిదారులు



న్యూఢిల్లీ : భారీగా పెరుగుతున్న ఎల్‌పిజి సిలిండర్ ధరలతో సామాన్య ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ఈ కారణంతోనే రూ.200 రాయితీ ఉన్నా 2022-23లో ప్రధానమంత్రి ఉజ్వల యోజన (పిఎంయువై) లబ్దిదారుల్లో ప్రతి నలుగురిలో ఒకరు ఒక్క సిలిండర్ కూడా తీసుకోలేదు. లేదా కేవలం ఒక్క సిలిండర్ మాత్రమే తీసుకున్నారు. రాయితీ ఉన్నా.. పిఎంయువైలో ఒక్క సిలిండర్ ధర రూ.903గా ఉంది. కాబట్టే ప్రతి తొమ్మిది మంది పిఎంయువై లబ్ధిదారుల్లో ఒకరు అంటే 1.18 కోట్ల మంది గత ఏడాదిలో ఒక్క సిలిండర్ తీసుకోలేదు. ప్రతి నలుగురిలో ఒకరు అంటే 1.51 కోట్ల మంది ఒకే ఒక్క సిలిండర్‌ను తీసుకున్నారు. సమాచార హక్కు (ఆర్‌టిఐ) ద్వారా ఇండియన్ ఆయిల్ కార్పొరేషన్ లిమిటెడ్ (ఐఓసిఎల్), భారత్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (బిపిసిఎల్), హిందుస్థాన్ పెట్రోలియం కార్పొరేషన్ లిమిటెడ్ (హెచ్‌పిసిఎల్) నుంచి సేకరించిన సమాచారంతో ఈ విషయం వెల్లడయింది. మధ్యప్రదేశ్‌కు చెందిన చంద్రశేఖర్ గౌర్ ఈ సమాచారం సేకరించారు. పిఎంయువై పథకం ప్రారంభమైన దగ్గర నుంచి 2023 మార్చి వరకూ పై మూడు కంపెనీలు ఈ పథకం కింద 9.58 కోట్ల ఎల్‌పిజి కనెక్షన్లు ఇచ్చాయి. మొత్తంగా రూ.6,664 కోట్ల విలువైన సబ్సిడీలను మంజూరు చేశాయి. 2018 జనవరి నుంచి 2023 మార్చి వరకూ పిఎంయువై సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పోలిస్తే ఈ ధరలు 82 శాతం పెరిగాయి. 2018 జనవరిలో ఈ ధర రూ.495.64గా ఉంది. మార్చి 2023 నాటికి ఈ ధర రూ.903కు పెరిగింది. తాజాగా కేంద్రం ప్రకటించిన రూ.200 తగ్గింపును పరిగణనలోకి తీసుకుంటే ఈ ధర రూ.703 అవుతుంది. సమాచారహక్కు ద్వారా సేకరించిన సమాచారం ప్రకారం 2022-23లో ఏ ఒక్క పిఎంయువై లబ్ధిదారుడు కూడా నాలుగు కంటే ఎక్కువ ఎల్‌పిజి సిలిండర్లు తీసుకోలేదు. కేంద్ర పెట్రోలియం, సహజవాయువు మంత్రిత్వ శాఖ సమాచారం ప్రకారం దేశంలో మొత్తంగా 31 కోట్ల మంది కంటే ఎక్కువ గృహ ఎల్‌పిజి వినియోగదారులు ఉన్నారు. వీరిలో 9.58 కోట్ల మంది పిఎంయువై లబ్ధిదారులు. సబ్సిడీ లేని ఎల్‌పిజి సిలిండర్ ధర కూడా మోడీ పాలనలో భారీగా పెరిగిన సంగతి తెలిసిందే. 2018 జనవరి నాటికి రూ.741గా ఉన్న 14.2 కేజీల సిలిండర్ ధర ఈ ఏడాది మార్చి నాటికి 49 శాతం పెరిగి రూ.1,103కు చేరుకుంది. (దేశరాజధానిలో ధరల ప్రకారం). కేంద్రం ఇటీవల ప్రకటించిన రూ.200 అందరికీ వర్తిస్తుంది కాబట్టి ఈ ధర ఇప్పుడు రూ.903 అవుతుంది.

మణిపూర్‌లో మళ్లీ హింసాకాండ

- నలుగురి మృతి
- భద్రతా సిబ్బందిని అడ్డుకుంటున్న మెయితీ మహిళా గ్రూపులు

ఇంఫాల్ : మణిపూర్‌లో హింసాకాండ కొనసాగుతూనే ఉంది. వరసగా మూడు రోజుల నుంచి చురచంద్‌పూర్, బిష్ణుపూర్ జిల్లాల సరిహద్దు ప్రాంతాల్లో హింసాకాండ సాగుతోంది. మెయితీల తాజా హింసాకాండలో ఇద్దరు భద్రతా సిబ్బందితో సహా నలుగురు ప్రాణాలు కోల్పోయారు. మరో 15 మంది తీవ్రంగా గాయపడ్డారు. హింసాకాండ జరుగుతున్న ప్రాంతాల్లోకి వెళ్లకుండా అదనపు భద్రతాదళాలను మెయితీ మహిళా గ్రూపులు అడ్డుకుంటున్నాయి. మెయితీలు తమ ఆధిపత్య ప్రాంతాల్లో మోర్టార్ షెల్స్ వంటి అధునాతన ఆయుధాలతో దాడికి పాల్పడుతున్నారని కుకీలు తెలిపారు. ఈ దాడిలో తమ గ్రామాలు ధ్వంసమయ్యాయని, గ్రామ రక్షణ కోసం నియమించిన పలువురు గార్డులు మరణించారని, అనేకమంది గాయపడ్డారని కుకీ గ్రూపులు తెలిపాయి. ఖౌసాబుంగ్, కుంగ్వాయి, సుగ్ను ప్రాంతాలు దాడికి గురయ్యాయని పేర్కొన్నాయి. భద్రతా సిబ్బందిపైనా కాల్పులకు మెయితీ గ్రూపులు తెగబడుతున్నాయి. ఈ దాడులకు వ్యతిరేకంగా చురచంద్‌పూర్ బంద్‌కు కుకీ గ్రూపు ఇండిజినియస్ ట్రైబల్ లీడర్స్ ఫోరమ్ (ఐటిఎల్ఎఫ్) పిలుపునిచ్చింది. తాజా మృతుల్లో ఒక సంగీతకారుడు కూడా ఉన్నారు. కుకీలను ఉత్తేజపరిచేవిధంగా 'ఇది మా భూమి కాదా..' అనే పాటను స్వరపరిచిన ఎల్ఎస్ మంగోబ్‌య్ (42) మెయితీల దాడిలో ప్రాణాలు కోల్పోయారు. మెయితీల కాల్పుల్లో తీవ్రంగా గాయపడిన మంగోబ్‌య్‌ను ఆసుపత్రికి తీసుకుని వెళుతుండగా మరణించినట్లు కుకీ సంఘాలు తెలిపాయి.

సెబీ నిబంధనలకు అదాని పాతర

ముంబయి: అడ్డగోలుగా తమ ఆస్తుల విలువను పెంచేందుకు సెబీ నిబంధనలకు అదానీ పాతరేశారు. ఏదైనా ఒక కంపెనీ తన సొంత షేర్లను 75 శాతం మాత్రమే కలిగివుండాలని, మిగతా 25 శాతం ప్రజలకు అందుబాటులో ఉంచాలనేది సెబి నిబంధన. అదానీ ఈ నిబంధనను తుంగలో తొక్కి కేవలం పది శాతం షేర్లను మాత్రమే ప్రజలకు అందుబాటులో ఉంచారు. అలా చేయడం ద్వారా షేర్ల ధరలను తేలికగా తారుమారు చేయొచ్చు. అదాని ఈ పని చేయడం ద్వారా భారత సెక్యూరిటీ చట్టాలను ఉల్లంఘించడమేనని నిపుణులు చెబుతున్నారు. అహ్లి, చాంగ్‌లు అదాని గ్రూపు కోసం పనిచేశారన్న ఆరోపణే గనుక రుజువైతే అది సెబీ నిబంధనలను ఉల్లంఘించడమే అవుతుంది. అదాని ఫ్లాగ్‌షిప్ కంపెనీలైన అదాని ఎంటర్‌ప్రైజెస్, అదాని పవర్, అదాని ట్రాన్స్‌మిషన్ అనే మూడు కంపెనీల్లో అమెరికాకు చెందిన అహ్లికి 12 శాతం, తైవాన్‌కు చెందిన చాంగ్ లింగ్‌కు 14.4శాతం షేర్లు ఉన్నట్లు ఫైనాన్షియల్ టైమ్స్ పత్రిక తెలిపింది. అంటే ఈ కంపెనీల షేర్లలో పది శాతం మాత్రమే బహిరంగ మార్కెట్‌లో అందుబాటులో ఉన్నాయన్న మాట. ఇద్దరు విదేశీ వ్యక్తులకు వాటాలను ఎలా కట్టబెట్టారనేది ఇక్కడ ఒక ప్రశ్న. ఇంతకుముందు హిండెన్‌బర్గ్ చేసిన సంచలనాత్మక ఆరోపణలపై విచారణ నిర్వహించి అదానీకి క్లీన్ చిట్ ఇచ్చిన పెద్ద మనిషి ఇప్పుడు అదానీ కంపెనీ టివి చానెల్ ఎన్డీటివిలో డైరక్టర్‌గా ఉన్నారు.దీనిని బట్టే ఆ విచారణ ఎంత బూటకమో అర్థమవుతూనే ఉంది.

దక్షిణాఫ్రికాలో దారుణం

- ఐదంతస్తుల భవనంలో మంటలు
- 73 మంది సజీవదహనం

జొహన్నెస్‌బర్గ్: దక్షిణాఫ్రికాలో దారుణం జరిగింది. జొహన్నెస్‌బర్గ్ నగరంలో ఐదంతస్తుల భవనంలో గురువారం తెల్లవారుజామున మంటలు చెలరేగి 73 మంది సజీవదహనమయ్యారు. అనేక మందికి తీవ్రగాయాలయ్యాయి. మంటలు అదుపులోకి వచ్చినా భవనమంతా దట్టమైన పొగ అలుముకొని ఉండటంతో సహాయక చర్యలకు ఆటంకం కలుగుతోందని అధికారులు తెలిపారు. అగ్నిప్రమాదానికి కారణాలు తెలియరాలేదు. అర్ధరాత్రి దాటాక అందరూ నిద్రపోతున్న సమయంలో ఈ ప్రమాదం చోటుచేసుకోవడంతో భారీగా ప్రాణనష్టం సంభవించింది. వలస వచ్చిన వారు, నిరాశ్రయులు ఎలాంటి లీజ్ అగ్రిమెంట్లు లేకుండానే ఈ భవనంలో నివాసముంటున్నారని, అందువల్ల భవనంలో చిక్కుకుపోయిన వారిని వెతకడం కష్టంగా మారిందని అధికారులు చెబుతున్నారు. ఈ భవనంలో సుమారు 200 మంది నివాసముంటున్నట్లు స్థానికులు తెలిపారు.

విచారణ అంటే ఎందుకంత వణుకు?

అదాని అక్రమాలపై మోడీని ప్రశ్నించిన రాహుల్ గాంధీ

ముంబయి : అదానీ గ్రూపు అక్రమాలపై ఆధారాలు ఉన్నా, విచారణ జరపడానికి ఎందుకు జంకుతున్నారని మోడీని కాంగ్రెస్ నాయకులు రాహుల్ గాంధీ సూటిగా ప్రశ్నించారు. గురువారం నాడిక్కడకు వచ్చిన రాహుల్ మీడియాతో మాట్లాడుతూ 'మోసపూరిత మార్గాల్లో అదానీ గ్రూపు షేర్ల ధరలు కృత్రిమంగా పెంచారు. షేర్ల పెరుగుదలతో వచ్చిన సొమ్ముతో అదానీ ఎన్నో ఆస్తులు కొనుగోలు చేశారు. ఈ డబ్బంతా ఎవరిది.. అదానీదేనా? ఇంకెవరిదైనా?. ఈ మొత్తం అక్రమాలకు సూత్రధారి గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదాని అనే పెద్ద మనిషి. నాసర్ అలీ, ఛాంగ్ చుంగ్ లింగ్ దీని వెనుక ఉన్నట్టు కథనాలు వచ్చాయి. గతంలో వచ్చిన ఆరోపణలపై అదానీ గ్రూప్‌నకు సెబీ క్లీన్ చిట్ ఇచ్చింది. అదానీకి క్లీన్ చిట్ ఇచ్చిన వ్యక్తి ఇప్పుడు ఎన్‌డిటివిలో డైరెక్టర్‌గా ఉన్నారు. ఇది స్వతంత్ర భారత దేశంలో అతి పెద్ద కుంభకోణం. అయినా ఎందుకు విచారణ జరిపించరు?" అని ప్రశ్నించారు. 'అదానీ గ్రూప్ వ్యవహారంపై జాయింట్ పార్లమెంట్ కమిటీ విచారణకు ఎందుకు అనుమతించడంలేదు. విచారణ కోసం ప్రధాని నరేంద్ర మోడీ ఎందుకు చొరవ తీసుకోవడంలేదు. ఈ కుంభకోణానికి పాల్పడిన వాళ్లను జైళ్లో ఎందుకు పెట్టడంలేదు? త్వరలో ఢిల్లీలో జి20 సమావేశం జరగబోతోంది. ఈ సమావేశంలో అదానీ గ్రూప్‌పై విదేశీ నేతలు ప్రశ్నిస్తే ఏం సమాధానం చెబుతాం' అని రాహుల్ ప్రశ్నించారు. 'దేశ ఆర్థిక వ్యవస్థపై స్వారీ చేసేందుకు అదానీకి ఎందుకు అనుమతిస్తున్నారు. అదానీ గ్రూపు వ్యవహారంపై జెపిసి విచారణకు అనుమతించాలని, సమగ్ర దర్యాప్తు జరిపించాలని ఆయన డిమాండ్ చేశారు.


అదాని అక్రమాలు

(మొదటి పేజీ తరువాయి)

పెట్టేశాయని ఒసిసిఆర్‌పి పేర్కొంది. దీంతో ఆ తరువాత కూడా అదాని గ్రూపు మార్కెట్ మాయాజాలం కొనసాగింది.

ఇండియా టు ఇండియా
వయా దుబాయ్, మారిషస్, బెర్ముడా

బెర్ముడాలోని గ్లోబల్ ఆపర్చునిటీస్ ఫండ్ అదానీ గ్రూపుల్లో భారీగా పెట్టుబడులు పెట్టింది. పైపైన చూస్తే ఈ వ్యవహారం సజావుగా సాగినట్టు,, ఏ మాత్రం వివాదం లేనట్టు కనిపిస్తుంది. పైగా ఈ సంస్థ పెట్టుబడుల తరువాత అదానీ షేర్ల విలువలు భారీగా పెరిగాయి. కానీ, కొంచెం లోతుగా పరిశీలిస్తే ఇద్దరు వ్యక్తులు ఒక వ్యూహం ప్రకారం, నిర్దిష్ట ప్రయోజనాన్ని ఆశించి నిధుల ప్రవాహానికి గేట్లు ఎత్తినట్టు స్పష్టంగా అర్థమవుతుందని ఫైనాన్షియల్ టైమ్స్ పేర్కొంది. ఒసిసిఆర్‌పి నివేదిక ప్రకారం ఈ ఇద్దరిలో ఒకరు యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్‌కు చెందిన నజీర్ అలీ షబాన్ అహ్లీ కాగా, మరోకరు తైవాన్‌కు చెందిన చాంగ్‌చుంగ్ లింగ్! వీరిద్దరు గోతమ్ అదాని సోదరుడైన వినోద్ అదానికీ అత్యంత సన్నిహితులు. వీరి ఆర్థిక లావేదేవీలు వినోద్ అదాని కార్యాలయం నుండే పర్యవేక్షిస్తున్నారు. ' నాసర్ అలీ షాబాన్ అహ్లీ, చాంగ్ చుంగ్ లింగ్ అనే ఇద్దరు వ్యక్తులు అదానీ కుటుంబంతో దీర్ఘకాలంగా వ్యాపార సంబంధాలు కొనసాగిస్తున్నారు. గౌతమ్ అదానీ సోదరుడు వినోద్ అదానీకి చెందిన పలు కంపెనీల్లో వీరు డైరెక్టర్లుగా, వాటాదారులుగా కూడా వ్యవహరించారు. వీరు విదేశీ ఫండ్ల ద్వారా అదానీ గ్రూప్ షేర్లను క్రయ, విక్రయాలు చేస్తున్నారు. స్టాక్స్ ధరను కృత్రిమంగా పెంచి ఫలితంగా గణనీయంగా లాభాలను ఆర్జించారు.' అని ఒసిసిఆర్‌పి తన రిపోర్ట్‌లో వెల్లడించింది.



నిధుల అక్రమ ప్రవాహం ఇలా...!

స్మగ్లింగ్, ఆర్థిక నేరాలపై పనిచేసే మన దేశానికి చెందిన డైరక్టరేట్ ఆఫ్ రెవిన్యూ ఇంటిలిజెన్స్ (డిఆర్ఐ), సెబీలు చేసిన దర్యాప్తును ఉటంకిస్తూ ఒసిసిఆర్‌పి రూపొందించిన నివేదికలో 2009వ సంవత్సరంలో అహ్లీ దుబాయ్‌లో ఒక షెల్ కంపెనీని ఏర్పాటు చేశాడు. ఆ వెంటనే అదాని ప్రాజెక్టులకు సరఫరా చేయడానికి చైనాకు చెందిన విద్యుత్ పరికరాల తయారీదారులతో ఒప్పందం కుదర్చుకున్నాడు. అదే సమయంలో అహ్లీ మారిషస్‌లో మరో డొల్ల కంపెనీని ఏర్పాటు చేశాడు. కొంత కాలం తరువాత దీని యాజమాన్యం చాంగ్‌కు బదిలీ చేశాడు. 2010లో వినోద్ అదాని దుబాయ్‌లో ఎలక్ట్రో జెన్ ఇన్‌ఫ్రాను మారిషస్‌లో ఎలక్ట్రో జెన్ ఇన్‌ఫ్రా హోర్డింగ్స్‌ను ఏర్పాటు చేశాడు. ఈ సంస్థల ద్వారా అహ్లీ, చాంగ్ కంపెనీలకు 900 మిలియన్ డాలర్లు బదిలీ అయినట్టు డిఆర్ఐ కనుగొంది. యంత్రాలు, విద్యుత్ పరికరాల కొనుగోలు పేరిట ఈ లావాదేవీలు జరిగాయి. వీరు ఆ మొత్తాన్ని మరో మూడు షెల్ కంపెనీల ద్వారా గ్లోబల్ ఆపర్చ్యునిటీస్ ఫండ్‌కు తరలించి అదాని స్టాక్స్‌లో పెట్టుబడిగా పెట్టారు. ఎలక్రోజెన్ మారిషస్, అసెంట్ ట్రేడ్ అండ్ ఇన్వెస్ట్‌మెంట్ అనే మరో డొల్ల కంపెనీనుండి 100 మిలియన్ డాలర్లను వినోద్ అదాని అప్పుగా తీసుకున్నాడు. రుణదాతగానూ, రుణగ్రహీతగానూ ఆయనే సంతకం చేయడం ఆసక్తికరమైన విషయం. ఆ మొత్తాన్ని ఆయన ఆసియా విజన్ ఫండ్ అనే మారిషస్‌కు చెందిన మరో డొల్ల సంస్థ ద్వారా అదాని గ్రూపు లోకి మళ్లించారు.

నిబంధనలకు విరుద్ధం ...

అహ్లీ, చాంగ్‌లు అదాని గ్రూప్ ప్రమోటర్ల తరపున వ్యవహరిస్తున్నట్లు భావిస్తే.. ఆ గ్రూపు కంపెనీల్లోని ఇన్‌సైడర్లే 75 శాతానికి పైగా వాటాను సొంతం చేసుకున్నట్లు అవుతుందని ఒసిసిఆర్‌పి పేర్కొంది. ఇది భారత లిస్టింగ్ కంపెనీల నిబంధనలకు విరుద్ధమని పేర్కొంది,. అదానీ గ్రూపు స్టాక్స్‌లో వారి కుటుంబ సభ్యుల సమన్వయంతోనే అహ్లీ, చాంగ్‌లు ట్రేడింగ్ జరిపారని తమ పరిశోధనలో ఆధారాలు లభించాయని తెలిపింది. 2013లో 8 బిలియన్ డాలర్లుగా (దాదాపు రూ.66వేల కోట్లు) ఉన్న అదాని గ్రూపు కంపెనీల మార్కెట్ కాపిటలైజేషన్.. గతేడాదికి 260 బిలియన్లకు (దాదాపు రూ.21 లక్షల కోట్లు) చేరిందని వెల్లడించింది. అదాని గ్రూపు అక్రమాలు 2014లోనే నిర్ధారణ అయినప్పటికీ ఆ తరువాత కేంద్రంలో మోడీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో డిఆర్ఐ, సెబీల దర్యాప్తు అంతటితో ఆగిపోయింది. ఎటువంటి చర్యలు తీసుకోలేదు. దీనికి కారణం ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. అయితే, ఈ ఆరోపణలను అదాని గ్రూపు ఖండించింది. తమపై చేసిన అరోపణలకు ఎలాంటి ఆధారాలు లేవని కొట్టిపారేసింది.

అదాని షేర్ల నేల చూపులు..

ఒసిసిఆర్‌పి రిపోర్ట్‌లో అదాని గ్రూపు కంపెనీల షేర్లు గురువారం తీవ్ర ఒత్తిడికి గురయ్యాయి. మార్కెట్ల ప్రారంభం నుంచే ఒడిదుడుకులను ఎదుర్కొన్నాయి. అదాని గ్రూపులోని కీలక కంపెనీగా ఉన్న అదాని ఎంటర్‌ప్రైజెషన్ షేర్ బిఎస్ఇలో 3.77 శాతం పతనమై రూ.2,418.80కు పడిపోయింది. అదాని పోర్ట్స్, అదాని పవర్, అదాని గ్రీన్, అదాని టోటల్ గ్యాస్, అదాని ఎనర్జీ సొల్యూషన్స్, అదాని విల్మర్ సూచీలు 2 శాతం నుంచి 4.3 శాతం మేర క్షీణించాయి. ఒసిసిఆర్‌పి రిపోర్ట్‌తో అదాని గ్రూపు కంపెనీల షేర్లు దాదాపు రూ.25వేల కోట్ల మేర నష్టాలు చవి చూశాయని అంచనా. ఇంతక్రితం జనవరిలోని హిండెన్‌బర్గ్ రిపోర్ట్ దెబ్బకు అదాని గ్రూపు కంపెనీల షేర్లు 50 శాతం పైగా నష్టపోయిన విషయం తెలిసిందే.



ప్రత్యేక సమావేశంలో వామపక్ష నేతలు

ప్రజాస్వామ్యాన్ని కాపాడడమే లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

ఆర్‌జెడి నేత మనోజ్ ఝా అన్నారు.

ప్రధానిని, బిజెపిని కలవరపెడుతుంది: సీతారాం ఏచూరి

ఇండియా కూటమి పట్ల ప్రజల స్పందన ప్రధానమంత్రిని, బిజెపిని కలవరపెడుతుందని సిపిఎం ప్రధాన కార్యదర్శి సీతారాం ఏచూరి అన్నారు. దేశ రాజ్యాంగాన్ని, ప్రజల హక్కులను కాపాడడమే ఇండియా కూటమి లక్ష్యమని పేర్కొన్నారు.

రాజ్యాంగాన్ని కాపాడాలి: డి రాజా

సిపిఐ ప్రధాన కార్యదర్శి డి. రాజా మాట్లాడుతూ, దేశంలో నెలకొన్న పరిస్థితుల నేపథ్యంలో లౌకిక ప్రజాస్వామ్య పార్టీలన్నీ ఏకతాటిపైకి వచ్చి బిజెపిని ఓడించాలన్నారు. రాజ్యాంగాన్ని కాపాడుకోవాల్సిన అవసరం ఉందన్నారు.

దేశానికి యువతే బలం: మెహబూబా ముఫ్తీ

యువతే దేశానికి బలమని పిడిపి నేత మెహబూబా ముఫ్తీ అన్నారు. "జవహర్‌లాల్ నెహ్రూ నుండి మన్మోహన్ సింగ్ వరకు నాయకులు యువతకు దిశానిర్దేశం చేయడానికి జెఎన్ యు, ఐఐఎంలు, ఇస్రో వంటి సంస్థలను స్థాపించడానికి కృషి చేశారు. దాని వల్లే ఈరోజు మనం చంద్రుడిని చేరుకోగలిగాం" అని ఆమె అన్నారు.

ఇండియా కూటమిపై ప్రజలకు విశ్వాసం ఉంది: అఖిలేష్ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ అధినేత అఖిలేష్ యాదవ్ మీడియాతో మాట్లాడుతూ ఇండియా కూటమిని ప్రజలు విశ్వసిస్తున్నారని అన్నారు. ఇండియా కూటమి నిరంతరం సమావేశాలు జరుపుతున్నందుకు సంతోషంగా ఉందన్నారు. బిజెపిని ఓడించడంలో తమ కూటమి విజయం సాధిస్తుందని ప్రజలు విశ్వసిస్తున్నారని ఆయన అన్నారు.

ఇండియా ఆత్మను కాపాడే కూటమి': రామ్ గోపాల్ యాదవ్

సమాజ్‌వాదీ పార్టీ నేత రామ్‌గోపాల్ యాదవ్ మాట్లాడుతూ "దేశ ఆత్మను కాపాడేందుకే ప్రతిపక్ష పార్టీల కూటమి ఏర్పడింది. అధికారంలో ఉన్న వ్యక్తులు దేశం అసలు ఆత్మను నాశనం చేయడం ద్వారా భారతదేశాన్ని నాశనం చేస్తున్నారు. ఈ కూటమి లక్ష్యం 2024లో బిజెపిని గద్దె దించడమే" అని అన్నారు.

బిజెపి భయపడుతుంది: రాఘవ్ చద్దా

ఇండియా కూటమికి బిజెపి భయపడుతోందని ఆప్ నేత రాఘవ్ చద్దా అన్నారు. "వారికి ఇండియా అనే పదం పట్ల ద్వేషం ఉంది. పేరును ఉగ్రవాద సంస్థతో ముడిపెడుతున్నారు. ఇది ద్వేషం మాత్రమే కాదు, కూటమి విజయవంతమైతే (ఏమిటి) అనే భయం కూడా ఉంది. కానీ ఈ కూటమి దేశంలోని కోట్లాది మంది ప్రజలది. దీనిని ఓడించలేరు" అని ఆయన అన్నారు.

'ఇండియా కూటమి ప్రధాని అభ్యర్థి కి అనేక ఎంపికలు ఉన్నాయి. బిజెపికి ఒక్కటే ఉంది': ఉద్ధవ్ థాకరే

శివసేన (యుబిటి) చీఫ్ ఉద్ధవ్ థాకరే మాట్లాడుతూ ఇండియా కూటమికి ప్రధాన మంత్రి అభ్యర్థి కోసం అనేక ఎంపికలు ఉన్నాయని, అధికార బిజెపికి ఒక్కటే ఉందని అన్నారు. "గత తొమ్మిదేళ్లుగా మనం చూస్తున్న ఒకే ఒక్క ఆప్షన్ ఉన్న బిజెపిని ప్రధానమంత్రి పదవికి ఎంపిక గురించి ప్రశ్న అడగాలి. ఇండియా కూటమికి ప్రధానమంత్రి పదవికి అనేక ఎంపికలు ఉన్నాయి. బిజెపికి ఏ ఎంపిక ఉంది?" థాకరే ప్రశ్నించారు. దేశంలోని ప్రజాస్వామ్యాన్ని, రాజ్యాంగాన్ని పరిరక్షించేందుకు ఇండియా కూటమి నేతలు ఒక్కటయ్యారని శివసేన (ఉద్ధవ్ థాకరే) నేత ఆదిత్య థాకరే అన్నారు.

దేశానికి సమిష్టి నాయకత్వం అవసరం: జయంత్ చౌదరి

"సమాజంలోని అన్ని వర్గాల అవసరాలు, ఆకాంక్షలకు ప్రతిస్పందించే సమిష్టి నాయకత్వం దేశానికి అవసరం. రాజ్యాంగపరమైన బాధ్యతల పట్ల సున్నితంగా ఉండే ప్రభుత్వం మనకు అవసరం" అని ఆర్ఎల్‌డి అధ్యక్షుడు జయంత్ చౌదరి అన్నారు.

ఎన్‌సిపి అధినేత శరద్ పవార్ ప్రముఖులకు విందు ఏర్పాటు చేయగా, శివసేన (ఉద్ధవ్ థాకరే) ఇతర ఏర్పాట్లకు ఇన్‌ఛార్జ్‌గా వ్యవహరించారు.

వామపక్షాల ప్రత్యేక భేటీ

ఇండియా కూటమి సమావేశానికి వచ్చిన వామపక్ష పార్టీల నేతలు విడిగా సమావేశమయ్యారు. శుక్రవారం జరిగిన సమావేశంలో వామపక్షాలు చేసిన చర్చలకు సంబంధించి ఓ అంగీకారం కుదిరింది. శుక్రవారం జరిగే సమావేశంలో ఎన్నికలకు ముందు జాతీయ ఎజెండా రూపొందించేందుకు వామపక్షాలు ప్రతిపాదనలు సిద్ధం చేయనున్నాయి. ఈ సమావేశంలో సీతారాం ఏచూరి, డి రాజా, అశోక్ ధావలే, మనోజ్ భట్టాచార్య, బినోయ్ విశ్వం, జి దేవరాజన్ తదితరులు పాల్గొన్నారు.



మీకోసం

సీసాలు, డబ్బాల మూతలు బిగుసుకుని రాకపోతే, ఒక రబ్బరు బ్యాండుని మూతకి పెట్టి తీస్తే సులభంగా ఊడిపోతుంది.

జీవన సౌరభం

సామర్థ్యంతో పాటు కష్టించి పనిచేస్తేనే విజయాల్ని పొందగలం.

చెట్టంటే నాకిష్టం



తరువేరా జీవితానికి
వెలుగునిచ్చే వెన్నెలా
తరువేరా బతుకు బాటకు
తోవ చూపే తల్లిరా


నీడనిచ్చి గాలినిచ్చే
ప్రాణవాయువూ..
కాలుష్యం బారినుండి
మనల్ని కాపాడేది వృక్షమేరా

పూలనిచ్చి కాయనిచ్చి
పలు రకాల పండ్లనిచ్చి
అందరి ఆరోగ్యం కోసం
పాటు పడును చెట్టుయేరా

జంతువులకు పక్షులకు
అడవితల్లి బిడ్డలకు
జగతిలోని జీవరాశులకు
ఆశ్రయమిచ్చేది తరువేరా

కలప కొరకు డబ్బు కొరకు
చెట్టు నరకబోకురా
ఒక చెట్టును నరికితేను
పది చెట్లను పెంచరా

- ద్వారపురెడ్డి జయరాం నాయుడు



లెక్క చేయండి


పిల్లలూ, ఇక్కడ బాక్సులో ఉన్న రకరకాల బొమ్మలను ఒక్కొక్కటిగా లెక్కపెట్టండి. ఏవి ఎన్ని ఉన్నాయో పక్కనే ఉన్న బాక్సులో వేసి మొత్తం సంఖ్య, ఇచ్చిన సమాధానానికి సరిపోయిందో లేదో చూడండి.

నేను గీసిన బొమ్మ





బోయిని సాత్విక,
ఏడవ తరగతి,
జక్కాపూర్,
సిద్దిపేట జిల్లా.



నేర్చుకుందాం

పిల్లలూ, ఈ రోజు మనం కుందేలు బొమ్మ గీయడం నేర్చుకుందామా..

పిల్లలూ, మీ కథలు, బొమ్మలూ పంపండి. ఇదిగో మెయిల్ ఐడీ: chinnaarips@gmail.com

మూర్తీభవించిన మానవత్వం

ఆయనేం ఐశ్వర్యవంతుడేమీ కాదు. సామాన్య ఉద్యోగి. అయితేనేం.. నిలువెత్తు మూర్తీభవించిన సేవాగుణం అతనిలో ఉంది. కష్టం.. సుఖం... తెలిసిన వ్యక్తి. పేదరికంలో పుట్టిన వారి జీవన విధానం తెలిసిన రైతు కుటుంబీకుడు. ఆయన పేరు కొమిరి కృష్ణమూర్తి. వృత్తిరీత్యా కానిస్టేబులు. మదర్‌థెరిస్సా, స్వామి వివేకానంద, అంబేద్కర్, ఎపిజె అబ్దుల్‌కలాం వంటి ప్రముఖుల జీవితాలను ఆదర్శంగా తీసుకున్నారు. తనవంతుగా సమాజ సేవలో భాగంగా నిలుస్తున్నారు. పార్వతీపురం మన్యం జిల్లా పట్టణ పోలీస్‌స్టేషన్‌లో హెడ్‌కానిస్టేబుల్‌గా పనిచేస్తున్న కృష్ణమూర్తి, అన్నార్తులు, అభాగ్యులకు చేదోడుగా ఉంటున్నారు.



తెల్లవారి లేచింది మొదలు రాత్రి నిద్రపోయే వరకూ పోలీసులకు అనేక పనులుంటాయి. నేరస్తులు, నేరాలు-ఘోరాలు, తగాదాలు, విచారణలు, దర్యాప్తులు, రహదారి ప్రమాదాలు, క్షతగాత్రులకు సేవలు, మృతదేహాలకు కాపలా, కోర్టుల చుట్టూ ప్రదక్షిణలు తప్పవు. వీటన్నింటినీ మధ్య కూడా మానవత్వం వెల్లివిరుస్తోందంటే అది కృష్ణమూర్తి లాంటి వారిని చూసి తెలుసుకోవచ్చు. ఎవరైనా పల్లెల నుంచి ఫిర్యాదు చేయటానికి వస్తే వారు నేరగాళ్లయినా సరే భోజనం చేశారా? అంటూ మర్యాద పూర్వకంగా పలకరిస్తారు. భోజనం చేయలేదనో, చేసేందుకు డబ్బులు లేవనో చెబితే తన జేబులో ఉన్న డబ్బులిచ్చి ఏదైనా తిని రమ్మని చెబుతారు. అది ఆయన ఉదార స్వభావానికి నిదర్శనం.

ఆసుపత్రి, కోర్టు కేసులను చూసే కృష్ణమూర్తి ఎవరికైనా అనారోగ్యం బాగోలేదంటే సాయమందిస్తారు. సాధారణంగా మండలంలోని ఏజెన్సీ గ్రామాలైన తమ్మందొరవలస, సువందరవలస, లక్ష్మీపురంవలస తదితర గ్రామాల నుంచి వచ్చే గిరిజనానికి తిరిగి ఇంటికి వెళ్లేందుకు కూడా డబ్బులు ఉండవు. తినడానికి తిండి ఉండదు. అలాంటి వారికి ఆసరాగా ఉండి డబ్బులు ఇవ్వడమో లేదా రవాణా సౌకర్యం ఏర్పాటు చేయటమో ఆయన అలవాటు. ఎవరైనా సరే ఆకలిగా తన జేబులో డబ్బులు లేకుంటే ఇతరుల వద్ద తీసుకుని అయినా వారికి అందిస్తారు. అది ఆయన తత్వం. ఫీజులు కట్టలేకపోతున్నామనీ, ఆరోగ్యం కోసం ఆసుపత్రుల్లో వైద్యానికి సహాయం కావాలనీ కోరితే తనవంతుగా ఆర్థిక సహాయం చేస్తుంటారు. వివిధ ప్రమాదాలు, అగ్నిప్రమాదాలు, ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డుప్రమాదాలు వంటివి జరిగినప్పుడు కూడా సాయం చేయడంలో కృష్ణమూర్తి ముందుంటారు. ఎవరైనా చనిపోయినప్పుడు, అనారోగ్యంతో ఇబ్బందులు పడుతున్నప్పుడు ప్రత్యేకంగా జీపు వంటి వాహనాలు ఏర్పాటు చేస్తుంటారు. కరోనా కష్టకాలంలో కూడా తనవంతుగా ఆర్థిక సహాయంతో పాటుగా, మందులు, నిత్యావసర సరుకులు అందజేశారు. అభాగ్యులు, పేదలు ఎవరైనా చనిపోతే వారి దహన సంస్కారాలకు ఆర్థిక సహాయం వంటివి చేశారు. ఫీజులు కట్టలేకపోతున్నామనీ, పిల్లల చదువులు ఆగిపోయేలా ఉన్నాయని ఎవరైనా వస్తే ఇట్టే తనకు తోచినమేరకు నగదు ఇచ్చి పంపుతుంటారు.



వృద్ధుల సేవలో కోఆర్డినేటర్‌గా...

కృష్ణమూర్తి సేవాదృక్పథాన్ని గుర్తించిన పోలీసు ఉన్నతాధికారులు ఆయనను వృద్ధమిత్ర కోఆర్డినేటర్‌గా నియమించారు. 2017 నుంచి కృష్ణమూర్తి తనకొస్తున్న జీతంలో ప్రతినెలా రూ.10 వేలు తన జీతం నుంచి సేవా కార్యక్రమాలకు



వెచ్చిస్తున్నారు. వృద్ధులకు ఆర్థిక సాయం, చీరలు, పంచెలు, దుప్పట్లు ఇవ్వడం చేస్తున్నారు.

తండ్రి బాటలో ... : వీరఘట్టం మండలం కొట్టుగుమ్మడలో కొమిరి అప్పలసూరి, పార్వతమ్మ దంపతులకు కృష్ణమూర్తి జన్మించారు. తండ్రి వ్యవసాయం చేస్తూ కుటుంబాన్ని పోషించారు. ఎవరికైనా సాయమందించటంలో తండ్రి ముందుండే వారు. చదువు, సంస్కారంతోపాటు నాన్న నుండి అలవడిన సేవా గుణం కృష్ణమూర్తిలో పెరిగింది. ఇప్పటికీ నేరగాడు ఎదురుపడినా కూడా 'బాగున్నావా' అనే తప్ప ఆయన నోటి వెంట మరో ఉచ్చారణ ఉండదు. 1993లో కృష్ణమూర్తి పోలీసు కానిస్టేబుల్‌గా ఉద్యోగ బాధ్యతలు స్వీకరించారు. మొదటి నెల జీతం తీసుకున్నప్పటి నుంచి ఇలా ఏదో ఒక సేవా కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నారు. తన మిత్రుడు పెద్దఎత్తున సేవా కార్యక్రమాలను నిర్వహిస్తున్నాడని తెలుసుకున్న తమ బ్యాచ్ ఫ్రెండ్స్ ఇటీవల కృష్ణమూర్తిని కలిసి అభినందించారు. 30 ఏళ్లనాటి పాత జ్ఞాపకాలను నెమరువేసుకున్నారు. 'శభాష్' సోదరా అంటూ వెన్నుతట్టి ప్రోత్సహించారు.

- నాగు కాకిముక్కల
పార్వతీపురం రూరల్, 9440081649

మహనీయుల స్ఫూర్తితో సేవ



పేదలు, అభాగ్యులు, అన్నార్థుల బాధలు నాకు బాగా తెలుసు. పేదరికంలోని దయనీయ పరిస్థితులను కళ్లారా చూశా. 30 సంవత్సరాలుగా ఈ సేవా కార్యక్రమాలు కొనసాగిస్తున్నా. సాయం కోసం వచ్చిన వారికి నా వంతుగా ఉన్నంతలో చేస్తున్నా. ప్రతినెలా నాకు వచ్చే జీతంలో రూ.10 వేలు ఆర్థిక సహాయం చేస్తున్నా. 2017 నుంచి క్రమం తప్పకుండా ఏదో ఒక రూపంలో ప్రతినెలా అందజేస్తున్నా. నా సేవలను గుర్తించిన ప్రభుత్వం, అధికారులు, ప్రజాప్రతినిధులు, పోలీసు ఉన్నతాధికారులు అభినందించారు. 40 వరకూ సన్మానాలు జరిగాయి. ఉత్తమ పోలీసు కానిస్టేబుల్‌గా అవార్డులు అందుకున్నా. గతంలో డెంకాడ, బలిజపేట, సాలూరు ప్రాంతాల్లో పనిచేశా. పలుమార్లు ఉత్తమ పోలీసుగా అవార్డులు, సన్మానాలు, ప్రశంసాపత్రాలు అందుకున్నా.

- కొమిరి కృష్ణమూర్తి
హెడ్ కానిస్టేబుల్ (1273), పార్వతీపురం టౌన్ పోలీస్ స్టేషన్.

గాబన్‌లో శాంతిభద్రతలను కాపాడాలి: చైనా

- మిలిటరీ తిరుగుబాటుపై పశ్చిమ దేశాల ఆందోళన

లిబ్రెవిల్లీ: గాబన్‌లో శాంతి, భద్రతల పునరుద్ధరించాలని చైనా పిలుపునివ్వగా, పశ్చిమ దేశాలు గాబన్‌లో మిలిటరీ తిరుగుబాటుపై ఆందోళన వ్యక్తం చేశాయి. ఆఫ్రికన్ దేశాల్లో సైనిక తిరుగుబాట్లు 'పాశ్చాత్య దేశాల నయా వలసవాదానికి, వాటి ఉదారవాద విధానాలకు గట్టి ఎదురు దెబ్బ అని అంతర్జాతీయ పరిశీలకులు విశ్లేషిస్తున్నారు. ఇదిలా వుండగా గాబోనీస్ మిలటరీ అధికారుల చేతిలో బందీగా ఉన్న అధ్యక్షుడు గాంబో గాబన్‌లో తన ప్రభుత్వాన్ని పునరుద్ధరించేందుకు సాయపడాలని అంతర్జాతీయ సమాజాన్ని కోరారు.గాబన్‌లోని సీనియర్ సైనిక అధికారుల బందం బుధవారం అధికారాన్ని స్వాధీనం చేసుకున్నట్లు మీడియా నివేదించిన వెంటనే, కొన్ని పాశ్చాత్య దేశాలు సైనిక తిరుగుబాటును ఖండించాయి. నైగర్ ప్రెసిడెంట్ మొహమ్మద్ బజూమ్‌ను ప్రెసిడెన్షియల్ గార్డు దళాలు బందీగా తీసుకున్న ఒక నెల రోజులకే గాబన్‌లో తిరుగుబాటు, ఆఫ్రికాలో పశ్చిమ దేశాల రాజకీయ సంస్కరణలు, పాలనా నమూనాల వైఫల్యాన్ని స్పష్టంగా ఎత్తి చూపిందని కొందరు చైనా నిపుణులు పేర్కొన్నారు. తిరుగుబాటు గురించి పశ్చిమ దేశాల ఆందోళన అంతా గాబన్‌లోని మానవ హక్కుల గురించి కాదు, తమ ప్రయోజనాలకు వ్యతిరేకమైన కొత్త ప్రభుత్వం అధికారం చేజిక్కించుకుందనే భయంతోనే అవి ఆందోళన వ్యక్తం చేస్తున్నాయని నిపుణులు పేర్కొన్నారు.

సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌పై సైబర్ దాడి

న్యూఢిల్లీ : సుప్రీంకోర్టు వెబ్‌సైట్‌పై సైబర్ దాడి (ఫిషింగ్) జరిగిందని సర్వోన్నత న్యాయస్థానం గురువారం సర్క్యులర్ జారీ చేసింది. రిజిస్ట్రీ వెబ్‌సైట్ మాదిరిగా ఉన్న డొమైన్‌తో ఫేక్ వెబ్‌సైట్‌ను క్రియేట్ చేశారని పేర్కొంది. దీంతో యూజర్ల వ్యక్తిగత, రహస్య సమాచారాన్ని కోరుతున్నారని తెలిపింది. యుఆర్‌ఎల్ ఉన్న వెబ్‌సైట్‌లో యూజర్ల వ్యక్తిగత, రహస్య డేటాను పంచుకోవద్దని అడ్వైజరీ జారీ చేసింది. వ్యక్తిగత డేటాను ఇస్తే నేరగాళ్లు చోరీ చేసే అవకాశాలున్నాయని తెలిపింది. యూజర్లు అనుమానాస్పదంగా ఉండే లింక్‌లపై క్లిక్ చేయొద్దని సర్వోన్నత న్యాయస్థానం కోరింది. అసలైన వెబ్‌సైట్ అని ధ్రువీకరించిన తర్వాత అందులోకి వెళ్లాలని, రిజిస్ట్రీ వ్యక్తిగత సమాచారం, ఆర్థిక వివరాలు, ఇతర సమాచారాన్ని ఎప్పుడూ కోరదని అడ్వైజరీలో తెలిపింది.

హోరాహోరీ తప్పదు

- పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు వికెట్ కీపర్‌గా ఇషాన్
- మిడిలార్డర్‌పైనే దృష్టి
- టీమిండియా కోచ్ ద్రావిడ్



కొలంబో: ఆసియాకప్‌లో పాకిస్తాన్‌తో క్రికెట్ మ్యాచ్ హోరాహోరీ పోరు తప్పదని టీమిండియా కోచ్ రాహుల్ ద్రావిడ్ అభిప్రాయపడ్డాడు. ఆ మ్యాచ్‌కు వికెట్ కీపర్‌గా ఇషాన్ కిషన్ బరిలోకి దిగుతాడని, ప్రధానంగామిడిలార్డర్‌పైనే ప్రధానంగా దృష్టి సారించినట్లు చెప్పుకొచ్చాడు. భారత్-పాకిస్తాన్ క్రికెట్ మ్యాచ్ అంటే అభిమానుల్లోనూ టెన్షన్ నెలకొంటుందని, విశ్వవ్యాప్తంగా ఈ మ్యాచ్ కోసం వేయికళ్లతో ఎదురుచూస్తున్నారని తెలిపాడు. వికెట్ కీపర్, ఓపెనర్ కేఎల్ రాహుల్ ఫిట్‌నెస్ సాధించకపోవడంతో రెండో ప్రత్యామ్నాయ వికెట్ కీపర్ ఇషాన్ కిషన్‌కు తుది జట్టులో చోటు దక్కడం ఖాయమన్నాడు. సంజు శాంసన్ కూడా జట్టుతో కలిసి శ్రీలంకకు చేరుకున్నా.. అతడు పాకిస్తాన్‌తో మ్యాచ్‌కు ఆడేది కష్టమేనని తెలిపాడు. టాప్-3 బ్యాటర్స్ తర్వాత ఇషాన్ మైదానంలోకి దిగనున్నాడని తెలిపాడు. కెప్టెన్ రోహిత్ శర్మకు తోడు శుభ్‌మన్ గిల్ ఓపెనర్లుగా.. ఫస్ట్‌డౌన్‌లో విరాట్ కోహ్లి మైదానంలోకి దిగుతారని తెలిపాడు. మిడిలార్డర్‌లో ఇషాన్, సూర్యకుమార్, శ్రేయస్, తిలక్ వర్మలతో టీమిండియా బలంగా ఉందని పేర్కొన్నాడు. ఆల్‌రౌండర్ల కోటాలో జడేజా, హార్దిక్, అక్షర్ అందుబాటులో ఉన్నారని, పేస్ భారాన్ని బుమ్రా, షమీ, సిరాజ్, శార్దూల్ సమర్ధవంతంగా నిర్వర్తిస్తారన్న నమ్మకముందని హెడ్ కోచ్ రాహుల్ ద్రావిడ్ తెలిపాడు. అలాగే ఏకైక ఫుల్‌టైమ్ స్పిన్నర్ కుల్దీప్‌కు తుదిజట్టులో చోటు దక్కడం ఖాయమని పేర్కొన్నాడు.

ఒక్కో మ్యాచ్‌కు 67.8కోట్లు
డిజిటల్, టివి హక్కులు వయాకామ్-18 సొంతం

మహిళల ప్రీమియర్ లీగ్, ఇండియన్ ప్రీమియర్ లీగ్ మీడియా హక్కులు దక్కించుకున్న వైకోమ్-18 తాజాగా భారత క్రికెట్ బోర్డు(బిసిసిఐ) డిజిటల్, టివి హక్కులను సొంతం చేసుకుంది. గురువారం జరిగిన వేలంలో డిస్నీ స్టార్, సోనీ పిక్చర్స్ నెట్‌వర్క్స్ ఇండియా పోటీదారులను వెనక్కి నెట్టి వైకోమ్-18 చాన్స్ కొట్టేసింది. ఈ విషయాన్ని బిసిసిఐ అధికారికంగా ప్రకటించింది. మొత్తం రూ.5,963 కోట్లకు ఈ హక్కులను దక్కించుకున్నట్లు బిసిసిఐ తెలిపింది. స్వదేశంలో 2023-28 సీజన్‌లో జరిగే అంతర్జాతీయ, దేశవాళీ క్రికెట్ మ్యాచ్‌లను ప్రత్యక్ష ప్రసారం చేసే అవకాశం వయాకామ్‌కు వచ్చింది. టివి ప్రసారాలు స్పోర్ట్స్-18లోనూ, జియో సినిమా ప్లాట్‌ఫామ్‌లో లైవ్‌స్ట్రీమింగ్ అందుబాటులో ఉంటుంది. సెప్టెంబర్ 2023 నుంచి మార్చి 2028 వరకు అంతర్జాతీయంగా 88 ద్వైపాక్షిక మ్యాచ్‌లు ప్రసారం చేసే హక్కులను వయాకామ్ 18 దక్కించుకుంది. ఇందులో 25టెస్టులు, 27వన్డేలు, 36అంతర్జాతీయ టి20లు ఉన్నాయి. ఈ-వేలంలో వయాకామ్‌కు సోనీ పిక్చర్స్, డిస్నీ స్టార్ నుంచి తీవ్ర పోటీ ఎదురైంది.

'గుణ 369'లో మానస వారణాసి



సినీ హీరో కృష్ణ మనవడు, మహేష్ బాబు మేనల్లుడు అశోక్ గల్లాకు రెండో సినిమాకు అంగీకరించారు. 'గుణ 369'. ఫేమ్ అర్జున్ జంధ్యాల దర్శకత్వంలో చేస్తున్నారు. క్రియేటివ్ డైరెక్టర్ ప్రశాంత్ వర్మ కథ అందించారు. లలితాంబిక ప్రొడక్షన్స్ నం.1గా ఎన్నారై (ఫిల్మ్ డిస్ట్రిబ్యూటర్) సోమినేని బాలకృష్ణ ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. కె.సాగర్ సహ నిర్మాత కాగా నల్లపనేని యామిని సమర్పిస్తున్నారు. ఈ చిత్రంలో అశోక్ గల్లాకు జోడిగా మిస్ ఇండియా 2020 మానస వారణాసి హీరోయిన్‌గా నటిస్తున్నారు. గురువారంనాడు ఫస్ట్ లుక్ పోస్టర్ ద్వారా ఆమెను సత్యభామగా పరిచయం చేశారు. అశోక్ గల్లా పుట్టినరోజు సందర్భంగా అతని పాత్రను పరిచయం చేస్తూ గతంలో మేకర్స్ ఒక గ్లింప్స్ విడుదల చేశారు. కంపోజర్ భీమ్స్ సిసిరోలియో సంగీతం అందిస్తున్నారు.



నేడు 'భగవంత్ కేసరి' పాట విడుదల

నందమూరి బాలకృష్ణ, అర్జున్ రాంపాల్, కాజల్ అగర్వాల్, శ్రీలీల' నటిస్తున్న చిత్రం భగవంత్ కేసరి. చిత్ర నిర్మాతలు గణేషుడుపై సాగే పాటకు సంబంధించిన ఫొటోను విడుదల చేశారు. బాలకృష్ణ, శ్రీలీల ఈ సినిమాలో బాబాయ్, కుమార్తెగా నటించారు. ఎస్.థమన్ సంగీతం అందించారు. ఈ పాట శుక్రవారం విడుదల కానుంది. షైన్ స్క్రీన్స్ బ్యానర్‌పై సాహు గారపాటి, హరీష్ పెద్ది ఈ చిత్రాన్ని నిర్మిస్తున్నారు. జాతీయ అవార్డు విజేత అర్జున్ రాంపాల్ ఈ చిత్రంతో టాలీవుడ్‌లోకి అడుగుపెడుతున్నారు. దసరా కానుకగా అక్టోబర్ 19న ఈ సినిమా విడుదల కానుంది.

సరికొత్తగా 'మ్యాడ్'



రక్షా బంధన్ సందర్భంగా సూర్యదేవర నాగవంశీ 'మ్యాడ్' చిత్రాన్ని ప్రకటించారు. నాగ వంశీ సోదరి హారిక సూర్యదేవర ఈ కొత్త చిత్రం 'ప్రొడక్షన్ నెం.18'తో నిర్మాతగా పరిచయమవుతుండటం విశేషం. నాగ వంశీ సమర్పిస్తున్న ఈ చిత్రాన్ని దర్శకుడు త్రివిక్రమ్ శ్రీనివాస్ సతీమణి సాయి సౌజన్యతోపాటు హారిక సూర్యదేవర నిర్మిస్తున్నారు. నార్నె నితిన్, సంగీత్ శోభన్, రామ్ నితిన్, శ్రీ గౌరీ ప్రియా రెడ్డి, అననతిక సనీల్ కుమార్, గోపికా ఉద్యన్ ప్రధాన పాత్రలు పోషిస్తున్నారు.

'జవాన్' ట్రైలర్ వచ్చేసింది!



అట్లీ దర్శకత్వంలో షారుక్ ఖాన్ హీరోగా చేస్తున్న 'జవాన్' సినిమా నుంచి తాజాగా హిందీ ట్రైలర్‌తో పాటు, తెలుగు ట్రైలర్ కూడా విడుదల చేశారు. 'వరుసగా యుద్ధాలు ఓడిపోయి కోపంతో ఉన్న ఒక రాజు ఆకలితో అడవిలో తిరుగుతున్నాడం'టూ హీరో క్యారెక్టర్ థీమ్‌ను చెప్తూ ట్రైలర్‌ను స్టార్ట్ చేశారు. ఈ సినిమాలో షారుఖ్ డ్యూయల్ రోల్‌లో తండ్రి, కొడుకులుగా కనిపించబోతున్నట్లు తెలుస్తోంది. గెస్ట్ రోల్‌లో దీపికా పదుకునే కనిపించింది. అనురుధ్ రవిచంద్రన్ సంగీతం అందించారు. నయనతార, విజయ్ సేతుపతి, ప్రియమణి, యోగిబాబు ఇలా చాలామంది దక్షిణాదివారు ఈ చిత్రంలో నటించారు. సెప్టెంబర్ 7న ఈ సినిమా విడుదలవుతోంది.

స్వియాటెక్, రైబకినా ముందుకు..

- క్విటోవా, క్రేజికోవా ఔట్..
- యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్



న్యూయార్క్: యుఎస్ ఓపెన్ గ్రాండ్‌స్లామ్ టోర్నీలో ఓ సంచలనం నమోదైంది. చెక్ రిపబ్లిక్‌కు చెందిన 11వ సీడ్ క్విటోవా, 12వ సీడ్ క్రేజికోవా రెండోరౌండ్‌ను దాటలేకపోయారు. గురువారం జరిగిన మహిళల సింగిల్స్ రెండోరౌండ్ పోటీలో క్విటోవా 5-7, 6-7(5-7)తో మాజీ నంబర్‌వన్ క్రీడాకారిణి వోజ్నియాకీ(డెన్మార్క్) చేతిలో, క్రేజికోవా 4-6, 6-7(3-7)తో అన్‌సీడెడ్ బ్రోంజెట్టి(ఇటలీ) చేతిలో వరుససెట్లలో ఓడారు. మరో పోటీలో 18వ సీడ్ అజరెంకా(రష్యా) 3-6, 3-6తో జూ(చైనా) చేతిలో, 24వ సీడ్ లినెట్టె(పోలండ్) 1-6, 6-2, 2-6తో బ్రాడీ(అమెరికా) చేతిలో ఓటమిపాలయ్యారు. ఇక 4వ సీడ్ రైబకినా(కజకిస్తాన్)కు రెండోరౌండ్‌లో వాకోవర్ లభించగా.. 20వ సీడ్ ఓస్టాపెంకో 6-3, 5-7, 7-5తో అన్‌సీడెడ్ అవనిస్యేన్(రష్యా) చేతిలో పోరాడి ఓడింది. ఇక టాప్‌సీడ్ ఇగా స్వైటెక్(పోలండ్) 6-3, 6-4తో సవెల్లి(ఆస్ట్రేలియా)పై, 10వ సీడ్ ముఛోవా(చెక్) 6-3, 6-3తో ఫ్రెంచ్(పోలండ్)పై నెగ్గి మూడోరౌండ్‌లోకి దూసుకెళ్లారు. ఇక అమెరికా యువ క్రీడాకారిణి 6వ సీడ్ కోకా గాఫ్ 6-3, 6-2తో ఆండ్రీవా(రష్యా)పై నెగ్గి దూసుకెళ్తోంది.

రూఢ్, సిట్సిపాస్‌కు షాక్..

పురుషుల సింగిల్స్‌లోనూ సంచలనాలు నమోదయ్యాయి. 7వ సీడ్ గ్రీక్‌కు చెందిన సిట్సిపాస్, 7వ సీడ్ రూఢ్(నార్వే) అనూహ్యంగా రెండోరౌండ్‌లోనే ఓటమిపాలయ్యారు. రూఢ్ 4-6, 7-5, 2-6, 6-0, 2-6తో జంగ్(చైనా) చేతిలో, సిట్సిపాస్ 5-7, 7-6(7-2), 7-6(7-5), 6-7(6-8), 3-6తో స్ట్రిక్కర్(స్విట్జర్లాండ్) చేతిలో ఐదుసెట్ల హోరాహోరీ పోరులో ఓడారు. ఇతర పోటీల్లో టాప్‌సీడ్ నొవాక్ జకోవిచ్ 6-4, 6-1, 6-1తో జపట్టా(స్పెయిన్)పై, 10వ సీడ్ టఫీ 6-3, 6-1, 6-4తో ఓఫ్నర్(ఆస్ట్రియా)పై గెలిచి మూడోరౌండ్‌కు చేరారు.

ఫైనల్‌కు మోహన్ బగాన్

కోల్‌కతా: 132వ డురండ్ కప్ ఫైనల్లోకి మోహన్ బగాన్ సూపర్ జెయింట్ జట్టు దూసుకెళ్లింది. గురువారం జరిగిన రెండో సెమీఫైనల్లో మోహన్ బగాన్ జట్టు 2-1గోల్స్ తేడాతో గోవా ఎఫ్‌సిపై విజయం సాధించింది. మోహన్ బగాన్ జట్టు గత ఏడాది టైటిల్‌ను గెలుచుకోగా.. 2000 ఫైనల్లో ఈస్ట్‌బెంగాల్ 2-1గోల్స్‌తో చిత్తుచేసింది. 3న జరిగే ఫైనల్లో టైటిల్‌కై ఈస్ట్‌బెంగాల్‌తో తలపడనుంది.

శ్రీలంక అలవోకగా..

కొలంబో: ఆసియాకప్-2023లో శ్రీలంక జట్టు తొలి లీగ్ మ్యాచ్‌లో అలవోకగా గెలిచింది. బంగ్లాదేశ్‌తో జరిగిన గ్రూప్-బి మ్యాచ్‌లో లంక జట్టు 5 వికెట్ల తేడాతో ఘన విజయం సాధించింది. బంగ్లా నిర్దేశించిన 165పరుగుల లక్ష్యాన్ని లంక జట్టు 39ఓవర్లలో 5వికెట్లు కోల్పోయి ఛేదించింది. తొలుత బంగ్లా జట్టు లంక యువ పేసర్ పథిరన దెబ్బకు 164పరుగులకే కుప్పకూలింది. హొసేన్ శాంటో(89) మినహా ఏ బ్యాటరూ రాణించలేకపోయాడు. ఛేదనలో లంక బ్యాటర్లు సమరవిక్రమ(54), అసలంక(50) అర్ధసెంచరీలతో మెరిసారు. ప్లేయర్ ఆఫ్ ది మ్యాచ్ పథిరనకు లభించింది.

Published and Printed by Mallajosyula Venkata Subrahmanya Sarma on behalf of Prajasakti Printers & Publishers Private Limited from D.No.27-30-4,Akulavari Street,Governorpet, Vijayawada, Krishna Dt., and Printed at Prajasakti Printers & Publishers Private Limited, D.No.14-12-19, Krishna Nagar, Tadepalli (M), Guntur Dt., Editor : Bendi Tulasi Das, Ph : 9490099275, email:editorprajasakthi@gmail.com, RNI Regd.No. 15795/68